www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

అతి వేగానికి ఆరుగురు బలి

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. ఐదుగురు మెడికోల దుర్మరణం

ఇంట్లోని వృద్ధుడూ బలి.. నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

12



ఘటనాస్థలిలో తుక్కుతుక్కైన కారు.. పూర్తిగా కుప్పకూలిన పూరిల్లు.. కారు కింద వృద్ధుడు రమణయ్య మృతదేహం

గురువారం | 1-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం తిథి: చవితి ఉ.11:24 తదుపరి పంచమి, నక్షత్రం: మృగశిర మ. 2:21 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: రా.10:18-11:48, దుర్ముహూర్తం: ఉ.10:05-10:56, మ.3:09-4:00, అమృతఘడియలు: ఉ.6:15-7:44, తె 3:36-5:06, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:52, సూర్యాస్తమయం: 6:31 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చందనోత్సవంలో పెను విషాదం

సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి





సింహాచలం వరాహలక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం సందర్భంగా కూలిన గోడ వద్ద సహాయక చర్యలు (ఇన్‌సెట్) దుర్ఘటనలో అసువులుబాసిన యువ జంట పిల్లా మహేశ్, శైలజ

- నాలుగు రోజుల కిందటే గోడ నిర్మాణం పూర్తి
- బలమైన పునాది లేదు.. నాసిరకంగా పనులు
- సింహాచలంలో భారీ వర్షం, గాలులు
- ఒక్కసారిగా కుప్పకూలిన రిటైనింగ్ వాల్
- సిమెంటు ఇటుకలు, మట్టి కింద నలిగిన భక్తులు
- ఒకే కుటుంబంలో నలుగురు మృతి
- వారిలో మూడేళ్ల కిందట పెళ్లయిన యువజంట
- మృతుల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా
- విచారణకు కమిటీ ఏర్పాటు.. 72 గంటల్లో నివేదికకు సీఎం ఆదేశం.. ముర్ము, మోదీ దిగ్ర్భాంతి



విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. వర్షపు నీటిని మళ్లించేందుకు నిర్మించిన గోడే.. భారీ వర్షానికి కుప్ప కూలింది. సరైన నాణ్యత, బలమైన పునాదిలేకుండా నిర్మించిన రిటైనింగ్ వాల్... కట్టిన మూడు రోజులకే కూలిపోయింది. అప్పన్న నిజరూప దర్శనం కోసం... క్యూలో కదులుతున్న ఏడుగురు భక్తులను

మిగతా 13వ పేజీలో...

దేవుడి శాఖకు ఇన్‌చార్జులే దిక్కు!
ఈవోలూ అదనపు బాధ్యతల్లోనే

సింహగిరిపై నిర్లక్ష్యపు 'గోడ'
హడావుడిగా నాసిరకం పనులు

• క్షణాల్లో సజీవ సమాధి
కూలిన గోడ రాళ్లు, మట్టిలో కూరుకుపోయి కొందరు.. ఇలా నలిగిపోయి కొందరు అక్కడికక్కడే చనిపోయారు



మార్చురీ వద్ద మృతుల కుటుంబీకులను ఓదారుస్తున్న హోంమంత్రి అనిత

దేశవ్యాప్తంగా కులగణన



తదుపరి జనాభా లెక్కలతో పాటు నిర్వహణ.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

- కొన్ని రాష్ట్రాలు రాజకీయ కారణాలతో కులాల లెక్కలు తీశాయి.. అవి అసమగ్రం
- ఇలాంటి వాటితో సమాజంలో సందేహాలు
- ఈ నేపథ్యంలోనే కులగణనకు నిర్ణయం
- దేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండాలన్న లక్ష్యమే ఇందుకు కారణం
- కులగణనకు కాంగ్రెస్ తొలినుంచీ వ్యతిరేకం
- మేం జరిపే జన, కులగణనతో దేశం పటిష్ఠం
- ఏ వర్గాన్నీ నొప్పించకుండా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను మేం తీసుకొచ్చాం
- కేంద్ర సమాచార మంత్రి అశ్వినీ వైష్ణవ్
- సెప్టెంబరు నుంచి జన, కులగణన ప్రారంభం?



మీడియాతో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణనకు విపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో.. మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీలో.. త్వరలో చేపట్టనున్న జనాభా లెక్కలతోపాటే.. కులగణనను నిర్వహించాలని తీర్మానించింది. తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన జరిపిన కాంగ్రెస్‌ను రాజకీయంగా తిప్పికొట్టేందుకు మోదీ అధ్వర్యంలోని క్యాబినెట్ కమిటీ(సీసీపీఏ) తీసుకున్న ఈ నిర్ణయం 'మాస్టర్ స్ట్రోక్' అని రాజకీయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్ ఈ అంశాన్ని విస్మరించిందని బీజేపీ విమర్శించగా.. కాంగ్రెస్ అగ్రనేతలు తమ డిమాండ్ నెరవేరిందని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ ఏకంగా మోదీ సర్కారు 'ఆకస్మిక నిర్ణయం' అని పేర్కొంటూ.. కులగణనను స్వాగతించారు. వామపక్షాలు మాత్రం ఇప్పటికే ఆలస్యం జరిగిందని ఆరోపించాయి. బీజేపీ మిత్రపక్షాలు మోదీ సర్కారు నిర్ణయాన్ని స్వాగతించాయి. దేశంలో 'సమ్మిళిత వృద్ధి' వేగం పుంజుకుంటుందని అభిప్రాయపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరులో జన, కులగణనను ప్రారంభించి.. రెండేళ్లలో ముగించనున్నట్లు తెలిసింది. బుధవారం నాటి క్యాబినెట్ భేటీ తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరాలను వెల్లడిస్తూ.. కాంగ్రెస్‌పై మండిపడ్డారు. తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు

మిగతా 12వ పేజీలో...



11 ఏళ్లుగా విస్మరించి..

ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారు

అయినా స్వాగతిస్తున్నాం: రాహుల్

మోదీ నిబద్ధతకు నిదర్శనం

ప్రధాని మోదీకి సమ్మిళిత పాలన పట్ల ఉన్న నిబద్ధతను కులగణన నిర్ణయం ప్రతిబింబిస్తుంది. ఈ నిర్ణయం దేశంలోని అణగారిని వర్గాల అవసరాలను తీర్చేందుకు అవసరమైన సమాచార సేకరణకు దోహదపడుతుంది. సామాజిక న్యాయం పునాదులను బలోపేతం చేస్తుంది. - చంద్రబాబు



ఏ క్షణంలోనైనా పాక్‌పై దాడి?



సర్వసన్నద్ధమవుతున్న భారత్!

- అమెరికా, చైనా సహా పలు దేశాలకు పరిస్థితిని వివరించిన విదేశాంగ శాఖ
- పీ5 దేశాలతో జైశంకర్ చర్చలు
- తాలిబాన్ కూడా మనవైపే..
- సీసీఎస్ భేటీలో సైనిక సన్నద్ధతపై ప్రధాని సమీక్ష
- కీలక విన్యాసాలు ప్రారంభించిన త్రివిధ దళాలు
- జాతీయ భద్రతా సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణ
- చైర్మన్‌గా 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి
- తెలుగు అధికారి వెంకటేశ్ వర్మకూ స్థానం
- మాపై నేడో, రేపో సైనిక దాడి
- దాడి చేస్తే భారత్‌కు మూల్యం తప్పదు: పాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు భారత్ సిద్ధమవుతోందా? ఏ క్షణంలోనైనా పాక్‌పై విరుచుకుపడేందుకు సన్నద్ధమవుతోందా? దాయాదికి గట్టి గుణపాఠం నేర్పనుందా? పహల్గాం ఉగ్రదాడికి బదులు తీర్చుకోనుందా? కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని చూస్తే అవుననే అనిపిస్తోంది. పాకిస్థాన్ కూడా తమపై నేడో రేపో దాడి జరగడం తథ్యమని భావిస్తోంది. మొత్తంమీద మోదీ సర్కారు పాక్‌పై ఏ క్షణంలోనైనా విరుచుకుపడేందుకు సర్వసన్నాహాలు చేస్తోంది. 2018 నుంచీ పెద్దగా పనిలేకుండా ఉన్న జాతీయ భద్రతా సలహా

మిగతా 2వ పేజీలో...



14

డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా

పూర్తిస్థాయి నియామకానికి ఓకే!

యూపీఎస్సీ ప్యానెల్ ద్వారా ఎంపిక

మే నెలలో మంటలే

నైరుతి సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు

వాతావరణ శాఖ బులెటిన్ విడుదల

12

చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

తెరుచుకున్న యమునోత్రి, గంగోత్రి దేవాలయాలు

శుక్రవారం కేదార్‌నాథ్, ఆదివారం బద్రీనాథ్

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

2

తలెత్తుకునేలా అమరావతి



రేపే రాజధాని పనులు పునఃప్రారంభం

- ప్రధాని మోదీ చేతుల మీదుగా రూ.49,040 కోట్ల పనులకు శ్రీకారం
- మరో 57,962 కోట్ల పనులకూ పచ్చ జెండా
- అమరావతి స్వయం ఆధారిత ప్రాజెక్టు
- మూడేళ్లలోనే మౌలిక సదుపాయాల కల్పన
- రాజధాని ఆదాయంతో మరింత వృద్ధి, సంక్షేమం
- ఈ నెలలోనే అన్నదాత, తల్లికి వందనం
- దేశంలో అత్యధిక పెట్టుబడులు ఏపీకే
- వీటిపై తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి
- ఎంపీలు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం
- ప్రతిష్ఠాత్మకంగా మోదీ సభ.. లోపాలు ఉండొద్దు
- మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష

కర్ణాటక వాళ్లు మా బెంగళూరు, తెలంగాణ ప్రజలు మా హైదరాబాద్, తమిళనాడు వాసులు మా చెన్నై అని అంటారు. మన రాష్ట్ర ప్రజలు కూడా మా అమరావతి అని గర్వంగా చెప్పుకొనేలా రాజధానిని నిర్మిస్తాం. - సీఎం చంద్రబాబు

అమరావతి/న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు, రాజధాని రైతుల పోరాటానికి ఫలితం లభించిందని, అన్ని వర్గాల ప్రజలూ, యువత ఆకాంక్ష తీరే విధంగా అమరావతి నిర్మాణం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో రాజధానికి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణం ఇచ్చాయని తెలిపారు. రాజధానిలో రూ.49,040 కోట్ల పనులకు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా

మిగతా 14వ పేజీలో...



ఒప్పంద పత్రాలతో లోకేశ్ సమక్షంలో యునిసెఫ్, ఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు

నిరుద్యోగ యువతకు యునిసెఫ్ శిక్షణ

3 యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ఇంటికో పారిశ్రామికవేత్త, స్వర్ణాంధ్రకు తోడ్పాటు

మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధితోపాటు సాధికారత సాధించేలా శిక్షణ ఇచ్చేందుకు యునిసెఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర మానవవనరులశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జరిగిన ఈ కీలక ఒప్పంద పత్రాలపై రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు,

మిగతా 11వ పేజీలో...

2026 దాకా ఆగాల్సిందే!

12

- రాత్రికి రాత్రే డీలిమిటేషన్ చేయలేం: కేంద్రం
- వచ్చే ఏడాది జనాభా లెక్కల వరకు వేచి చూడాలి
- నియోజకవర్గాల పునర్విభజనపై సుప్రీంలో వాదనలు
- కశ్మీర్‌లాగే ఏపీ, తెలంగాణలోనూ అసెంబ్లీ సీట్లు పెంచాలి
- 2022 నాటి పిటిషన్‌పై తీర్పు రిజర్వ్‌చేసిన ధర్మాసనం

శ్రీశైలం రాతి గోడలకు సపోర్టు వాల్స్!

3

- కొండ భాగం కోతకు గురికాకుండా చూడాలి
- రాష్ట్రానికి జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచన
- జింబాబ్వే డ్యాం తరహాలో ప్లంజ్‌పూల్ మరమ్మతులు
- అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ బృందం సూచన
- మరమ్మతులకు టెక్నాలజీ, డిజైన్లు ఇస్తామని వెల్లడి

ఏ క్షణంలోనైనా పాక్‌పై దాడి?

(మొదటిపేజీ తరువాయి)

బోర్డును మోదీ సర్కారు తాజాగా పునర్వ్యవస్థీకరించింది. 'రా' మాజీ చీఫ్‌ను చైర్మన్‌గా, ఆరుగురు కీలక అధికారులనుసభ్యులుగా నియమించింది. పాక్ సీమాంతర ఉగ్రవాదం గురించి చాటిచెప్పడంతోపాటు తాము తీసుకోబోయే చర్యలను వివరించేందుకు భారత్ జీ-20, గల్ఫ్ దేశాలతో సహా ఇప్పటికే 25 ప్రధాన దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తాలిబాన్‌ను కూడా విశ్వాసంలోకి తీసుకున్నట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడిని తాలిబాన్ తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో పాకిస్థాన్ ఇప్పటికే తాలిబాన్ తిరుగుబాటును ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్ ప్రకాశ్ నేతృత్వంలో భారత ప్రతినిధులు కాబూల్ చేరుకుని తాలిబాన్ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపారు. తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్వయంగా పీ5 దేశాలైన అమెరికా, చైనా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో మాట్లాడారు. మరోవైపు బుధవారం రెండోసారి జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ప్రధాని మోదీ త్రివిధ దళాల సన్నద్ధతపై సమీక్షించారు. త్రివిధ దళాలు ఇప్పటికే కీలక విన్యాసాలు ప్రారంభించాయని అధికారులు ప్రధానికి వివరించినట్లు తెలిసింది. భారత వైమానిక దళం 'ఆక్రమణ్' పేరుతో నేలపై, పర్వతాలపై దాడులు జరిపేందుకు విన్యాసాలు ప్రారంభించగా, ఆర్మీ నైరుతి కమాండ్ తమ దళాలకు ఆయుధాల ప్రయోగంలో శిక్షణను ముమ్మరం చేసింది.



మంగళవారం డెహ్రాడూన్‌లో సైనికుల విన్యాసాలు(ఫైల్)

పాక్ కాల్పులు.. భారత్ ఎదురుకాల్పులు..

జమ్మూకశ్మీరులోని పరగవాల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద నిబంధనలను ఉల్లంఘించి బుధవారం పాక్ దళాలు కాల్పులు జరిపాయి. వారికి మన సైన్యం ఎదురు కాల్పులతో దీటైన జవాబిచ్చింది. మరోవైపు సింధు జలాల ఒప్పందం రద్దును అమలు చేసే విషయమై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ బుధవారం రాత్రి కీలక చర్చలు జరిపారు.

జాతీయ భద్రతా సలహా బోర్డు..

భారతదేశ రక్షణ పరిస్థితిని విశ్లేషించి, ఎప్పటికప్పుడు సిఫారసులు చేసేందుకు గాను జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించారు. దీనికి చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషీని నియమించారు. ఈ బోర్డులో ముగ్గురు సైనిక నేపథ్యం, ఇద్దరు పోలీసు నేపథ్యం, ఒకరు విదేశాంగ వ్యవహారాల నేపథ్యం కలిగిన వారు ఉన్నారు. సదరన్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, వెస్ట్రన్ ఎయిర్ మాజీ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, మాజీ రేర్ అడ్మిరల్ మాంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, విదేశాంగ శాఖ మాజీ అధికారి బి.వెంకటేశ్ వర్మ వీరిలో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ ఐఎఫ్ఎస్ అధికారి వెంకటేశ్ వర్మ హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో, నిజాం కాలేజీలో చదివారు. 1988 బ్యాచ్ అధికారి అయిన వర్మ.. రష్యా, చైనా దేశాలకు రాయబారిగా పనిచేశారు. భారత్-అమెరికా అణు ఒప్పందంలో కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్‌పై తదుపరి దశ ఆంక్షలు, దాడులపై ఈ బోర్డు సలహాలు ఇవ్వనుంది.

పాక్‌కు మన గగనతలం బంద్

పాకిస్థాన్‌కు చెందిన అన్ని రకాల విమానాలకు గగనతలాన్ని మూసివేస్తూ భారత్ బుధవారం నిర్ణయం తీసుకుంది. పాక్ ఇప్పటికే భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. తాజాగా భారత్ ఆ చర్య తీసుకుంది. దీనితో పాక్ నుంచి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లే విమానాలు.. చైనా లేదా శ్రీలంక మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. ఇప్పటికే ఆర్థికంగా కుదేలైన పాక్ విమానయాన సంస్థలకు దీనితో మరింత దెబ్బతగలడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు.

786 పాకిస్థాన్‌కు.. 1,465మంది భారత్‌కు..

పాకిస్థానీల వీసాల రద్దు నిర్ణయం తర్వాత భారతదేశం నుంచి 786 మంది పాక్ దేశస్థులు వెళ్లిపోయారు. వీరిలో దౌత్యవేత్తలు, వారి కుటుంబసభ్యులు, సిబ్బంది కూడా ఉన్నారు. వీరితో పాటు పాక్ వీసా కలిగి ఉన్న 8 మంది భారతీయులు కూడా వెళ్లిపోయారు. మరోవైపు, పాకిస్థాన్ నుంచి 1,465 మంది ఇండియాకు వచ్చారు.

ఆలస్యం చేయొద్దు: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాంలో 28 మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రమూక భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ దాడికి బాధ్యులైన వారిపై ఆలస్యం చేయకుండా ప్రధాని మోదీ కఠిన చర్యలు తీసుకోవాలని.. తద్వారా ఇలాంటి మూర్ఖపు చేష్టలకు పాల్పడితే భారత్ ఎంతమాత్రం ఉపేక్షించదనే గట్టి సందేశాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. పహల్గాం ఘటనలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలకు తమ నుంచి వందశాతం మద్దతు ఉంటుందని రాహుల్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

'భాక్రా నంగల్' జలాల్ని మాకివ్వండి

- రాష్ట్ర తాగునీటి అవసరాలు తీరతాయి
- లేదంటే అదనపు నీరు పాక్‌కు వెళ్తుంది
- పంజాబ్‌ను కోరిన హరియాణా సీఎం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: భాక్రా నంగల్ రిజర్వాయ జలాలను తమ రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ పంజాబ్ ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే అదనపు జలాలు అనవసరంగా పాకిస్థాన్‌కు వెళ్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పాక్‌తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన నేపథ్యంలో సైనీ ఈ అభ్యర్థన చేయడం గమనార్హం. సింధు జలాల ఒప్పందం పరిధిలోకి అతిపెద్ద భాక్రా నంగల్ రిజర్వాయర్ కూడా వస్తుంది. వర్షాకాలంలోపు ఈ జలాశయంలోని నీటిని ఖాళీ చేయాల్సి ఉందని, అప్పుడే వరద నీటిని నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని సైనీ తెలిపారు. తమ రాష్ట్రానికి తాగునీటి అవసరాలకు నీళ్లివ్వాలని.. లేదంటే అదనపు జలాలు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. హరియాణా ఇప్పటికే వాటాకు మించి జలాలను వాడుకుందన్న పంజాబ్ ప్రకటనపై స్పందిస్తూ.. అసలు తమకు రావాల్సిన వాటా జలాలు పూర్తిగా అందుబాటులోకి రాలేదని సైనీ చెప్పారు. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన నేపథ్యంలో.. చీనాబ్, జీలం సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

భారత్ దెబ్బకు పాక్‌లో ఎండిన చీనాబ్!


- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా శాటిలైట్ చిత్రాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేయడంతో దాయాది దేశం పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. రోజుల వ్యవధిలోనే పాక్‌లోని సియాల్‌కోట్‌లో ప్రవహించే చీనాబ్ నది ఎండిపోయింది. దీనికి సంబంధించిన శాటిలైట్ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పాక్‌కు జీవనాడి అయిన సింధు జలాలను కట్టడి చేయడంతో.. ఏప్రిల్ 29వ తేదీ కల్లా పొరుగు దేశంలో ప్రధాన నది అయిన చీనాబ్‌లో ప్రవాహాలు పూర్తిగా కనుమరగయ్యాయి.

పాక్‌లో హఫీజ్ విలాస జీవితం!

- లాహోర్‌లో కట్టుదిట్టమైన భద్రత మధ్య జీవనం
- బట్టబయలు చేసిన శాటిలైట్ ఫొటోలు, వీడియోలు



లాహోర్, ఏప్రిల్ 30: ముంబై పేలుళ్ల సూత్రధారి, లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థ చీఫ్ హఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో విలాసవంతమైన జీవితం గడుపుతున్న విషయం బట్టబయలైంది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తాజాగా బయటికి వచ్చాయి. పాకిస్థాన్ ప్రభుత్వం అతనికి కట్టుదిట్టమైన భద్రతను కల్పించిన విషయం కూడా ఈ ఫొటోలు, వీడియోల ద్వారా తెలుస్తోంది. పాకిస్థాన్ రాజధాని లాహోర్‌లో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలోనే అతడు నివసిస్తున్నాడు. తాజాగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి కూడా అతడే ప్రధాన సూత్రధారిగా భావిస్తున్నారు. హఫీజ్ సయీద్ నివాసం ఉండే ప్రాంతంలో 24 గంటలూ భద్రత కల్పిస్తున్నారు. ఉపగ్రహ చిత్రాల్లో మూడు ఆస్తులు కనిపిస్తున్నాయి. వాటిలో ఒక పెద్ద భవనంలో అతడు నివసిస్తున్నాడు. అదే మసీదు. దీంతోపాటు మదరసా, హఫీజ్‌కు వ్యక్తిగత సౌకర్యాలు కల్పించిన ప్రైవేటు పార్కు కూడా ఉన్నాయి. ఆ ప్రైవేటు పార్కు కొత్తగా నిర్మించినది. అతడు జైల్లో ఉన్నాడని పాకిస్థాన్ ప్రభుత్వం చెబుతున్నది అబద్ధమేనని తాజా వీడియోలు స్పష్టం చేస్తున్నాయి.

చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

ఉత్తరకాశీ/డెహ్రాడూన్, ఏప్రిల్ 30: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని యమునోత్రి, గంగోత్రి దేవాలయాల తలుపులు భక్తుల కోసం తెరుచుకున్నాయి. దీంతో లక్షలాది మంది భక్తులు ఎదురుచూస్తున్న పవిత్ర చార్‌ధామ్ యాత్ర ప్రారంభమయింది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలో యమునోత్రి, గంగోత్రి దేవాలయాలు ఉన్నాయి. కేదార్‌నాథ్ దేవాలయాన్ని శుక్రవారం, బద్రీనాథ్ దేవాలయాన్ని ఆదివారం తెరుస్తారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభాన్ని పురస్కరించుకొని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఎక్స్‌లో భక్తులకు స్వాగతం పలికారు. చార్‌ధామ్ యాత్ర యమునోత్రితో ప్రారంభమై గంగోత్రి, కేదార్‌నాథ్‌ల మీదుగా సాగి బద్రీనాథ్‌తో ముగుస్తుంది.

చెరుకు గిట్టుబాటు ధర రూ.355కు పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: చెరుకు రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. చెరుకు గిట్టుబాటు ధర(ఎఫ్ఆర్‌పీ)ను క్వింటాల్‌కు 4.41% మేర పెంచి రూ.355 చేసింది. ఈ ఏడాది అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే 2025-26 సీజన్ నుంచి ఈ ధరలు అమలులోకి వస్తాయి. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. షుగర్ మిల్లులు చెరుకు రైతులకు చెల్లించే కనీస గిట్టుబాటు ధరను ఎఫ్ఆర్‌పీ(ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్) అంటారు. ప్రస్తుతం 2024-25 సీజన్‌కు గాను ఈ ఎఫ్ఆర్‌పీ క్వింటాల్‌కు రూ.340గా ఉంది.

ఏపీటీఎస్ ఎండీగా సూర్యతేజ

- ఇ- ప్రగతి సీఈవోగా ప్రఖార్ జైన్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీగా మల్లవరపు సూర్యతేజను నియమిస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవోగా సూర్యతేజ పూర్తి అదనపు బాధ్యతలు చేపడతారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈవో ప్రఖార్ జైన్‌కు ఇ-ప్రగతి సీఈవోగా బాధ్యతలను అప్పగిస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ బుధవారం ఉత్తర్వు జారీ చేశారు.

యానాం 'జిప్‌మర్'కు ఏపీ సేవలు

- వైద్య విద్యా సంస్థకు అన్ని విధాలా అండగా ఉంటాం: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): యానాంలోని జిప్‌మెర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అవసరమైన సాయాన్ని అందిస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో భాగమైన యానాంలో ప్రఖ్యాత జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(జిప్‌మర్) వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించింది. అయితే.. ఈ సంస్థ ద్వారా ప్రజలకు సేవలందించడానికి జిప్‌మర్ ఏపీ సాయాన్ని కోరింది. ఈ విషయంపై యానాం ఆరోగ్యశాఖ మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, జిప్‌మెర్ డైరెక్టర్ వీయస్ నేగి, ఉన్నతాధికారులు బుధవారం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో చర్చించారు. తమ మల్టీ స్పెషాలిటీ విభాగాల్లో సేవలందించడానికి అవసరమైన సిబ్బందిని సమకూర్చాలని కృష్ణారావు కోరారు. జిప్‌మర్ సేవలను తెలుగు వారు కూడా వినియోగించుకుంటున్నారని, ఈ నేపథ్యంలో సంస్థకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సత్యకుమార్ అంగీకరించారు. సంబంధిత ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

లోకం తీరు



పాక్ సైన్యంలో తిరుగుబాటు?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధానికి దిగుతుందని పాకిస్థాన్ పాలకులే కాదు.. సైన్యం కూడా భయపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. కొందరు సైనికులు, సైన్యాధికారులు తిరుగుబాటు చేయగా.. పలువురు ఏకంగా ఆర్మీకే గుడ్‌బై చెప్పేశారని 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక తాజాగా కథనం ప్రచురించింది. అన్నిటి కంటే ముఖ్యంగా.. ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతున్నట్లు వెల్లడించింది. ఆయన పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ రావల్పిండిలో బంకర్లో దాక్కుని ఉన్నారని పాక్ ప్రభుత్వంలో కొందరు అధికారులు చెబుతుండగా.. కుటుంబంతో కలిసి విదేశాలకు పరారయ్యారని సోషల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయితే, పాక్ దీన్ని కొట్టిపారేసింది. యుద్ధభయంతో కుటుంబ సభ్యుల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే 4,500 మంది సైనికులు, 250 మంది సైన్యాధికారులు పాక్ సైన్యానికి గుడ్‌బై చెప్పేశారని 'ది డైలీ గార్డియన్' పత్రిక తెలిపింది. ఇంకొన్ని వేల మంది ఉద్యోగాలకు రాజీనామా దరఖాస్తులు సమర్పించారు. దీంతో ఆర్మీ చీఫ్ మునీర్ షాకైనట్లు తెలిసింది. సైన్యంలో ధైర్య స్థైర్యాలు నింపేందుకు ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డీజీ మేజర్ జనరల్ ఫైసల్ మెహమూద్ మాలిక్‌ను రంగంలోకి దించారు. ఆయన అన్ని ర్యాంకుల సాయుధ బలగాల నుద్దేశించి ఏప్రిల్ 26న రాసిన రహస్య లేఖ వెలుగులోకి వచ్చింది. మనోబలం కోల్పోవద్దని.. దేశానికి విశ్వాసపాత్రులుగా ఉండాలని మాలిక్ అందులో కోరారు.

24-36 గంటల్లో మాపై దాడి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: రాబోయే 24-36 గంటల్లో (నేడో, రేపో) భారతదేశం తమపై సైనిక దాడి చేస్తుందని పాకిస్థాన్ సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అతవుల్లా తరార్ అన్నారు. ఈ విషయమై తమకు విశ్వసనీయ సమాచారం ఉందని చెప్పారు. సైనిక చర్య కోసం భారత్.. పహల్గాం ఉగ్రదాడిని సాకుగా వాడుకోవాలని చూస్తోందన్నారు. భారత్ దాడి చేస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సైనిక దాడి తర్వాతి పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలపై భారత్ స్పందించలేదు. త్రివిధ దళాలకు భారత ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందన్న వార్తల నేపథ్యంలో తరార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, భారత్ దాడి చేస్తుందన్న అంచనాల నేపథ్యంలో ఇస్లామాబాద్, లాహోర్ నగరాలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. ఈ రెండు నగరాల గగనతలంలో ఎలాంటి విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు ఎగరకుండా ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. పాకిస్థాన్‌లో రెగ్యులర్ విమాన సర్వీసులను కూడా తగ్గించినట్లు సమాచారం. పాక్ ఆక్రమిత కశ్మీరులోని గిల్గిట్, స్కర్దు వైపు వెళ్లే విమాన సర్వీసులను ప్రైవేటు విమాన సంస్థలు రద్దు చేశాయి. కాగా, పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కూడా తరార్ చేసినటువంటి వ్యాఖ్యలే చేశారు. పాకిస్థాన్‌పై ఇండియా తప్పకుండా దాడి చేస్తుందని భావిస్తున్నానని చెప్పారు.



తరార్

రంగంలోకి ఐక్యరాజ్య సమితి

- ఉగ్రదాడిని ఖండించిన గుటెర్రస్
- జైశంకర్‌కు, పాక్ ప్రధానికి ఫోన్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్రదాడితో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఐక్యరాజ్య సమితి రంగంలోకి దిగింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో పాటు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ మంగళవారం వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. భారత్-పాక్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. విషాదకర పరిణామాలకు దారితీసే ఘర్షణను నివారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. కాగా, ఈ మారణకాండకు పాల్పడిన వారితో పాటు దీనికి కుట్రదారులు, మద్దతుదారులను కఠినంగా శిక్షించాలని భారత్ కృతనిశ్చయంతో ఉందని ఆయనకు వివరించినట్లు జైశంకర్ ఓ పోస్టులో తెలిపారు. కాగా, పహల్గాం ఘటనపై పారదర్శకమైన, తటస్థ దర్యాప్తు కోసం విజ్ఞప్తి చేశానని షరీఫ్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఉగ్రదాడిపై అల్జీరియా, గ్రీస్, సియెర్రా లియోన్, గయానా, స్లొవేనియా, సోమాలియా, పనామా దేశాల విదేశాంగ మంత్రులతో జైశంకర్ చర్చించారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంతో పాటు భారత్‌కు సంఘీభావం తెలిపినందుకు ఆయా దేశాలకు జైశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

భారత్‌పై పాక్ దుష్ప్రచార యుద్ధం!

యుద్ధానికి ఆర్మీ సిద్ధంగా లేదని.. రక్షణ సమావేశంలో తేల్చారంటూ నకిలీ పత్రాల సర్క్యులేషన్

- పహల్గాం దాడికి భద్రతా వైఫల్యమే కారణమంటూ జనరల్ సుచీంద్రను తొలగించారనే వదంతులు
- అవన్నీ అవాస్తవాలని తేల్చిన పీఐబీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అంతర్జాతీయంగా పాకిస్థాన్ దుర్నీతిపై చర్చ జరుగుతుండటం, భారత్ తీవ్ర చర్యలు చేపట్టిన నేపథ్యంలో... పాకిస్థాన్ తప్పుడు ప్రచారాలకు దిగింది. ఆ దేశానికి చెందిన మీడియా, సోషల్ మీడియా ఖాతాల ద్వారా అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం ఈ దుష్ప్రచారం నిగ్గు తేల్చి.. నకిలీ వార్తలని స్పష్టం చేస్తూ వస్తోంది. అయినా పాక్ నుంచి ఇలాంటి తప్పుడు ప్రచారం మరింతగా సాగుతూనే ఉంది. భారత సైన్యం మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని రక్షణ వర్గాలు తెలిపాయి. కేంద్ర సైబర్ నిఘా సంస్థలు ఇలాంటి తప్పుడు ప్రచారంపై చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టి, తగిన చర్యలు చేపట్టనున్నాయని వెల్లడించాయి. పౌరులెవరూ ఈ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించాయి. అసలు పహల్గాం ఉగ్రదాడికి స్థానిక ఉగ్రవాదులే కారణమని, భద్రతా వైఫల్యంతోనే దాడి జరిగిందని భారత్ తేల్చిందని.. అందుకే నార్తర్న్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్‌ను పదవి నుంచి తొలగించి, విచారణ చేపట్టారని పాక్ మీడియా, సోషల్ మీడియా ఖాతాల్లో ప్రచారం చేయడం మొదలుపెట్టింది. నిజానికి సుచీంద్రకుమార్ ఏప్రిల్ 30న పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో.. ఆ స్థానంలో లెఫ్టినెంట్ ప్రతీక్ శర్మకు బాధ్యతలు అప్పగించారు.

+ అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ నౌకను పేల్చివేస్తామంటూ యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు హెచ్చరించారని, దానికితోడు యుద్ధ నౌకలో అగ్ని ప్రమాదం జరగడంతో.. భారత్ దాన్ని వెనక్కి పిలిపించిందంటూ కూడా ప్రచారం చేస్తున్నారు. కానీ అవసరమైతే పాకిస్థాన్‌పై దాడి చేయడానికి వీలుగా ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అరేబియా సముద్రంలోనే మోహరించి ఉంచారు.

+ ఏవో చిన్నపాటి దాడులు తప్ప.. పాక్‌పై పూర్తిస్థాయిలో దాడికి ఆర్మీ సిద్ధంగా లేదని యుద్ధ సన్నాహాల సమావేశంలో తేల్చారంటూ.. కొన్ని నకిలీ పత్రాలను పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాల ద్వారా వైరల్ చేస్తున్నారు. అవి తప్పుడు పత్రాలని పీఐబీ తేల్చింది.

+ ఇక కశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లో ఎల్వోసీ వెంట భారత రాఫెల్ యుద్ధ విమానాన్ని పాక్ కూల్చివేసిందంటూ ఓ వీడియోను సర్క్యులేట్ చేస్తున్నారు. నిజానికి అది గత ఏడాది మహారాష్ట్రలో కూలిపోయిన సుఖోయ్-30ఎంకేఐ యుద్ధ విమానం తాలుకు వీడియోగా తేల్చారు.



జనరల్ సుచీంద్రను తొలగించారంటూ పాకిస్థాన్ చేసిన ప్రచారాన్ని ఫ్యాక్ట్ చెక్ చేసి వదంతులుగా కొట్టిపారేస్తూ పీఐబీ పోస్టు చేసిన చిత్రం

అగ్నికీలల్లో ప్రాణాలు బుగ్గి!

- కోల్‌కతాలో అగ్నిప్రమాదం ..14మంది మృతి

కోల్‌కతా, ఏప్రిల్ 30: కోల్‌కతాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. సెంట్రల్ కోల్‌కతాలోని ఓ హోటల్(లాడ్జి)లో మంగళవారం సాయంత్రం మంటలు చెలరేగి ఇద్దరు చిన్నారులు సహా 14 మంది దుర్మరణం చెందారు. మరో 13 మంది ఆస్పత్రిపాలవ్వగా వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. నగరంలోని ప్రముఖ హోల్‌సేల్ మార్కెట్ అయిన బుర్రాబజార్‌లోని ఇరుకైన సందుల్లో ఉన్న రితురాజ్ హోటల్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఆరు అంతస్తులలో ఉన్న రితురాజ్ హోటల్‌లోని 42 గదుల్లో ప్రమాదం జరిగిన సమయంలో 88 మంది అతిథులు ఉన్నారు. అయితే, ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం సాయంత్రం ఏడున్నర గంటల తర్వాత హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లో భవనం అంతా వ్యాపించాయి. హోటల్‌లో నుంచి బయటికి వచ్చేందుకు భవనంలో ఒకేఒక్క సన్నని మెట్ల మార్గం ఉండడంతో చాలామంది బయటికి రాలేక లోపలే ఇరుక్కుపోయారు. కొందరు భవనంపైకి ఎక్కారు. అయితే, అగ్నికీలలు చెలరేగతుండడం, భవనం అంతా పొగ వ్యాపించడంతో.. కాలిన గాయాలతో కొందరు, పొగ వల్ల ఊపిరాడక మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. అగ్నికీలల నుంచి తప్పించుకునేందుకు కొందరు భవనం కిటికీల్లోంచి కిందికి దూకి చనిపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 10 గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

డిజిటల్ యాక్సెస్ ప్రాథమిక హక్కు

- సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: డిజిటల్ యాక్సెస్ ఓ ప్రాథమిక హక్కు అని, ప్రజలందరికీ దానిని ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికైనా, సమాజంలో వెనుకబాటుకు గురవుతున్న వర్గాల వారికైనా సమానంగా డిజిటల్ సేవలు అందాల్సిందేనని పేర్కొంది. రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాల(పిల్)ను విచారించిన జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మాధవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చరిత్రాత్మక తీర్పును బుధవారం వెలువరించింది. డిజిటల్ అంతరాలను తగ్గించడం ఇక ఎంతమాత్రం విధానపరమైన విచక్షణకు సంబంధించిన అంశం కాదని, గౌరవప్రదంగా జీవించే హక్కును పరిరక్షించేందుకు రాజ్యాంగపరమైన ఆవశ్యకత ఉన్న అంశంగా మారిందని ధర్మాసనం స్పష్టం చేసింది. "ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర సేవలు, పాలన, విద్య, ఆరోగ్య భద్రత, ఆర్థిక అవకాశాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అందుతున్నాయి. ఈ సాంకేతిక యుగంలో రాజ్యాంగంలోని అధికరణ 21 కింద జీవించే హక్కును పునర్నిర్వచించి ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా ఉంది. అసమానతలతో కూడిన డిజిటల్ పరికరాలు, నైపుణ్యం, కంటెంట్ ద్వారా డిజిటల్ విభజన కొనసాగుతోంది" అని కోర్టు పేర్కొంది. కోర్టు విచారించిన రెండు పిల్స్‌లో ఒకటి యాసిడ్ దాడి బాధితురాలు ప్రజ్ఞ ప్రసూన్ దాఖలు చేశారు. ఓ బ్యాంకులో ఖాతా తెరిచేందుకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) సమర్పణలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. యాసిడ్ దాడిలో తన ముఖం ఆకృతి మారిపోవడంతో పాటు, కళ్లకు కూడా చాలా నష్టం కలగడంతో కనురెప్పలను మూయలేక బ్యాంకులో లైవ్ కేవైసీ పూర్తి చేయలేకపోయానని ఆమె వాపోయారు. తనలాంటి యాసిడ్ దాడి బాధితుల విషయంలో కేవైసీ పూర్తి చేయడానికి కేంద్రానికి తగిన మార్గదర్శకాలు జారీచేయాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కేవైసీ విధివిధానాలను మార్చాల్సిన ఆవశ్యకత ఉందని ధర్మాసనం స్పష్టం చేస్తూ 20 మార్గదర్శకాలను జారీ చేసింది.

మా కంపెనీ కోడ్‌లో 30 శాతం.. ఏఐతోనే!

- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడి



వాషింగ్టన్, ఏప్రిల్ 30: ప్రస్తుతం తమ కంపెనీ కోడ్‌లో 20 నుంచి 30 శాతం వరకూ కృత్రిమమేధ (ఏఐ) తోనే రాస్తున్నామని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తెలిపారు. ఏఐతో కోడ్ రాయించే ప్రక్రియను రోజురోజుకీ పెంచుతున్నామన్నారు. మంగళవారం అమెరికాలోని కాలిఫోర్నియాలో మెటా కంపెనీ ఏఐ అంశంపై నిర్వహించిన ఓ కార్యక్రమంలో.. ఆ సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌తో మాట్లాడుతూ సత్య నాదెళ్ల ఈ వివరాలు వెల్లడించారు. కోడ్ తయారీలో మెటా ఏ మేరకు ఏఐను వాడుతోందని జుకర్‌బర్గ్‌ని సత్య నాదెళ్ల ప్రశ్నించగా.. తనకు కచ్చితమైన వివరాలు తెలియవన్నారు. కాకపోతే భవిష్యత్తులో తమ కంపెనీకి చెందిన ఏఐ లామా వర్షన్లను రూపొందించేందుకోసం అవసరమైన ఏఐ మోడల్‌ను తయారుచేస్తున్నామని జుకర్‌బర్గ్ తెలిపారు. వచ్చే ఏడాదికి తమ ప్రాజెక్టుల అభివృద్ధిలో దాదాపు సగం మేర ఏఐనే వాడతామన్నారు. తమ కంపెనీ కోడ్‌లో 25 శాతానికిపైగా ఏఐతోనే రూపొందిస్తున్నామని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ గత ఏడాది అక్టోబరులో వెల్లడించారు.

నేటి నుంచి తిరుమలలో వీఐపీ బ్రేక్ సమయాల్లో మార్పు

తిరుమల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల మార్పు గురువారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 5.30 గంటలకు మొదలై ఉదయం 11 గంటలకు ముగిసేవి. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో వేచి ఉండే భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 10 గంటలకు మార్చారు. అయినప్పటికీ జనరల్ బ్రేక్ దర్శన భక్తులకు మాత్రం ఉదయం 8 గంటల నుంచి 10 గంటలోపు దర్శనం చేయిస్తున్నారు. ఇక, రెండవ నైవేద్యం గంట అంటే ఉదయం 10 గంటల తర్వాత ప్రొటోకాల్, రెఫరల్, శ్రీవాణి, ఉద్యోగులకు దర్శనం చేయిస్తున్నారు. దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ బ్రేక్ దర్శనాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన ధర్మకర్తల మండలి తిరిగి బ్రేక్ దర్శనాల్లో పూర్వపు విధానాన్ని అమలుచేయాలని తీర్మానించింది. ఇందులో భాగంగా ఈ రోజు నుంచి తిరిగి పాత పద్ధతిలో బ్రేక్ దర్శనాలను ప్రవేశపెట్టేందుకు టీటీడీ సిద్ధమైంది.


సామాన్యులకు అదనంగా గంట సమయం

ప్రొటోకాల్, రిఫరెల్, జనరల్ బ్రేక్ దర్శనాలను ఉదయం 7.30 గంటల లోపు పూర్తి చేసి తర్వాత వీలైనంత మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించి తిరిగి 10.15 గంటల నుంచి 11.30 గంటలలోపు శ్రీవాణి, టీటీడీ ప్రస్తుత, రిటైర్డ్ ఉద్యోగులకు దర్శనం కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇక సిఫారసు లేఖలపై బ్రేక్‌దర్శనాలనూ నేటి నుంచి రద్దు చేసిన క్రమంలో ఉదయం గంట, మధ్యాహ్నం గంటన్నర అదనంగా సామాన్య భక్తులకు దర్శన సమయం లభించనుంది.

నూతనంగా మార్పులు చేసిన సమయాలు	
5.45:	ప్రొటోకాల్ దర్శనం
6.30:	రిఫరెల్ ప్రొటోకాల్
6.45:	జనరల్ బ్రేక్
10.15:	శ్రీవాణి (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)
10.30:	దాతలు
11.00:	టీటీడీ రిటైర్డ్ ఉద్యోగులు

గురు, శుక్రవారాల్లో ఉదయం 8 గంటలకు బ్రేక్ దర్శనాలు ప్రారంభం

శ్రీశైలం రాతి గోడలకు సపోర్టు వాల్స్!



కొండ భాగం కోతకు గురికాకుండా చూడాలి

- రాష్ట్రానికి జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచన
- జింబాబ్వే 'కరీబా' డ్యాం తరహాలో ప్లంజ్‌పూల్ మరమ్మతులు
- అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ బృందం సూచన
- మరమ్మతులకు టెక్నాలజీ, డిజైన్లు అందజేస్తామని వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు జీవన రేఖ శ్రీశైలం జలాశయాన్ని సంరక్షించుకోవలసిన అవసరం ఉందని డ్యాం రాతి గోడలకు సపోర్టు వాల్స్ నిర్మించే మరమ్మతు పనులు తక్షణమే చేపట్టాలని జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ సూచించారు. డ్యాం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడ్డ భారీ గొయ్యిని ఆయన బృందం మంగళవారం రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించింది. ప్లంజ్‌పూల్‌లో 27 నుంచి 47 మీటర్ల దిగువ వరకు గొయ్యి ఏర్పడిందని గుర్తించింది. దీనివల్ల డ్యాం గోడలు దెబ్బతినే ప్రమాదం ఉందని జైన్ బృందం వెల్లడించింది. 'జలాశయాన్ని అనుకుని ఉన్న కొండ భాగంలో భూమి కోతకు గురవుతోంది. ఇది క్రమేణా జలాశయానికి ప్రమాదకారిగా మారుతుంది. ప్లంజ్‌పూల్ వద్ద గొయ్యి భారీగా ఉంది. జింబాబ్వేలోని కరీబా జలాశయం వద్ద కూడా గతంలో ఇంత పెద్ద స్థాయిలో గొయ్యి ఏర్పడింది. దీనికి శాస్త్రీయంగా మరమ్మతులు చేపట్టారు. ఇందుకు పదేళ్లు పట్టింది. శ్రీశైలం జలాశయం పునాదులు పటిష్ఠంగా ఉన్నాయి. నిర్మాణ సమయంలో రాతి గోడలను నిర్మించారు. అయితే సిమెంట్ లైనింగ్ చేయకపోవడం వల్ల గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తే భవిష్యత్‌లో నీరు ఎగచిమ్మే అవకాశముంది. ప్లంజ్ పూల్ గొయ్యి ప్రభావంతో ప్రాజెక్టు గోడలు దెబ్బతినకుండా, పునాదులు కోతకు గురికాకుండా ఉండేలా మరమ్మతులు చేపట్టేందుకు ప్రాధాన్యమివ్వాలి. మరమ్మతు చేయాలంటే ముందస్తుగా గోతిలోని నీటిని తోడేయాలి. జలాశయం గోడలను పటిష్ఠపరచడంలో భాగంగా దిగువ భాగాన బ్యాక్ వాటర్ రాకుండా నివారించేందుకు కాఫర్ డ్యాంను నిర్మించాలి. జలాశయానికి తక్షణ ప్రమాదం లేనప్పటికీ.. డ్యాం మరమ్మతు పనుల కోసం రహదారి ఏర్పాటు చేసుకోవాలి. ఈ రహదారి ఆధారంగా ప్రాజెక్టు గోడల్ని పటిష్ఠం చేయాలి. త్వరలోనే ఈ మరమ్మతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, డిజైన్లను అందజేస్తాం' అని జైన్ బృందం తెలిపింది. ఈ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా ప్లంజ్‌పూల్ మరమ్మతు పనులు చేపట్టాలని జల వనరుల శాఖ నిర్ణయించింది.

సెలవులకు ఇంటికెళ్తే... పెళ్లి చేసేశారు!

- టీచర్ల ముందు ఏడో తరగతి బాలిక కన్నీరు
- బాలసదన్‌కు తరలించిన ఐసీడీఎస్



కోటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో విద్యార్థిని

కోట, రుద్రవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'వేసవి సెలవులకు ఇంటికి వస్తే.. బలవంతంగా పెళ్లి చేసేశారు. కన్నవాళ్లు కూడా కాపురం చేయాల్సిందే అంటున్నారు. నన్ను కాపాడండి' అంటూ ఏడో తరగతి బాలిక పొగిలి పొగిలి ఏడుస్తూ టీచర్లను వేడుకుంది. తిరుపతి జిల్లా కోటలో ఈ ఘటన జరిగింది. కోట మండలం గూడలి సమీపంలోని కాలనీలో నివసిస్తున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అక్కాచెల్లెళ్లు.. కోట గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 7,9 తరగతులు చదువుతున్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో ఏప్రిల్ 23న ఇంటికి వెళ్లారు. ఆ రాత్రే ఇద్దరికీ తల్లిదండ్రులు పెళ్లి కుదిర్చేశారు. మరుసటి రోజే పెళ్లిళ్లు చేసేసి భర్తల వెంట పంపేశారు. 30 ఏళ్ల వ్యక్తికి 7వ తరగతి బాలికను ఇచ్చి పెళ్లి చేయడంతో.. ఆ బాలిక కాపురం చేయలేనంటూ పుట్టింటికి వచ్చేసింది. తల్లిదండ్రులు ఎంత చెప్పి నా వినకుండా.. పసుపు తాడుతోనే బుధవారం గురుకుల పాఠశాలకు వెళ్లిపోయింది. తనను కాపాడమంటూ టీచర్ల కాళ్లావేళ్లా పడింది. వారు పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఐసీడీఎస్ సీడీపీఓ మునికుమారి, సూపర్‌వైజర్ కవిత పోలీసులకు ఫిర్యాదు చేసి, బాలికను నెల్లూరులోని బోర్డింగ్ స్కూల్ (బాలసదన్)కు తరలించారు.

రుద్రవరంలోనూ ఇదే తీరు!



రుద్రవరంలో బాల్య వివాహం జరిగిన ప్రదేశంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

నంద్యాల జిల్లా రుద్రవరానికి చెందిన 20 ఏళ్ల యువకుడితో ఆత్మకూరు మండలం ఉరుకుందకు చెందిన ఓ బాలిక(15)కు బుధవారం ఉదయం వివాహం జరిగింది. బాల్య వివాహం జరుగుతున్న విషయం తెలిసి.. పోలీసులు, సీడీపీవో, తహసీల్దారు అక్కడికి వెళ్లే సరికే పెళ్లి జరిగిపోయింది. బాలికను నంద్యాల వన్‌స్టాప్ సెంటరుకు తరలించి, పెళ్లి కుమారుడితోపాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టీల్ ప్లాంటులో ప్రమాదం

- బ్లాస్ట్‌ఫర్నేస్-1లో గ్యాస్ లీక్
- నలుగురికి అస్వస్థత.. ఒకరి పరిస్థితి విషమం

ఉక్కుటౌన్‌షిప్(విశాఖపట్నం), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని బ్లాస్ట్‌ఫర్నేస్-1 విభాగంలో బుధవారం సాయంత్రం గ్యాస్ లీకవ్వడంతో నలుగురు ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బ్లాస్ట్ ఫర్నేస్-1 విభాగంలో ట్యూయల్ ప్లాట్‌ఫాంపై హోస్ పైపును మార్చే క్రమంలో గ్యాస్ లీకైంది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సుస్మిత్ (సీనియర్ మేనేజర్), యాదవ్ (సీనియర్ మేనేజర్), ఎ.వెంకటేశ్వరరావు (ఫోర్‌మన్), రామరాజు (ఫోర్‌మన్) అస్వస్థతకు గురయ్యారు. నలుగురూ అక్కడే పడిపోవడంతో సమీపంలో ఉన్న ఉద్యోగులు గమనించి వెంటనే గ్యాస్ సరఫరాను నిలిపివేశారు. వారిని హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో వెంకటేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన ముగ్గురికి ఉక్కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే : సీఐటీయూ

ప్లాంటులో ఉత్పత్తి పెంచే క్రమంలో భద్రతను యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందని, అందుకే ప్రమాదం చోటుచేసుకుందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. క్షతగాత్రులను తరలించే సమయంలో అంబులెన్స్‌లో ఆక్సిజన్ సదుపాయం కూడా లేదని ఆరోపించారు.

పంచాయతీరాజ్‌శాఖలో సంస్కరణల్లో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి పోస్టులను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీఓ) /డిప్యూటీ సీఈఓగా అప్‌గ్రేడ్ చేశారు. అలాగే, ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ పోస్టులను అడిషనల్ కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేటి నుంచి సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర

విజయవాడ(వన్‌టౌన్), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మేడే సందర్భంగా సీపీఎస్ ఉద్యోగులు ఏకం కావాలనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ సీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో చైతన్య యాత్ర ప్రారంభం కానుంది. గురువారం చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని సంఘం అధ్యక్షుడు బాజీ పఠాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్, సాయి నర్మదల వివాహ వేడుకకు హాజరై, వధూవరులను ఆశీర్వదిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీజే ఎన్వీ రమణ, మంత్రి లోకేశ్ తదితరులు

ఘనంగా దేవినేని ఉమా కుమారుడి వివాహ వేడుక

హాజరైన తెలంగాణ సీఎం రేవంత్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్

కంకిపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్, సాయి నర్మదల వివాహం బుధవారం కంకిపాడులో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చి, వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ వివాహానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సీజేఐ ఎన్వీ రమణ, సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కొలుసు పార్థసారధి, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, సత్యకుమార్, జనార్దన్‌రెడ్డి, ఎస్.సవిత, ఎంపీ బాలశౌరి, టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు పంచుమర్తి అనురాధ, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, శ్రీరామ్ తాతయ్య, కామినేని శ్రీనివాస్, చంద్రమోహన్ రెడ్డి, పిన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

గ్రామసభలు తీర్మానించిన పనులకే అనుమతి ఇచ్చారా?

- ఎమ్మెల్యే సిఫారసు మేరకు నడుచుకున్నారా?
- పూర్తి వివరాలు మా ముందు ఉంచండి
- పంచాయతీరాజ్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను తమ ముందు ఉంచాలని పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఉపాధి పథకంలో గ్రామసభలు తీర్మానించిన పనులకే పరిపాలన అనుమతులు ఇచ్చారా? లేక ఎమ్మెల్యే సిఫారసు మేరకు నడుచుకున్నారా? అని అడిషనల్ అడ్వొకేట్ జనరల్‌ను ఆరా తీసింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు ఇచ్చింది. విజయనగరం మండలంలో ఉపాధి హామీ పనుల విషయంలో గ్రామసభలు చేసిన తీర్మానాన్ని పక్కనపెట్టి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేసిన సిఫార్సులకు కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారంటూ విజయనగరం జిల్లాకు చెందిన లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ అధ్యక్షుడు ఎం.అప్పలనాయుడు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వడ్లమూడి కిరణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ ఉపాధి హామీ పథకంలో గ్రామసభలు చేసిన తీర్మానాన్ని పక్కనపెట్టి ఎమ్మెల్యే సిఫారసు చేసిన పనులకు కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఇలా చేయడం ఉపాధి చట్టం నిబంధనలకు విరుద్ధమన్నారు. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపిస్తూ గ్రామసభ చేసిన తీర్మానానికి అనుగుణంగానే కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారని తెలిపారు. గతేడాదే పనులు ప్రారంభమయ్యాయని, పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచుతామన్నారు.

ఉపాధి శ్రామికులతో పవన్ ఆత్మీయ కలయిక

- నేడు మంగళగిరిలో మేడే కార్యక్రమం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉపాధి శ్రామికులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని గురువారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి పది మంది చొప్పున సుమారు 260 మంది ఉపాధి శ్రామికులు ఇందులో పాల్గొంటారు. వందరోజులు పనులుచేసిన ఉపాధి శ్రామికులకు ఈ అవకాశం కల్పిస్తున్నారు. ప్రతి జిల్లా నుంచి ఒక అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యత తీసుకుని శ్రామికులను మంగళగిరికి తీసుకొస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శ్రామికులతో పవన్‌కల్యాణ్ స్వయంగా ముచ్చటిస్తారు.

హజ్ కమిటీ చైర్మన్‌గా హసన్ బాషా

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన సమావేశంలో ఆన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో చక్కటి హజ్ హౌస్ నిర్మిస్తామని, హజ్ యాత్రికులకు సేవా భావంతో అత్యుత్తమ సేవలందిస్తామని తెలిపారు. తనకు హజ్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ అందించిన విజయం

లిబరల్ పార్టీని గద్దెదించి, ఈమారు కచ్చితంగా కన్సర్వేటివ్‌లను అధికారంలోకి తెచ్చుకోవాలని కెనడా ప్రజలు నిజానికి ఎప్పుడో నిర్ణయించుకున్నారు. పదేళ్ళపాలన, కొన్ని అసమర్థ నిర్ణయాల వల్ల లిబరల్ పార్టీమీద బలమైన వ్యతిరేకత ఏర్పడివున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టిన డోనాల్డ్ ట్రంప్ కెనడియన్ల మనసు మార్చేశారు. అధికారపక్షంమీద వారిలోవున్న అంతటి ఆగ్రహాన్నీ వెనక్కునెట్టేసి, మళ్ళీ నువ్వేకావాలి అనేట్టుగా వారిని తయారుచేశారు. ఘోరంగా ఓడిపోతుందనుకున్న లిబరల్‌పార్టీ గతంలో కంటే ఓ ఎనిమిది స్థానాలు ఎక్కువే సంపాదించిదంటే అది ట్రంప్ పెట్టిన భిక్షే. కెనడా ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు జోక్యం చేసుకున్నాడంటూ సామాజిక మాధ్యమాల్లో సరదా వ్యాఖ్యలు, మీమ్స్ చక్కర్లు కొడుతున్నది అందుకే.


కెనడా ప్రధాని కార్నీ విజయోత్సాహంలో మునిగితేలుతున్నారు. కెనడాకోసం, కెనడియన్ల ఐక్యతకోసం నిలబడతానని, ముక్కలు చెక్కలు చేసి, మూటగట్టుకుపోవాలని చూస్తున్న అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా పోరాడతానని తన ప్రసంగంలో ప్రజలకు గట్టిహామీలు ఇచ్చారాయన. ఎన్నికల ప్రచారమంతా అమెరికా అధ్యక్షుడు చుట్టూనే తిరిగినట్టుగా, ఈ విజయోత్సవ ప్రసంగంలోనూ అత్యధికభాగం ట్రంప్‌మీద విమర్శలే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడికి మన భూములు కావాలి, మన వనరులు, నీరు, మన దేశమే కావాలి, బలమైన కెనడా నిర్మాణం ద్వారా ఆయన ఆటలు ఇక సాగనిచ్చేది లేదు అని కెనడా ప్రధాని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు తమ జోలికి రాకుండావుంటే, తనకు ఈ విజయం దక్కేది కాదని కెనడా ప్రధానికి తెలుసు. లిబరల్‌పార్టీ పట్టుబట్టి గబ్బుపట్టిన జస్టిన్ ట్రూడోను గద్దెదింపి, అప్పటికి ఏ పాలనానుభవమూ లేని ఈయనను కుర్చీలో కూచోబెట్టినప్పటికే వాతావరణం వేడెక్కిపోయి ఉంది. అమెరికా 51వ రాష్ట్రంగా కెనడాను మార్చేస్తానని ట్రంప్ చేసిన ట్వీట్లు, అలా రూపాంతరం చెందితే కెనడాకు ఆర్థికంగా భౌగోళికంగా ఎంతో ప్రయోజనమంటూ చేసిన వ్యాఖ్యలు, అనంతర కాలంలో హెచ్చరికలు, బెదిరింపులు కెనడియన్లను భయోత్పాతంలోకి నెట్టేశాయి. సుంకాలయుద్ధంలో తమను ముందువరుసలో ఉంచి, అధిక సుంకాలతో వేధించి దారికితెచ్చుకోవాలన్న ట్రంప్ ప్రయత్నం కెనడియన్లు తీవ్రంగా గర్హించారు. కెనడాను అమెరికా స్వాహాచేస్తుందన్న భయంలో ఉన్న కెనడియన్లకు, ట్రంప్‌తో సాన్నిహిత్యం ఉన్న కన్సర్వేటివ్‌లు అధికారంలోకి వస్తే ఇక కెనడా కనుమరుగేనన్న అధికారపక్షం ప్రచారం చక్కగా చెవికెక్కింది. ట్రంప్‌మీద యుద్ధాన్ని ప్రకటించిన మెక్‌కార్నీ హీరోలాగా కనిపించారు. దీనితో, జనవరినాటికే 20పాయింట్లు వెనుకబడిపోయి ఉన్న లిబరల్‌పార్టీ వరుసగా నాలుగోసారి అధికారంలోకి రాగలిగింది. ఈ మారు కుర్చీ ఖాయమనుకున్న కన్సర్వేటివ్ పార్టీ ఆమడదూరంలో చతికిలబడిపోయింది. ట్రంప్ వాచాలత కారణంగా దాని అదృష్టరేఖ నాలుగునెలల్లోనే తారుమారైపోయింది.

ఈ ఎన్నికల్లో మరో విశేషమైన పరిణామం ఖలిస్తానీ అనుకూల న్యూ డెమోక్రాటిక్‌పార్టీ (ఎన్డీపీ) పతనం, దాని నాయకుడు జగ్‌మీత్ సింగ్ ఓటమిపాలై, బాధ్యతలనుంచి తప్పుకోవడం. భారత్‌కు ఎంతో ఉపశమనం కలిగించే మార్పు ఇది. సిక్కువోటర్లు ఈ మారు లిబరల్ పార్టీ వైపు మళ్ళిపోవడంతో ఎన్డీపీ బాగా దెబ్బతినిపోయింది. భారత్-కెనడా సత్సంబంధాలకు విఘాతం కలిగించిన ట్రూడో, జగ్‌మీత్‌లు ఇద్దరూ ఇప్పుడు తెరమరుగైనారు. బ్రిటిష్ కొలంబియాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య అనంతరం ట్రూడో ఆరోపణలు, విమర్శలతో ఇరుదేశాల మధ్య విభేదాలు పతాకస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. రెండుదేశాల మధ్యా నెలకొన్న అనిశ్చితి కారణంగా విద్యార్థులు, ఉద్యోగార్థులు కష్టాలుపడ్డారు. భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నట్టుగా మెక్‌కార్నీ ఇప్పటికే ప్రకటించి ఉన్న నేపథ్యంలో, దీర్ఘకాలంగా దెబ్బతినివున్న సంబంధాలు ఇక మెరుగుపడతాయని ఆశించవచ్చు. కెనడా ప్రధాని విజయంపట్ల ప్రధాని మోదీ హర్షాన్ని వ్యక్తం చేయడంలోనూ ఈ ఆశాభావం కనిపిస్తోంది. గాడితప్పిన విద్య-వాణిజ్యబంధాలు, ఇమిగ్రేషన్ విధానాలను రెండుదేశాలు చక్కదిద్దుకుంటాయని ఆశిద్దాం.

రాజధాని వేరు... అమరావతి సృష్టి వేరు!

రాష్ట్రానికి 'రాజధాని' వేరు. చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో పురుడు పోసుకుంటున్న 'అమరావతి' వేరు. రాజధాని అంటే... ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు, ప్రధాన కార్యదర్శి, మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, వారి అనుబంధ విభాగాలు... తమ తమ అధికార విధులు నిర్వహించడానికి వీలైన సచివాలయం, శాసనసభ, గవర్నర్ కార్యాలయాలు, నివాసంతో కూడిన రాజ్‌భవన్, డీజీపీ కార్యాలయం, హైకోర్ట్ మొదలైన వారి అధికార విధులు నిర్వహించడానికి వీలైన భవనాల సముదాయం. వీరందరి నివాసాలు (క్యాంపు కార్యాలయాలు... సచివాలయానికి చేరువలో ఉండాలనే రూల్ ఏమీ లేదు) ఎక్కడైనా ఉండవచ్చు. ఆ కోణంలో చూస్తే, విభజనకు గురైన 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం- రాజధాని వసతులు లేకుండా ఎప్పుడూ లేదు.

2014 జూన్‌లో చంద్రబాబు నాయుడు కొత్త రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక, హైదరాబాద్‌లోని సచివాలయం నుంచే మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, ఉమ్మడి హైకోర్ట్ నుంచి న్యాయమూర్తులు, హైదరాబాద్ రాజభవన్ నుంచి గవర్నర్- తమ తమ విధులు నిర్వహిస్తూ వచ్చారు. కనుక, రాష్ట్రానికి రాజధాని లేకపోవడం అనే సమస్యే లేదు. అయితే, ఈ సదుపాయాలు శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు కాలేదు. ఇపుడు వెలగపూడిలో ఉన్న సచివాలయం, విజయవాడలో ఉన్న రాజభవన్ శాశ్వతమైనవి కావు. అలాగే, చాలా ప్రభుత్వ శాఖలు విజయవాడ, గన్నవరం, గొల్లపూడి, కంచికచర్ల, మంగళగిరి, ఇబ్రహీంపట్నం, గుంటూరు చుట్టుపక్కల అక్కడొకటి, అక్కడొకటిగా విసిరేసి నట్టున్నాయి. వీటన్నిటికీ శాశ్వత ప్రాతిపదికన కార్యాలయాలు, ప్రజాప్రతినిధులకు ఆవాసాలు, న్యాయమూర్తులు, గవర్నర్‌కు వసతి ఏర్పాటు మొదలైన నిర్మాణాలకు ఓ వెయ్యి ఎకరాలైతే ఎక్కువ. కానీ, మహాదార్శనికుడైన ముఖ్యమంత్రికి ఆ విషయం తెలియక కాదు, అమరావతి... అమరావతి' అని కలవరించేది.



హైదరాబాద్ లాంటి విస్తృతావకాశాలు గల ఒక నగరం ఆంధ్రకు లేని లోటును తీర్చడానికి ఉద్దేశించిందే అమరావతి. రాజధానికి అవసరమైన భవనాలు సైతం అమరావతి మహా నగరంలో ఓ చిన్న అంతర్భాగం అవుతాయి కానీ, రాజధానే అమరావతి కాదు. చంద్రబాబు నాయుడు దార్శనికతకు ఒక సజీవరూపంగా చరిత్రలో అమరావతి నగరం నిలిచిపోతుంది.

సుభిక్షమైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగువారికి....సిటీ ఆఫ్ ఆపర్చునిటీస్'గా హైదరాబాద్ ఉండేది. 13 జిల్లాలలోని తెలుగు వారు ప్రతి చిన్న, పెద్ద అవసరానికి హైదరాబాద్‌పై ఆధారపడడం... గత ఆరేడు దశాబ్దాలుగా ఒక ఆనవాయితీగా మారిపోయింది. ఉద్యోగాలకోసమో, వ్యాపారాల కోసమో, ఇతర జీవనోపాధి మార్గాల కోసమో... 13 జిల్లాల నుంచి లక్షలాది మంది తెలుగు వారు పిల్లాపాపలతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సంక్రాంతి, దీపావళి, ఉగాది వంటి పండుగ వేళల్లో హైదరాబాద్ రోడ్లు, మాల్స్, సినిమా హాళ్లు చూస్తే... తెలుగు వారు ఏ స్థాయిలో హైదరాబాద్‌లో స్థిరపడ్డారో తెలుస్తుంది. తమ ఊళ్లల్లోని ఆస్తులను అమ్ముకొచ్చి హైదరాబాద్‌లో కొనుక్కున్నారు. అందుకే, హైదరాబాద్ అనేది తెలుగువారికి ఒక విద్యా, వ్యాపార, నివాస, ఉపాధి వనరుగా మారిపోయింది. తెలుగువారు హైదరాబాద్‌లో లక్షల కోట్లు కుమ్మరించడం వల్లనే అది తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిపోయింది.

ఇటువంటి 'సిటీ ఆఫ్ ఆపర్చునిటీస్' ఆంధ్రాకు లేదు. విశాఖపట్నం, విజయవాడ ఆ స్థాయి నగరాలు కాదు. అందుకే, హైదరాబాద్ లాంటి విస్తృతావకాశాలు గల ఒక నగరం ఆంధ్రకు లేని లోటును తీర్చడానికి ఉద్దేశించిందే అమరావతి. రాజధానికి అవసరమైన భవనాలు సైతం అమరావతి మహానగరంలో ఓ చిన్న అంతర్భాగం అవుతాయి కానీ, రాజధానే అమరావతి కాదు.

అమరావతి అంటే... లక్షలాదిగా నివసించే ప్రజలు, ప్రపంచ స్థాయి పెద్ద పెద్ద వ్యాపార, వాణిజ్య భవనాలు, పబ్లిక్ పార్క్‌లు, వినోద కేంద్రాలు, ఐకానిక్ నిర్మాణాలు, సువిశాలమైన రహదారులు, నైట్ లైఫ్ వినోద కార్యకలాపాలు అందించే సఫారీ టూర్ల వెసులుబాట్లు, టూరిస్ట్ ఆకర్షణలు. ఇవేగాక అంతర్గత రవాణా సదుపాయాలు, కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ, అంతర్జాతీయ వైద్య-విద్యా సంస్థల క్యాంపస్‌లు, ప్రపంచస్థాయి ఆకర్షణలు, ఫ్లై ఓవర్లు... ఇలా అనేక సదుపాయాల సముదాయంగా అమరావతి పేరిట ఒక మహానగరం నిర్మింప చేయాలని చంద్రబాబు నాయుడు తలపెట్టారు. అందుకే 50 వేల ఎకరాలు.

నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయంలో చంద్రబాబు కాకుండా మరెవరైనా ముఖ్యమంత్రిగా ఉండి ఉన్నట్లయితే... 2019–2024 మధ్య కాలం నాటి అనుభవాలను 2014–2019లోనే తెలుగువారు రుచి చూసి ఉండేవారు. ఆ విభజన సమయాన దార్శనికుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నందువల్ల, ప్రపంచ స్థాయి నగరంగా 'అమరావతి'కి బలమైన పునాదులు పడుతున్నాయి.

ఇప్పటి హైదరాబాద్ నగరం రూపుదిద్దుకోవడానికి నాలుగొందల ఏళ్లకు పైగా పట్టినప్పటికీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ప్రకటించిన ఈ 60, 70 ఏళ్లల్లోనే దాని దశ తిరిగింది. హైదరాబాద్ దశ తిరగడానికి కారకులైన వారిలో చంద్రబాబు నాయుడు కూడా ముఖ్యుడు. ఆ అనుభవంతోనే, ఆ దార్శనికతతోనే, ఇపుడు అమరావతి నగర ఆవిష్కరణకు 2014లో మొదలు పెట్టిన బృహత్ కృషిని కొనసాగిస్తున్నారు. ఇది, ఒక ఆకారం తీసుకోవడానికి ఒకటి, రెండు దశాబ్దాలు పట్టవచ్చు కానీ... చంద్రబాబు నాయుడు దార్శనికతకు ఒక సజీవరూపంగా చరిత్రలో అమరావతి నగరం నిలిచిపోతుంది. తెలుగువారికి ఆయన చేస్తున్న మహోపకారం- అమరావతి. ఈ సమయాన భారత ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ పేరు కూడా తెలుగువారి చరిత్రలో నిలిచిపోతుంది, ఒకసారి శంకుస్థాపన చేసినందుకు, మరోసారి పునః నిర్మాణ యజ్ఞానికి జెండా ఊపినందుకు.

• భోగాది వేంకటరాయుడు

కులలెక్కలతో కొత్త ప్రయాణం గట్టెక్కేనా?

ఎత్తులు పైఎత్తులతో అనూహ్య నిర్ణయాలు తీసుకోవటం రాజకీయాల్లో సహజం. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇలాగే అర్థం చేసుకోవచ్చు. కానీ భవిష్యత్తు పరిణామాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే దీన్ని అత్యంత అసాధారణ నిర్ణయంగా పరిగణించొచ్చు. సందర్భాన్ని బట్టే దేనికైనా సాధారణతనూ అసాధారణతనూ ఆపాదించవచ్చు. పహల్గాం సంఘటనకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో ప్రతిస్పందించే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్న తరుణంలో కులగణన నిర్ణయం ఏ రకంగానూ ఊహించింది కాదు. హిందూ సమాజ ఏకీకరణకు, హిందూ సంస్కృతిపై ఆధారపడే జాతీయవాదానికి కుల భావాలూ, మమకారాలూ అడ్డంకిగా ఉన్నాయన్నది సంఘ్‌పరివార్ సైద్ధాంతిక అవగాహనగా ఇప్పటివరకూ చలామణి అయింది. అందుకే కాంగ్రెస్ వైపు నుంచి కులగణనకు సంబంధించి ఎన్ని సవాళ్లు ఎదురైనా బీజేపీ నుంచి గానీ, ఆరెస్సెస్ నుంచి గానీ తమ విధానం ఇదీ అంటూ స్పష్టమైన ప్రకటనలు రాలేదు. కులగణనకు నెహ్రూ వ్యతిరేకమంటూ బీజేపీ వైపునుంచి చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి. రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ లోక్‌సభలోనే వ్యతిరేకించారంటూ విమర్శలు కురిపించారు. మండల్ కమిషన్ సిఫార్సులను ఇందిరాగాంధీయే తొక్కిపట్టారని ఆరోపణలూ ఎక్కుపెట్టారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా సమయ, సందర్భాలను బట్టి అలాంటి ప్రకటనలు చేయలేదని చెప్పలేం.

విధానాల్లో, సైద్ధాంతిక సూత్రీకరణల్లో పూర్తిగా భిన్న దార్లు తొక్కటం కాంగ్రెస్ చరిత్ర నిండా కనపడుతుంది. ఒకప్పటి విధానాలకు భిన్నంగా కులగణనను ప్రధాన రాజకీయ అజెండాగా మలచుకుని నాలుగేళ్ల నుంచి పార్టీ కార్యాచరణనంతా దాని చుట్టూనే తిప్పుతోంది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా ఆధిక్యతను సాధించకుండా చేయటంలో కాంగ్రెస్ ప్రచారం బాగానే తోడ్పడింది. మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బీజేపీ రద్దుచేస్తుందని కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ప్రచారానికి ఉధృతినీ, ఉరవడినీ తీసుకువచ్చారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తి చేశామనీ దాన్ని మోదీ విస్మరించలేరనీ రేవంత్‌రెడ్డి ఒకటికి పదిసార్లు చెప్పారు. ఒకరకంగా ఇప్పుడదే నిజమైంది. అయితే కాంగ్రెస్ ఎక్కుపెట్టిన కులగణన అస్త్రం భవిష్యత్తులో రాజకీయంగా మళ్లీ ఇబ్బంది పెట్టకుండా దాన్ని ఒడుపుగా అందుకుని తనకు ఉపకరించే రీతిలో ప్రయోగించుకోటానికి బీజేపీ సిద్ధమైంది. దీనిలో ఎంతవరకూ సఫలమవుతుందో ఇప్పుడే చెప్పలేం. కానీ కులగణనపై కాంగ్రెస్ అనుకున్న స్థాయిలో రాజకీయంగా మరింత విజృంభించకుండా బీజేపీ పావులు కదిపిందని అర్థం.

వ్యూహప్రతివ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ కులజనాభాను ఎలా సేకరిస్తారన్న దానిపైనే భవిష్యత్తు ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కులంతో పాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగ పరిస్తే రాజకీయరంగమే చాలా ఒడిదుడుకులకు లోనుకావాల్సి వస్తుంది. కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండు చేస్తోంది. అందుకోసం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని గట్టిగా కోరుతోంది. నిజానికి కాంగ్రెసే కాకుండా ప్రాంతీయ పార్టీలు కూడా ఇదే డిమాండును ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతానికి



కులంతో పాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగపరిస్తే రాజకీయరంగమే చాలా ఒడిదుడుకులకు లోనుకావాల్సి వస్తుంది. కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండు చేస్తోంది. అందుకోసం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని గట్టిగా కోరుతోంది. దేశవ్యాప్తంగా కులలెక్కలు అందుబాటులోకి వస్తే ఆ పరిమితి తొలగించాలనే ఒత్తిడి తీవ్రమవుతుంది.

మించి రిజర్వేషన్లను కల్పిస్తూ చేసిన చట్టాలను ఉన్నత న్యాయస్థానాలు కొట్టివేయటమో, నిలుపుదల చేయటమో చేశాయి. దేశవ్యాప్తంగా కులలెక్కలు అందుబాటులోకి వస్తే ఆ పరిమితి తొలగించాలనే ఒత్తిడి తీవ్రమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగాలకూ, ప్రభుత్వ విద్యాసంస్థలకూ ఇది పరిమితం అయితే ఎదురయ్యే సవాళ్లు ఒకరకంగా ఉంటాయి. ప్రైవేటురంగానికి కూడా రిజర్వేషన్లను వర్తింప చేయాలనే డిమాండు ఉధృతమైతే ఉత్పన్నమయ్యే సవాళ్లు భిన్నంగా ఉంటాయి. ఎంతవరకూ రిజర్వేషన్లు ఉండాలన్న విషయంపై రాజకీయంగా ఇప్పటివరకూ ఏకాభిప్రాయం లేదు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లపై అది అసలే లేదు. సమర్థత, పోటీ ఆధారంగా నడిచే స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యానికి చాలా పరిమితులు ఉంటాయి. ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టుకోటానికీ, ఉద్యోగుల అర్హతలు, సమర్థతలు నిర్ణయించుకోటానికీ ప్రైవేటురంగానికి దాదాపుగా పూర్తి స్వేచ్ఛను ఇవ్వటం అనేది ఇప్పటి వరకూ అడ్డంకులు లేకుండా సాగుతోంది. ఆర్థిక సంస్కరణలు మొదలుపెట్టిన నాటి నుంచి అట్లాంటి స్వేచ్ఛను కల్పిస్తున్నామని జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలూ ఘనంగా చెప్పుకుంటున్నాయి. చెప్పుకోవటమే కాదు పోటీలుపడి మరీ స్వదేశీ–విదేశీ పెట్టుబడుల కోసం ప్రోత్సాహాలను ప్రకటిస్తున్నాయి. పెట్టుబడులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా విధానాలనూ రూపొందిస్తున్నాయి.



■ రాహుల్ కుమార్

కులజనాభాను బట్టి వాటాలు నిర్ణయం అవ్వాలనే సూత్రమే గీటురాయి అయితే ప్రైవేటురంగం కూడా పెనుమార్పులకు లోనుకావాల్సి వస్తుంది. వాటాల జోలికి పోకుండా కేవలం కులాల లెక్కలు సేకరించి అదీ కూడా ఆర్థికస్థితిగతులను పక్కాగా తేల్చకుండా యథాతథంగా ప్రస్తుత విధానాలను కొనసాగిస్తే ఆశించిన మార్పులు వచ్చే అవకాశం లేదు. రాజకీయ రంగంలో మాత్రం కొన్ని మార్పులు వచ్చే అవకాశం ఉంది. అవి కూడా తీవ్ర ప్రభావం కలగచేసేవిలా ఉంటాయన్నది ఇప్పుడే చెప్పలేం. అధికారికంగా కులలెక్కలు లేకపోవచ్చు గానీ గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా నిజమైన కుల లెక్కలు రాజకీయ పార్టీల దగ్గర పుష్కలంగా ఉన్నాయి. వాటి ఆధారంగానే టిక్కెట్లను ఇస్తున్నాయి, పదవులను కట్టబెడుతున్నాయి. సమాచార సాంకేతిక పరిజ్ఞానం వాడకం విస్తృతమైన తర్వాత కులాలవారీ లెక్కలను క్రోడీకరించటం రాజకీయ పార్టీల వ్యూహకర్తలకు తేలికైపోయింది. తెలిసిన లెక్కలను తెలియదన్నట్లు వ్యవహరించటం మన రాజకీయాల్లో మామూలే!

జనాభా సేకరణలో కులలెక్కలు ఒకసారి అధికారికమైన తర్వాత వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాల్సి వస్తుంది. కుల గణాంకాలపై ఏకాభిప్రాయం సాధించటమూ అంతతేలిక కాదు. తక్కువా, ఎక్కువా చేశారనే ఆరోపణలూ వస్తాయి. తెలంగాణలోనూ అవి వచ్చాయి. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో పదేళ్ల క్రితం వందకోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన కులగణనపై ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయారు. ఇప్పటికీ ఆ కుల నివేదికను బయటపెట్టలేకపోతున్నారు. కర్ణాటకలో రెండు ప్రధాన కులాలైన వక్కలిగలు, లింగాయతులు తమ జనాభాను తక్కువగా చూపించారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ రెండు కులాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కులగణన లెక్కలను తప్పుపడుతున్నారు. ఇదే పరిస్థితి పలు రాష్ట్రాల్లో తలెత్తదని చెప్పలేం. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఏ సమస్యపైనా ఒక అంగీకారానికి రావటం అసాధ్యంగానే పరిణమిస్తోంది. కొన్నిచోట్ల ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలు చేపట్టిన కులాల గణనను రాజకీయ లబ్ధికోసమే నిర్వహించారని కేంద్ర ప్రభుత్వం బుధవారం విమర్శించింది. పారదర్శకత లేకుండా వాటిని జరిపారనీ సమాజంలో సందేహాలను కలగచేశారనీ దుయ్యబట్టింది. జనాభా సేకరణ కేంద్ర ప్రభుత్వ జాబితాలోని అంశమనీ, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు కులజనాభా లెక్కలను సేకరించే అధికారం లేదని కూడా స్పష్టంచేసింది. రాజకీయ దృష్టితో చేసే కులగణన వల్ల సమాజంలో సంబంధాలు దెబ్బతింటున్నాయనీ తాము పారదర్శకంగా చేపట్టే కులలెక్కలతో అటువంటి ప్రమాదం ఉండదనీ సమర్థించుకుంది.

కులగణన నిర్ణయం వెల్లడే ఇట్లాంటి విమర్శలతో మొదలైంది. 2011లో ఆనాటి కాంగ్రెస్ నేతృత్వంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) అసంపూర్ణమైందని కూడా కేంద్రం విమర్శించింది. రాజకీయాలకు ఏదీ అతీతం కాదు కాబట్టి కులగణనపై కేంద్రం వేసే అడుగులు శాస్త్రీయంగా, పటిష్ఠంగా ఉండకపోతే విమర్శలు అనివార్యంగా వస్తాయి. 2011 నాటి సర్వేకు 5000 కోట్లకు పైగా ఖర్చుపెట్టి కులలెక్కలపై చివరకు చేతులెత్తేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాడు సేకరించిన కులాల జనాభా ఎందుకూ పనికిరాదని కేంద్ర ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు తెలియచేసింది. కాంగ్రెస్ నాయకత్వం దీన్ని ఇంతవరకూ ప్రశ్నించ లేదు. ఆనాటి తమ ప్రభుత్వం సరిగానే కులగణనను

78 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కుల గణన నిర్ణయాన్ని గొప్పచర్యగా భావించటం రాజకీయంగా సబబే కావచ్చు. కానీ దాని వెనుక సామాజిక, ఆర్థికరంగాల్లో వైఫల్యమే కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఆ వైఫల్యాలు పునరావృతం కాకుండా, ఎటువంటి చర్యలూ విధానాలూ చేపట్టాలో స్పష్టంచేయకుండా, కేవలం కులాలను లెక్కించటం వల్ల జరిగే లాభం పెద్దగా ఉండదు.

చేసిందని ఇంతవరకూ స్పష్టంగా చెప్పుకోలేకపోయింది.

78 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కుల గణన నిర్ణయాన్ని గొప్పచర్యగా భావించటం రాజకీయంగా సబబే కావచ్చు. కానీ దాని వెనుక సామాజిక, ఆర్థికరంగాల్లో వైఫల్యమే కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఈ వైఫల్యంలోనూ రాజకీయ పార్టీల వాటాలెంతో తేలితేనే అసలు దృశ్యం బయటకు వస్తుంది. ఆ వైఫల్యాలు పునరావృతం కాకుండా, ఎటువంటి చర్యలూ విధానాలూ చేపట్టాలో స్పష్టంచేయకుండా, కేవలం కులాలను లెక్కించటం వల్ల జరిగే లాభం పెద్దగా ఉండదు. ఆర్థికాభివృద్ధి ఫలాలు అందరికీ అందని విధానాలు ఎప్పటిలాగే కొనసాగితే కులం, ప్రాంతం ఆధారంగా కొత్త డిమాండ్లు పుట్టుకొస్తూనే ఉంటాయి. కులాల్లో ఆర్థిక అంతరాలను, సంపన్న శ్రేణులను పరిగణనలోకి తీసుకుని మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని ఉన్నత న్యాయస్థానాలు చేస్తున్న విజ్ఞప్తులను పట్టించుకోవాల్సిన సమయమూ వచ్చింది. ఆదాయ, సంపద అసమానత్వం భారత్‌లో చాలా తీవ్రంగా ఉందని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు వచ్చాయి. ఈ పరిస్థితిని ఎంతోకొంత చక్కదిద్దటానికి తోడ్పడితేనే కులగణనకు సార్థకత లభిస్తుంది. దానికి విరుద్ధంగా జరిగితే ప్రజాస్వామ్యం సంకుచిత భావాలతో సతమతమైపోతుంది. హేతుబద్ధత కుచించుకుపోతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

మేడే స్ఫూర్తితో సమస్యలపై పోరాడుదాం

మే 1, 1886న పాలకవర్గాల దమనకాండలో చికాగో(అమెరికా) కార్మికవర్గం రక్తం చిందించింది. ఉరికొయ్యలను సైతం లెక్కచేయక సాధించిన పోరాట ఫలితంగానే 8 గంటల పనిని ప్రపంచం ఆమోదించవలసి వచ్చింది. ఒకనాడు కరువుతో అల్లాడి లక్షలాది మంది అమానుషంగా మరణించారు. వ్యవసాయరంగం విప్లవాత్మక మార్పులలో ప్రపంచానికే తిండి గింజలు అందించే శక్తి వచ్చింది. కరువు కాటకాల నుంచి బయట పడ్డారు. కాని పాలకుల చర్యల ఫలితంగా తిండి లేక అలమటించే స్థితి రావడం సిగ్గుచేటు.

నేడు యాంత్రీకరణతో శ్రామికుడు 8 గంటల పనిని 4 గంటల్లో చేస్తున్నాడు. కాని పెట్టుబడిదారులు కార్మికుల రక్తాన్ని మరింతగా పీల్చిపిప్పి చేసి, సంపద పోగేసుకోవడానికి 12 గంటల పని పెంపుదలను ముందుకు తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌లో పని గంటల పెంపు ప్రతిపాదించింది. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం 7 కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ భద్రత, తగిన వేతనాలతో జీవిస్తున్నారు. మిగతావారు బతుకు భద్రత లేక కొట్టుమిట్టాడుతున్నారు. రాజ్యాంగం, కోర్టుల గురించి గొప్పలు వల్లించే పాలకులు 'సమాన పనికి సమాన వేతనం' అనే సుప్రీం తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలి? శ్రామిక వర్గం జీవించడానికి సరిపడే వేతనాలకై పోరాడాలి.

కార్మిక వర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలలో, 15 చట్టాలను ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా ఆమోదించి అమలుచేయడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారు. ట్రేడ్ యూనియన్ హక్కులైన సమ్మె, వేతనాల గురించి బేరసారాలు లేకుండా చేయడం, అధిక పని గంటలు, నియమిత కాల పరిమితి గల ఎంప్లాయిమెంట్ ఉండే విధంగా నిబంధనలు, పరిశ్రమల మూసివేత, కార్మికుల తొలగింపునకు సులభతర అవకాశాలను కోడ్స్‌లో పొందుపర్చారు. ఇది హక్కులను హరించడమే.

అసంఘటిత కార్మిక వర్గానికి ఏ విధమైన సామాజిక భద్రత లేదు. ఒక పక్క కార్పొరేట్లకు 15 లక్షల కోట్ల రాయితీలు, కారుచౌకగా ప్రభుత్వరంగ సంస్థల అప్పగింత, విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. మరోపక్క పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలపై కోత వేస్తున్నారు. పేదలకిచ్చే సంక్షేమాలను ఉచితాలనీ, వీటితో ప్రజలు సోమరులుగా తయారవుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మరి, వీరికి లక్షల కోట్ల రాయితీ పొందే కార్పొరేట్లు, బ్యాంకులను లూటీ చేసే చోక్సీ విజయమాల్యాలు కనబడలేదా? చాలీచాలని జీవితాలతో బతుకు బండి లాగుతున్న శ్రమ జీవులపై ఇంత కంటగింపా? కార్మికులకు కనీస పెన్షన్ వేయి రూపాయలా? సేవ పేరుతో ఎంపీ, ఎమ్మెల్యేలైన వారు లక్షలాది రూపాయల పెన్షన్ పొందుతున్నారు. మరి కార్మిక, ఉద్యోగులు కూడబెట్టిన సొమ్ముపై ఎందుకు పెన్షన్ పెంచడం లేదు?

కాంట్రాక్ట్–అవుట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రతకై, జీవించడానికి సరిపడే వేతనాలు, పెన్షన్ పెంపు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు నిలుపుదల కోసం మేడే స్ఫూర్తిగా పోరాడుదాం.

– కె. సూర్యం
టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఈ అసమానతలు తొలగేదెప్పుడు?

భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా ఆర్థికవృద్ధి గణనీయంగా పెరుగుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. 2014–24 మధ్య కాలంలో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌పీ) పెరుగుదల రేటు సంవత్సరానికి 8.2 శాతంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఆదాయ పెరుగుదల రేటు ఆధారంగా ప్రపంచ దేశాలలో భారతదేశ స్థానం ఆరుగా పరిగణించారు. ఇంతటి విశిష్టమైన పెరుగుదల రేటు ప్రాతిపదికన భారతదేశం 2022–23 సంవత్సరం నాటికి 3.7 ట్రిలియన్ల (జీడీపీ)కి చేరనున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడించాయి.

అయితే ఇంతటి గణనీయమైన అభివృద్ధిని సాధించిన భారతదేశం, సమాజంలో 50 శాతంగా ఉన్న మహిళల/మహిళా శ్రామికుల అభివృద్ధి ఏ మేరకు సాధించింది? భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం సగటు ప్రపంచ దేశాల సగటు కంటె ఎందుకు తక్కువగా ఉంది? గ్రామాలలో ఈ భాగస్వామ్యం ఎందుకు తగ్గుతున్నది? గ్రామీణ, పట్టణ మహిళా శ్రామికుల పని వసతులు ఎందుకు తగ్గుతున్నాయి? అలాగే స్త్రీ పురుషుల వేతనాలు మధ్య అంతరం ఎందుకు పెరుగుతున్నది? ఈ అన్ని ప్రశ్నలకు పెరుగుతున్న జీడీపీ ఏం సమాధానం చెప్పగలదు?

ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చకుండా, లింగ అభివృద్ధిని, సమానత వైపు నడిపించకుండా ఏ దేశమైనా అభివృద్ధి చెందగలదా? భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి పురోగమనాన్ని విశ్లేషిస్తే– 131 దేశాలలోని మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటులో భారతదేశానిది 120వ స్థానం అని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. అలాగే 2023లో భారతదేశ మహిళా శ్రామిక శక్తి (15–59సంవత్సరాల మహిళలు) భాగస్వామ్యం రేటు 37 శాతం. ఇది ప్రపంచ దేశాల సగటు కన్నా తక్కువ. ఇదే ఏడాది పురుష శ్రామిక శక్తి భారతదేశంలో 76.8 శాతం.

మన దేశ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటు అభివృద్ధిలో వెనుకబడ్డ బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల కన్నా తక్కువగా ఉంది. ఆ దేశాలలో భాగస్వామ్యం రేటు పెరుగుతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి. మన దేశంలో మాత్రం 1990–2013 మధ్య కాలంలో భాగస్వామ్యం రేటు 34 నుంచి 27 శాతానికి తగ్గింది. 2004–2020 మధ్యకాలంలో మహిళా పట్టణ శ్రామిక శక్తి భాగస్వామ్యం 16.6 నుంచి 16.8 శాతానికి పెరగగా, గ్రామాలలో ఇది 32.7 నుంచి 24 శాతానికి తగ్గిందని 2023లో పాండే తన అధ్యయనంలో పేర్కొన్నారు.

మహిళలు చేసే పనుల్లో రక్షణ, భద్రత ఉండాలి. పని పరిసరాలు సహకరించేవిగా ఉండాలి. స్త్రీ–పురుష అసమానతలు లేకుండా ఉండాలి. మహిళలకు పని అవకాశాలు పెరిగి, నైపుణ్యాలు పెంచుకునేలా ఉండడంతో పాటు, క్రెష్ వంటి అవకాశాలు ఉండాలి.

మహిళలు చేసే పనుల్లో రక్షణ, భద్రత ఉండాలి. పని పరిసరాలు సహకరించేవిగా ఉండాలి. స్త్రీ–పురుష అసమానతలు లేకుండా ఉండాలి. మహిళలకు పని అవకాశాలు పెరిగి, నైపుణ్యాలు పెంచుకునేలా ఉండడంతో పాటు, క్రెష్ వంటి అవకాశాలు ఉండాలి. యాజమాన్యంతో సత్సంబంధాలు పెరుగుతూ ఉండాలి.




యాజమాన్యంతో సత్సంబంధాలు పెరుగుతూ ఉండాలి. అయితే ఆధునిక పరిశ్రమలలో మహిళలను నైపుణ్యం అవసరం లేని, ఒకే పని పునరావృత్తమయ్యే చోట తక్కువ వేతనాలపై నియామకాలు జరిగేలా చేశారు. అలాగే వీరిని అనధికారిక, అసంఘటిత ఉద్యోగులుగా గుర్తింపులేని పనులకు ఉపయోగించేవారు. వీరి శ్రమశక్తిని దోపిడీ చేసేలా పని నిర్మాణాలు జరిగాయి. ఇలాంటి పరిశ్రమలు పట్టణ సరిహద్దుల్లో నెలకొని ఉంటాయి.

ఇక గ్రామీణ ప్రాంతాల్లో శ్రమ వర్గీకరణ చూస్తే దేశం మొత్తం మీద గ్రామీణ మహిళా శ్రామిక శక్తి 149.8 మిలియన్లుగా నమోదైంది. ఇందులో 35.9 మిలియన్లు సాగుదారులు, 61.5 మిలియన్లు వ్యవసాయ కూలీలు, 58.5 మిలియన్లు గ్రామీణ పారిశ్రామికులుగా ఉన్నారు. కానీ ఈ రంగాల నుంచి 8.4 శాతం రైతులు, 6.5 శాతం రైతు కూలీలు, 4.75 శాతం పరిశ్రమ శ్రామికులు నిష్క్రమించినట్లు నీతి ఆయోగ్ ప్రకటించింది.

మహిళా శ్రామికులు ఎదుర్కొంటున్న స్త్రీ–పురుష ఆదాయ అసమానతలు, గ్రామీణ–పట్టణ ఉపాధి అవకాశాల అసమానతలు తొలగించడానికి, వ్యవసాయరంగంలో ఏర్పడ్డ అల్ప ఉత్పాదకత, అల్ప ఆదాయ సమస్యలు అధిగమించడానికి రాజ్యాంగ హామీతో ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలుపరిచింది. ఇందులో మహిళా శ్రామికులకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 33 శాతం కేటాయించారు. స్త్రీ–పురుషులకు సమాన వేతనాలు చెల్లిస్తారు. నైపుణ్యాలు అవసరం లేని పనులను ఈ పథకం ఇస్తుంది. 90:10నిష్పత్తి బడ్జెట్‌తో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకం పనిచేస్తుంది. ఈ పథకాన్ని వెనుకబడ్డ రాష్ట్రాల్లోని వెనుకబడ్డ జిల్లాల్లో అమలుపరిస్తే మహబూబ్‌నగర్ జిల్లాల వంటి చోట్ల శ్రామిక వలసలను ఆపవచ్చు. మన దేశంలో పట్టణ ప్రాంతాలలో కంటే గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం పనులు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఇవి 100 పని వేతనాలకు మాత్రమే పరిమితమయ్యాయి. మన దేశంలో పట్టణీకరణ వేగాన్ని పుంజుకుంది, కనుక ప్రజలు పట్టణ నిమాయకాలతో సర్దుకుపోవాల్సి వస్తోంది.

దశాబ్దాలుగా భారతదేశంలో ఉత్పత్తి ఎంత విస్తారంగా పెరిగినా, మహిళా శ్రామిక శక్తి స్థితిగతులు సంతృప్తిగా మారలేదు. ఇంకెన్ని దశాబ్దాలకు ఈ పరిస్థితులు మారతాయో వేచి చూడాల్సిందే.

■ డా. వనమాల
పాలమూరు అధ్యయన వేదిక





యుద్ధప్రాతిపదికన జంగిల్ క్లియరెన్స్ పనులు



విధ్వంసం నుంచి పునర్వికాసం

మళ్లీ పురుడు పోసుకుంటున్న అమరావతి

అద్భుతం.. అంతకుమించిన ఆశ్చర్యం.. అన్నింటికీ మించిన ఆనందం.. ఐదేళ్ల వైసీపీ విధ్వంస బంధనాల నుంచి విముక్తి కలిగి రాజధాని కొత్తగా రెక్కలు తొడిగే ఓ శుభ సందర్భం. ఇన్నాళ్లూ అడవిలా అట్టుడికిన అమరావతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఓ సువర్ణాధ్యాయం. అందరూ ఆశగా ఎదురుచూస్తున్న రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపనకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అమరావతిలో పండుగ వాతావరణం రెట్టింపు అవుతోంది. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానుండటం, ఒకేసారి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ అమరావతివైపు ఆశగా చూస్తున్నారు.

\- విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీ హయాంలో విధ్వంసం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరు చెప్పి అమరావతిని నాశనం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలుపుదల చేయించింది. కేంద్ర సంస్థలకు కూడా భూములివ్వలేదు. అమరావతితో అనుసంధానమైన జాతీయ రహదారి, నూతన రైలుమార్గం పనులకు సహకరించలేదు. మూడు రాజధానులు అని ఒకవైపు చెబుతూ.. అమరావతిని కనీస రాజధానిగా కూడా



కూటమి ప్రభుత్వం వచ్చాక..

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరావతిపై ఆశలు ఏర్పడ్డాయి. ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అంచనాలు పెరిగి భారం మరింత పెరిగింది. నీటిలో నిండిపోయిన ఐకానిక్ భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా మొక్కవోని ధైర్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నిపుణులతో పరీక్ష చేయించింది. యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుంది.

ఐదేళ్ల వైసీపీ బంధనాల నుంచి విముక్తి

- కూటమి ప్రభుత్వం వచ్చాక పది నెలల్లో కొత్తగా..
- అడవి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ..
- పునర్నిర్మాణ శంకుస్థాపనకు అంతా సిద్ధం
- ఆ తర్వాత మహాయజ్ఞంలా పనులు

చివరిగా ఈ పనులన్నింటినీ పూర్తి చేయటానికి అవసరమైన నిధులు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు రూ.15 వేల కోట్లను ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి, రూ.11 వేల కోట్లను హడ్కో నుంచి, మరో రూ.5 వేల కోట్లను కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థల నుంచి అప్పుగా తీసుకోవటానికి మార్గమేర్పడింది. అక్కడి నుంచి అమరావతి పునర్నిర్మాణ పనుల దిశగా రాజధానిలో అడుగులు పడ్డాయి. అడవిగా మారిన అమరావతిని పూర్వస్థితికి తీసుకురావడం, ఐకానిక్ కట్టడాల బేస్‌మెంట్‌లో ఉన్న నీటిని తోడేయడం మిగతా 6లో..

చకచకా ఏర్పాట్లు

రాజధాని శంకుస్థాపన సందర్భంగా ప్రత్యేక పైలాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నాటికి ఇది పూర్తవుతుంది. సభ వేదిక ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. ప్రధాన వేదికలు, గ్యాలరీలు, అందులో సోఫాలు, కుర్చీలు, కూలర్లు సిద్ధంచేశారు. రాజధానిలో రోడ్ల డివైడర్లకు రంగులు వేశారు. పెద్ద ఎత్తున పూలకుండీలను తెప్పించి అలంకరిస్తున్నారు.

రేపే వేడుక

తుదిదశకు చేరిన ఏర్పాట్లు

- అందంగా ముస్తాబైన అమరావతి
- రాజధాని రైతుల ఇళ్లకు వెళ్లి ఆహ్వానం



సిద్ధమవుతున్న శంకుస్థాపన పైలాన్

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందడి
- ప్రధాని పర్యటనకు పక్కా ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అమరావతి ఆహ్వానం పలుకుతోంది. ప్రపంచస్థాయి నగరి కోసం భూములిచ్చిన రైతులకు సీఆర్‌డీఏ మహిళా అధికారిణులు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ఆహ్వానం పలుకుతున్నారు.

- అమరావతిలో చేపట్టే రూ.49,040 కోట్ల పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. శాశ్వత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాలతో పాటు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, ఎమ్మెల్యేలు, మంత్రుల గృహ సముదాయాలు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్మాణాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు.
- కీలకమైన కేంద్ర ప్రాజెక్టులకు కూడా ఇదే వేదికగా ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. భారత రక్షణ రంగ పరిశోధనా సంస్థ (డీఆర్‌డీవో), డీపీఐఐటీ, ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే శాఖలకు సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన ఏర్పాట్లు చేశారు. వీటి నిర్మాణానికి రూ.57,962 కోట్లు ఖర్చు చేస్తారు. నాగాయలంకలోని మిగతా 6లో..

భేషుగ్గా భోజనాలు

సభికులకు తెలుగు సంప్రదాయ భోజనాలు అందించనున్నారు. భోజన ఏర్పాట్ల బాధ్యతను ఎన్టీఆర్, గుంటూరు జిల్లా యంత్రాంగాలకు అప్పగించారు. గ్యాలరీలో ప్రజల దగ్గరికే భోజనాలు, స్నాక్స్, మంచినీరు, మజ్జిగ వంటివి అందిస్తారు.



వెస్ట్ బైపాస్‌లోని కృష్ణా బ్రిడ్జి

రాజమార్గం

- అందుబాటులోకి విజయవాడ బైపాస్
- అమరావతి శంకుస్థాపనకు ఇదే దారి
- ఏలూరు జిల్లా నుంచి వచ్చే వారంతా చిన అవుటపల్లి మీదుగా..
- ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వారంతా గొల్లపూడి మీదుగా..
- అమరావతిలో వెంకటపాలెం నుంచి సభాస్థలికి..

6లో



ఏర్పాట్లు దాదాపు పూర్తి

అమరావతిలో మంత్రి నారాయణ పర్యటన

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

ఆంధ్రరత్న భవన్‌పై బీజేపీ దాడికి యత్నం

- అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది
- యువమోర్చా నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆంధ్రరత్న భవన్‌లో బైఠాయించి నిరసన తెలిపిన షర్మిల
- ఇరువర్గాల ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితులు





ఆంధ్రరత్న భవన్ గేటు పైకెక్కి నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్త, నిరసన తెలపడానికి వచ్చిన బీజేపీ యువమోర్చా నేతను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (పక్క ఫొటో)

విజయవాడ/వన్‌టౌన్/గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. విజయవాడ వేదికగా బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు బుధవారం బాహాబాహీకి దిగాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌పై బీజేపీ యువమోర్చా నాయకులు కోడిగుడ్లు, టమాటాలతో దాడికి పాల్పడటంతో వివాదం మరింత ముదిరింది. తొలుత బీజేపీ యువమోర్చా నాయకులు.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఏపీసీసీ చీఫ్ షర్మిల, కార్యకర్తలు, నాయకులు లోపల ఉన్నారు. బీజేపీ యువమోర్చా నాయకులు వచ్చారని తెలియగానే.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బయటకు వచ్చి గొడవకు దిగారు. పరస్పర తోపులాటల నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి యువమోర్చా నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని ఏఆర్ గ్రౌండ్స్‌కు తరలించారు. కాంగ్రెస్ కార్యాలయ గేటును పోలీసులు మూసేయగా, గేటు తెరవాలంటూ పోలీసులపై కాంగ్రెస్ నాయకులు వాదనకు దిగారు. ఇదంతా చూస్తున్న షర్మిల.. బీజేపీ కార్యాలయంపైకి వెళ్లేందుకు నాయకులకు సూచించినట్టు తెలిసింది. పోలీసులు గేట్లు తెరవకపోవడంతో చాలాసేపు షర్మిల, కాంగ్రెస్ నాయకులు కార్యాలయ ఆవరణలోనే ఆందోళన నిర్వహించారు. పోలీసులు షర్మిలకు నచ్చజెప్పినా మిగతా 6లో..



పాలిసెట్‌కు 6,762 మంది హాజరు

- విజయవాడ, నందిగామ, తిరువూరులో 18 పరీక్షా కేంద్రాలు

6లో

డార్క్ హైవే

- జి.కొండూరు నుంచి గొల్లపూడి వరకు వెలగని సెంటర్ లైట్లు
- చీకట్లో అష్టకష్టాలు పడుతున్న వాహనదారులు

8లో

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు ఎస్.కె.ఫర్జానా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు) ప్రభుత్వం ద్వారా ఇచ్చే వివిధ పథకాల సబ్సిడీ రుణాలు 2025-26 సంవత్సరానికి గాను 21 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల మైనార్టీలకు రూ. లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనార్టీలకు రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక అయిన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్ వెబ్‌సైట్ (హెచ్‌టీటీపీఎస్:// ఏపీఓబీఎంఎంఎస్. ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ మే 25గా పేర్కొన్నారు. వివరాలకు 0866-2491148 ఫోన్ నెంబరు ద్వారా లేదా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్టీఆర్ సర్కిల్, పటమటలోని కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గోల్డ్ మెడల్ సాధించిన శిరీషకు ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు


శిరీషను శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఇందిరా గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 25 నుంచి 27 వరకు నిర్వహించిన 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన బి.శిరీషను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. సీనియర్-ఏ విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన శిరీష గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసింది. ఈ సందర్భంగా శిరీషను ఎంపీ అభినందించి శాలువాతో సత్కరించారు. శిరీష ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీ చేసి ఇండియా యోగాసన టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఇండియా తరఫున పోటీ పడి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కార్మికుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

కార్మికుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఉత్పత్తి, సేవా రంగాలను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం, కార్మికులు పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. గురువారం మే డే సందర్భంగా కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు చెబుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఢిల్లీని తలదన్నే రాజధాని ఎక్కడ!

» సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ 2014 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చి, ఇంత వరకు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు విమర్శించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కిందట మోదీ అమరావతికి శంకుస్థాపన చేసి నిధులు ఇస్తామని ఆశపెట్టి ఢిల్లీ నుంచి చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టితెచ్చి ప్రజల నోట్లో కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం కేంద్రప్రభుత్వ బాధ్యతని, 2014-19 కాలంలో టీడీపీ, బీజేపీ హయాంలో రాజధాని నిర్మాణానికి రూ.42 వేల కోట్లు అవసరమని కేంద్రానికి నివేదికలు పంపినా, పదేళ్లలో కేంద్రం ఇచ్చింది రూ.1500 కోట్లు మాత్రమేనని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసిందన్నారు. అమరావతిలో నలభైకి పైగా కేంద్రప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు 300 ఎకరాలకుపైగా భూమి కేటాయించగా, అనేక విభాగాలు కనీసం స్థలాలు కూడా స్వాధీనం చేసుకోలేదన్నారు. రాజధాని నిర్మాణానికి అప్పులు ఇచ్చి రాష్ట్ర ప్రజలను అప్పుల పాలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్‌కు 6,762 మంది హాజరు


పరీక్షా కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న సాంకేతిక విద్యాశాఖ అధికారి ఎ.రవికుమార్

భారతీనగర్, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఎన్టీఆర్ జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ -2025 ప్రశాంతంగా ముగిసింది. ఎన్టీఆర్ జిల్లాలోని మూడు ప్రధాన పట్టణాలైన నందిగామ, విజయవాడ, తిరువూరు ప్రాంతాలలోని మొత్తం 18 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు 6,762 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఎ.రవికుమార్, బి.రమాసుందరి పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారని ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్, విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.విజయ సారధి తెలిపారు.

రాజమార్గం!

విజయవాడ వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి

- నిర్మాణాలు పూర్తికాకపోయినా రాజధాని పునర్నిర్మాణ సభ నేపథ్యంలో అధికారుల నిర్ణయం
- ఏలూరు జిల్లా నుంచి వచ్చే వారంతా చిన్న అవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కుతారు..
- ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలు గొల్లపూడి సర్వీసు రోడ్డు నుంచి నూతనంగా నిర్మించిన కృష్ణా బ్రిడ్జిపైకి..
- కృష్ణా బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం దిగి.. అక్కడి నుంచి సభాస్థలికి వాహనాలు


విజయవాడ వెస్ట్ బైపాస్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఇంకా నిర్మాణం పూర్తికాని విజయవాడ వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జి అందుబాటులోకి రానున్నాయి. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి సభకు తరలివచ్చే వాహనాలన్నింటినీ విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా అనుమతించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు ఇంకా పూర్తి కాలేదు. మధ్యలో కొన్ని ఆర్‌వోబీలు బయటకు చొచ్చుకు రావడంతో వాటిని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులు చేస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల సమస్య వల్ల కొన్ని చోట్ల ఆర్‌వోబీలు పూర్తి కాలేదు. అయినప్పటికీ ఆర్‌వోబీల ప్రాంతంలో రెండు వైపులా సర్వీసు రోడ్లు వేసి ఉండడం వల్ల విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా రాకపోకలు సాగించడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. చిన్నఅవుటపల్లి నుంచి మర్లపాలెం, గన్నవరం, బీబీ గూడెం, కొండపావులూరు, సూరంపల్లి, పాతపాడు, జక్కంపూడి, గొల్లపూడి వరకు నేరుగా వాహనాలు రావడానికి అవకాశం ఉంది. గొల్లపూడి ఫ్లైఓవర్ దాటిన తర్వత ఎన్‌హెచ్ - 65 పై ఉన్న ఆర్‌వోబీ మీదుగా సూరాయపాలెం నుంచి కృష్ణానదిపై కొత్తగా నిర్మితమైన కృష్ణాబ్రిడ్జి మీదుగా రాజధానిలోని వెంకటపాలెం గ్రామంలోకి వెళ్లి అక్కడ నుంచి సభాస్థలికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లోకి వాహనాలు చేరుకోనున్నాయి. కృష్ణా బ్రిడ్జి దాదాపుగా పూర్తికావచ్చింది. విజయవాడ నుంచి అమరావతికి వెళ్లే మార్గంలో ఒకవైపు పూర్తిగా కృష్ణా బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. రెండో మార్గం ఇంకా అందుబాటులోకి రాలేదు.

ఒక మార్గం అందుబాటులోకి రావడంతో అమరావతి సభకు వచ్చే వాహనాలను అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ కూడా చిన్నఅవుటపల్లి దగ్గర విజయవాడ వెస్ట్ బైపాస్ ఎక్కి గొల్లపూడి, కృష్ణా బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం వెళతాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ కూడా గొల్లపూడి దగ్గర సర్వీసు రోడ్డు ఎక్కి కృష్ణానది బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం చేరుకొని అక్కడ నుంచి సభాస్థలి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌కు చేరుకుంటాయి. కృష్ణా బ్రిడ్జిని సిద్ధం చేయటం కోసం శరవేగంగా బీటీ లేయరు పనులు పూర్తి చేశారు. మొత్తం మూడు కిలోమీటర్ల పొడవున కృష్ణా బ్రిడ్జి ఉంటుంది. సభకు వచ్చే ప్రజలంతా కృష్ణా బ్రిడ్జి మీద ప్రయాణిస్తూ ఒక వైపు కృష్ణా నది అందాలు, మరోవైపు దూరాన ప్రకాశం బ్యారేజ్, నది మధ్యలో దీవులు ఇవన్నీ వీక్షించుకుంటూ అమరావతి రాజధానిలోకి అడుగు పెట్టవచ్చు. కృష్ణా బ్రిడ్జి ఇంత అత్యద్భుతంగా నిర్మించారన్నది ఇప్పటి వరకు ప్రజలకు పెద్దగా తెలియదు. అమరావతి సభ పుణ్యమా అని ప్రజలంతా కృష్ణాబ్రిడ్జి గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడింది.

ఘల్లు ఘల్లు మన్న మువ్వల సందడి

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా శ్రీ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నగరంలోని యువనాట్యాచార్యుల సమ్మేళనంతో దాదాపు 250 మంది కూచిపూడి, ఆంధ్ర నాట్య, భరతనాట్య ప్రదర్శనలతో సిద్ధార్థ కళా వేదిక ఘల్లు ఘల్లు మంటూ మువ్వల సవ్వడితో అలరారింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఈ నాట్య సమ్మేళనం ప్రముఖ ఆంధ్ర నాట్యాచార్యులు, పిల్లా ఉమామహేశ్వరపాత్రుడు పర్యవేక్షణలో జరిగింది. నాట్యాచార్యులు పి.హేమంత్‌కుమార్, గోనుగుంట శైలశ్రీ, పద్మశ్రీ హేమంత్, చిముదూరి అజయ్ కుమార్, యల్లాజోస్యుల అనురాధ, సప్పా శివకుమార్, మాగులూరి త్రినాధాచారి తదితరులు నిర్వహణ చేశారు. వేదికపై నాట్య గురువులకు సత్కారం, చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ద్వారకా జయలక్ష్మి, హపీషా చౌదరి, అనూష నాయుడు, తన్మయి, లేఖ్య భరణి, మేఘన, ప్రణతి, ఆర్.శ్రీనివాసరావు, తేజస్వి, సత్యానందిని తదితర 21 మంది పలు శాస్త్రీయ నాట్యాంశాలను రమణీయంగా ప్రదర్శించి నటరాజుకు నాట్య నీరాజనాలర్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాటక రంగ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ముఖ్య అతిథులుగా శారదా రామకృష్ణ, డాక్టర్ ఎం.రమేష్, పీవీ భాస్కరశర్మ, రామిశెట్టి కొండలరావు, డాక్టర్ చింతా బాలకృష్ణ, డాక్టర్ వాండ్రాసి శ్రవణ్‌కుమార్, గుజ్జారి అప్పారావు తదితరులు పాల్గొని భారతీయ శాస్త్రీయ నాట్యం ఉత్కృష్టమైనదని, వాటిలో దక్షిణాదిన కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర నాట్యం ప్రపంచ దేశాలలో ప్రత్యేకమైన గుర్తింపు కలిగి భారతదేశ కీర్తిని ఇనుమడింప చేశాయని, కళలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని, అటువంటి వాటిలో నృత్యం శారీరక ధారుడ్యాన్ని కలిగిస్తుందన్నారు. భవిష్యత్తరానికి ఈ నాట్యాన్ని ఒక సంపదగా అందిస్తూ తీర్చిదిద్దుతున్న నాట్యాచార్యులు ప్రశంసనీయులన్నారు.



నాట్య సమ్మేళనంలో బృంద నృత్య ప్రదర్శన

విధ్వంసం నుంచి పునర్వికాసం

(5వ పేజీ తరువాయి)

వంటివి చేయడంతో పాటు సమాంతరంగా టెండర్ల ప్రక్రియను నిర్వహించి వాటిని ఖరారు చేసి ఎల్వోఏలను ఇచ్చారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలావరకు పనుల ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

అమరావతి రూపురేఖలను మార్చేలా..

అమరావతికి మళ్లీ ఊపిరిలూదటంతో పాటు రూపురేఖలను మార్చేసేలా భారీ మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.77,250 కోట్లతో పనులు నిర్దేశించారు. ఇవికాకుండా మరో రూ.30 వేల కోట్లకు సంబంధించిన పనులు, అనుబంధ పనులను నిర్దేశించుకున్నారు. రూ.49 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. గృహ, భవన నిర్మాణ పనులకు సంబంధించి రూ.12,700 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఐకానిక్ బిల్డింగ్స్ కేటగిరీలో సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అఖిల భారతస్థాయి అధికారుల భవనాలు ఉన్నాయి. రాజధానిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.16,200 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ఆర్టీరియల్ రోడ్లు, సబ్ ఆర్టీరియల్ రోడ్లు, ఫ్లడ్ మిటిగేషన్ పనులు ఉన్నాయి. ఎల్పీఎస్ ఇన్ఫ్రా కింద రూ.20,100 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ నెట్‌వర్క్ వంటి అనేక పనులు వీటిలోనే ఉంటాయి.


శిలాఫలకాలు శుభ్రం చేస్తున్న కార్మికురాలు

ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల సమీకరణ

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల మేర సమీకరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం మంజూరైంది. హడ్కో కూడా రూ.11 వేల కోట్లు ఇచ్చింది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే టెండర్లు పిలిచిన వాటికి, పిలవాల్సిన వాటికి సంబంధించి ఇంకా రూ.74 వేల కోట్ల నిధులు కావాల్సిన అవసరం ఉంది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు వస్తే మరో రూ.69 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నిధుల కోసం డొమెస్టిక్ అండ్ ఇంటర్నేషనల్ బాండ్ మార్కెట్ ద్వారా, మల్టీలేటరల్ ఏజెన్సీలు, బ్యాంకుల ద్వారా, కేంద్ర ప్రభుత్వ సాయం, పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), భూ విక్రయాలు (ల్యాండ్ మానిటైజేషన్) వంటి మార్గాల ద్వారా సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏర్పాట్లు దాదాపు పూర్తి

అమరావతిలో మంత్రి నారాయణ పర్యటన

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించి అమరావతిలో సభావేదిక, పార్కింగ్ సహా మిగతా ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి వెళ్లిన ఆయన బుధవారం అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. తోపులాటకు తావులేకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వర్షం వస్తే పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయం చూడాలన్న సీఎం చంద్రబాబు సూచనలతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించినట్లు చెప్పారు. సభకు వచ్చేవారి కోసం 3వేల బస్సులు, 1,000 కార్ల పార్కింగ్ కోసం ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 5 లక్షల మందికి జనాభా వచ్చే అవకాశం ఉండటంతో మరికొన్ని చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 6,500-7వేల బస్సులు, 3 వేల కార్లు పార్కింగ్ చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం పలుకుతున్నామని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్తున్నాయని ఆయన తెలిపారు. అనంతరం మంత్రి సభావేదిక, ప్రాంగణాన్ని పరిశీలించారు.

రేపే వేడుక

(5వ పేజీ తరువాయి)

గుల్లలమోద దగ్గర రూ.1,500 కోట్లతో విఎస్సైల్ టెస్ట్ రేంజ్ సెంటర్ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. విశాఖలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే యూనిటీ మాల్‌కు కూడా శంకుస్థాపన చేస్తారు. అలాగే, రూ.293 కోట్ల వ్యయంతో గుంతకల్లు వెస్ట్ నుంచి మల్లప్పగేటు వరకు చేపట్టిన రైల్వే ప్రాజెక్టుకు, రూ.3,176 కోట్లతో నేషనల్ హైవే ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. రూ.3,680 కోట్ల విలువైన పలు నేషనల్ హైవే పనులను ప్రారంభిస్తారు. రూ.254 కోట్లతో పూర్తిచేసిన ఖాజీపేట-విజయవాడ 3వ లైన్‌ను, గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో బుగ్గనపల్లి, పాణ్యం రైల్వేలైన్లకు కూడా మోదీ ప్రారంభిస్తారు.

గోశాలలకు స్థలం కేటాయించండి

» ప్రభుత్వానికి అజయ్‌వర్మ ఠాకూర్ విజ్ఞప్తి

గాంధీనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో గోశాలలు నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించాలని గోసేవా సంరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌వర్మ ఠాకూర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంస్థ ప్రథమ రాష్ట్రస్థాయి సమావేశం గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోవుల సంక్షరణపై సానుకూలంగా ఉండటం అభినందనీయమన్నారు. ఒక్కొక్క గోశాలలో 108 గోవులు ఉండేలా గోశాలలను నిర్మించడం జరుగుతుందన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం



గవర్నర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్, సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాజేష్, పలువురు డైరెక్టర్లు కలిశారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ పాలక మండలి తొలి సమావేశం లో పలు సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. బడ్జెట్‌లో ఆర్యవైశ్యులకు భారీగా నిధులు కేటాయించారని, పేదలకు ఆర్థిక భరోసా కల్పించడానికి సహకార క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారని గుర్తు చేశారు.

పెరుగుతున్న ట్రాఫిక్‌తో నిత్యం ప్రమాదాలు

- నివారించాలని హైవే అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వినతి



విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతుండడంతో 4 రోడ్ల కూడళ్ల వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నిత్యం అనేక మంది ఈ కూడలి వద్ద ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హైవే అధికారులతో మాట్లాడుతూ మండలంలోని కేసరపల్లి, గాంధీబొమ్మ సెంటర్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిత్యం ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, రాత్రి పూట సరైన వెలుతురు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనల మేరకు రద్దీగా మారిన ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టి సిగ్నల్ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. పనిచేయని విద్యుత్ దీపాలను పునరుద్ధరించి సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. పాదచారుల కోసం రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మార్గమధ్యలో హైవేపై జరుగుతున్న పనులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

(5వ పేజీ తరువాయి)

వినలేదు. దాడికి ప్రయత్నించిన వారిపై కేసులు నమోదుచేసి, అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసు నమోదుచేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆమె నిరసన విరమించారు. అనంతరం పోలీసులు షర్మిలను ఆమె వాహనంలోనే గన్నవరం విమానాశ్రయానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి షర్మిల బెంగళూరు వెళ్లారు.

నిఘా వైఫల్యం

ఆంధ్రరత్న భవన్ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఫల్యం కనిపిస్తోంది. కేసరపల్లిలో షర్మిలను అడ్డుకున్న పోలీసులు అక్కడి నుంచి నేరుగా గవర్నర్‌పేటలోని పార్టీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చినప్పుడు కనీసం నిఘా లేకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపు

» ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారుల నిర్ణయం
» వివరాలు వెల్లడించిన ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 2వ తేదీన వస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం రాత్రి 10 గంటల వరకు జిల్లాలోకి వివిధ మార్గాల ద్వారా వచ్చే వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

- కాకినాడ జిల్లా నుంచి విశాఖపట్నం-చెన్నై వెళ్లే వాహనాలు కత్తిపూడి సెంటర్, కాకినాడ, యానాం, అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం, రేపల్లె, బాపట్ల మీదుగా ఒంగోలు వెళ్తాయి.
- గుంటూరు జిల్లా మీదుగా చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు బడంపాడు క్రాస్‌రోడ్, తెనాలి, పులిగడ్డ, మచిలీపట్నం, లోసరిబ్రిడ్జి, నరసాపురం, అమలాపురం, కాకినాడ, కత్తిపూడి మీదుగా వెళ్తాయి.
- తూర్పు గోదావరి జిల్లా నుంచి విశాఖపట్నం-హైదరాబాద్ వెళ్లే వాహనాలు. దివాన్ చెరువు, గమాన్‌బ్రిడ్జి, దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, సత్తుపల్లి, ఖమ్మం, సూర్యాపేట మీదుగా ప్రయాణిస్తాయి.
- ఏలూరు జిల్లా మీదుగా విశాఖపట్నం-హైదరాబాద్ వెళ్లే వాహనాలు భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్తాయి. ఏలూరు బైపాస్, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు ప్రయాణిస్తాయి.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు కృష్ణాజిల్లా మీదుగా వెళ్లే వాహనాలు హనుమాన్‌జంక్షన్, నూజివీడు, మైలవరం, ఇబ్రహీంపట్నం, నందిగామ మీదుగా వెళ్తాయి.
- ఎన్టీఆర్ జిల్లా మీదుగా హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు నందిగామ, మధిర, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గామన్ బ్రిడ్జి మీదుగా వెళ్తాయి. మరికొన్ని వాహనాలు ఇబ్రహీంపట్నం, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా ప్రయాణిస్తాయి.
- విజయవాడ ఎయిర్‌పోర్టుకు వచ్చే వాహనాలు రామవరప్పాడు ఫ్లైఓవర్, ఆంధ్రజ్యోతి కార్యాలయం, ముస్తాబాద, సూరంపల్లి అండర్‌పాస్ ద్వారా గన్నవరం చైతన్యస్కూల్ వద్ద జాతీయ రహదారి 16పైకి వచ్చి ఎయిర్ పోర్టుకు వెళ్తాయి.

పంచాయతీ రోడ్లకు మహర్దశ!

» ఎన్టీఆర్ జిల్లాలో 10 రోడ్లకు రూ.18 కోట్లు కేటాయింపు
» జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జిల్లాలో పంచాయతీ రోడ్ల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాకు ప్రభుత్వం 10 రోడ్ల అభివృద్ధికి రూ.18 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో 24.96 కిలోమీటర్ల పొడవున పలు మేజర్ పంచాయతీ రోడ్లను అభివృద్ధి పరచనున్నారు. దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించటంతో పాటు కొత్తగా రోడ్లు వేయనున్నారు.

- జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలంలో పెద్ద మోదుగుపల్లి నుంచి వత్సవాయి వరకు రెండు కిలోమీటర్ల పొడవున రూ. 90 లక్షల వ్యయంతో రోడ్డును అభివృద్ధి పరచనున్నారు.
- పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల నుంచి వయా గుమ్మడిదుర్రు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల పొడవున రూ.90 లక్షల వ్యయంతో రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.
- బూదవాడ నుంచి అనాసాగరం వరకు అంటే నారాయణ తండా వరకు రూ. 80 లక్షలు వ్యయంతో రోడ్డును అభివృద్ధి పరచనున్నారు.
- సత్యనారాయణపురం వయా షేర్ మహమ్మద్ పేట నుంచి ఎన్‌హెచ్ - 9 వరకు రెండు కిలోమీటర్ల పొడవున రూ.70 లక్షల వ్యయంతో రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.
- మైలవరం నియోజకవర్గంలో మొరుసుమల్లి నుంచి మొరుసుమల్లి తండా వరకు 2.80 కిలోమీటర్ల దూరం రూ.1.68 కోట్ల వ్యయంతో రోడ్డు అభివృద్ధి పరచనున్నారు.
- జీ.కొండూరు మండలంలో కుంటముక్కల నుంచి ఐటీ రోడ్డు వరకు 2.20 కిలోమీటర్ల దూరం రూ.1.32 కోట్ల వ్యయంతో రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.
- నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలంలో జయంతి నుంచి ఎర్రుపాలెం రోడ్డు వరకు 2.81 కిలోమీటర్ల పొడవున రూ.1.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు.
- అనాసాగరం నుంచి హనుమంతపాలెం వరకు 2.40 కిలోమీటర్ల పొడవునా రూ.1.48 కోట్ల వ్యయంతో రోడ్డు వేయనున్నారు.
- తెల్లదేవరపల్లి నుంచి రేపూడి వయా జొన్నలగడ్డ వరకు 4.16 కిలోమీటర్ల పొడవున రూ.2.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి పరచనున్నారు.
- తిరువూరు నియోజకవర్గంలోని ఎంఎన్‌కే రోడ్డును 3.60 కిలోమీటర్ల దూరం రూ.1.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి పరచనున్నారు.



54 కేజీల చందనంతో వేంకటేశ్వరస్వామి అలంకరణ

చిట్టినగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వైశాఖమాస శుద్ధ తదియ అక్షయ తృతీయ సందర్భంగా చిట్టినగర్‌లో ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల వెంకటేశ్వరస్వామికి 54 కేజీల చందనంతో అలంకరించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు తెలిపారు. ఉదయం నుంచి స్వామిని అధికంగా భక్తులు దర్శించుకుని, ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

శ్రీశ్రీ సాహిత్యం అజరామరం

● జయంతి కార్యక్రమంలో వక్తలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలు దోపిడీ ఉన్నంత వరకు శ్రీశ్రీ రచనలు, సాహిత్యం అజరామరంగా ఉంటాయని, భవిష్యత్తు తరాలకు ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహాకవి శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో ఉన్న శ్రీశ్రీ విగ్రహం వద్ద సంస్మరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సాహిత్య, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీశ్రీ విగ్రహానికి ఎక్స్‌రే సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రోగ్రెసివ్ ఫోరం కార్యదర్శి బి. జమీందార్‌లు ఎర్ర శాలువా కప్పారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సాహిత్య నిధి సంస్థ ప్రచురించిన మందారమాల, జ్వాలాతోరణం, ఘంటసాల గళంలో, శ్రీశ్రీ పద్యపానం, హాస్య వ్యంగ్య గీతాలు, విభిన్న గళాల్లో శ్రీశ్రీ, మార్గదర్శి శ్రీశ్రీ, నూరేళ్ళ శ్రీశ్రీ పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసాహితీ సంస్థ కార్యదర్శి దివికుమార్, ప్రజాశక్తి సంస్థ కార్యదర్శి లక్ష్మయ్య, సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, సింగంపల్లి అశోక్‌కుమార్, మొండేపు ప్రసాద్, సర్వజిత్, హజరత్తయ్య గుప్తా, చింతకాయల చిట్టిబాబు, అరసం నేతలు అజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, అంజనేయరాజు, ఏపీ రచయితల సంఘం కార్యదర్శి చలపాక ప్రకాష్ పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన సిబ్బందితో అడ్మిన్ డీసీపీ సరిత

శేషజీవితం ఆనందంగా గడపాలి

ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమంలో డీసీపీ సరిత

గుణదల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పోలీసుశాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారు శేషజీవితం ఆనందంగా గడపాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ కె.జీ.వి.సరిత తెలిపారు.

పోలీస్ కమిషనరేట్లో పనిచేసి పదవీ విరమణ చేసిన 11మంది సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం కమిషనర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీపీ సరిత మాట్లాడుతూ ఇప్పటి వరకు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించిన మీరంతా ఎప్పటికీ పోలీసుశాఖ కుటుంబమే అని చెప్పక తప్పదన్నారు. కమిషనరేట్లో పలు విభాగాల్లో పలు హోదాల్లో పనిచేసిన ఉద్యోగులను డీసీపీ సరిత దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు ఏవో సునీత, ఏ.ఆర్. ఏసీపీ డి.ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడే సభను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పటమట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పటమట ఈ-సేవ కేంద్రం వద్ద జరిగే మే డే సభను విజయవంతం చేయానలి సీఐటీయూ నగర నాయకులు వి.పి రాజు కార్మికులకు, కర్షకులకు పిలుపునిచ్చారు. గత 40 ఏళ్లుగా మే డేను పటమట ఈ-సేవ కేంద్రం వద్ద వందలాది కార్మికులతో ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.వి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. బెంజ్‌సర్కిల్ కార్మికుల అడ్డా వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేశ్వరరావు, కె.రామకృష్ణ, డి.వెంకన్న, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం చంద్రబాబు కృషి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం తూర్పు పరిధి 3వ డివిజన్ కనక దుర్గానగర్ పార్క్ ఏరియాలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించి వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో సుమారు రూ. 3కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తారని తద్వారా రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మే 2న అమరావతిలో జరుగుతున్న ప్రధాని మోదీ సభకు ప్రజలు స్వచ్ఛందంగా రావాలని ఎమ్మెల్యే గద్దె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు గోళ్లపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు తాడి బాబు రావు, గద్దె రమేష్, సీతారామయ్య, దాడి సుబ్బారావు, యలమంచిలి పండు, గుత్తికొండ మోహనరావు, జనసేన నాయకులు బండి కోమలి, గండ్రాజ సత్యనారాయణరాజు, కోటిరెడ్డి, గుంజా ఏసు పాల్గొన్నారు.



వాటర్‌ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఉదయభాను

జనసైనికుల సేవా కార్యక్రమాలు అభినందనీయం

● జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను

పటమట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా జనసేన నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. పటమట కోదండ రామాలయంలో జనసేన నాయకులు పెన్నూరు దామోదరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, బాడిత శంకర్, డాక్టర్ కొండవీటి సంతోష్ కృష్ణ, గాదిరెడ్డి అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

గుణదల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మహాత్మాగాంధీ రోడ్, రామవరప్పాడు రింగ్ రోడ్డు హైవే ప్రాంతాలను బుధవారం పర్యటించి పారిశుధ్య పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ప్రతి రోజూ సకాలంలో పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రధాన రహదార్లు, జంక్షన్లలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. రోడ్లపై చెత్త , వ్యర్థాలు పడేయడం నివారించాలని హెచ్చరించారు. నగర ప్రజలు ఆరోగ్యవంతమైన వాతావరణంలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.



పారిశుధ్య విభాగం పనులు పర్యవేక్షిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

స్టడీ మెటీరియల్ పంపిణీ

లబ్బీపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోని అత్యధిక ఉద్యోగాలు సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.ఎస్.శిరోమణి అన్నారు. బుధవారం ఫార్చ్యూన్ మురళీ హోటల్ వద్ద ఉన్న ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెట్ ద్వారా ఎంపికైన డీఎస్సీ విద్యార్థులకు, ఎస్‌జీటీ, ఎస్ఏ వారిక ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్, సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, కోచింగ్ సెంటర్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపరమైన కోర్సులు నేర్చుకోవాలి

వేసవి శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణలో జనశిక్షణా సంస్థ డైరెక్టర్ ఎ.పూర్ణిమ



ప్రసంగిస్తున్న జనశిక్షణా సంస్థ డైరెక్టర్ ఎ.పూర్ణిమ

లబ్బీపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుతో పాటు నైపుణ్యతను పెంచుకునే విధంగా ఏదో ఒక వృత్తిపరమైన కోర్సు నేర్చుకోవాలని జనశిక్షణా సంస్థ డైరెక్టర్ ఎ.పూర్ణిమ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం కళాశాల ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్, కంప్యూటర్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వృత్తి పరమైన కోర్సులను నేర్చుకుంటే జీవితానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వేసవి శిక్షణా తరగతులు గురువారం (మే 1 తేదీ) నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గంవర్క్స్, మెహందీ డిజైన్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ తదితర కోర్సులు మే ఒకటి నుంచి జూన్ 15వరకు ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ పురోహిత పరిషత్ నూతన కార్యవర్గం

పటమట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణ పురోహిత పరిషత్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం మంగళవారం పటమట విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ధ్యాన మందిరంలో నిర్వహించారు. పురోహిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా వెల్లంకి భవాని శంకర్ ప్రసాద్, రామడుగు వాసు శర్మలను, కోశాధికారిగా పాలడుగు సత్యనారాయణ శర్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉగాది పురస్కార గ్రహీతలైన బవిరి రవి, చాలక ప్రకాష్‌లను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధన శాస్త్రి, కార్యదర్శి కందుకూరి సత్య బ్రహ్మాచారి ఆధ్వర్యంలో ఈ ఎన్నికల నిర్వహించారు.



విశ్వ బ్రాహ్మణ పురోహిత పరిషత్ నూతన కార్యవర్గం

ఉద్యోగాలకు 118 మంది ఎంపిక

ఉయ్యూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 118 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ఉపాధి శిక్షణ అధికారి సీహెచ్ అనీల్‌కుమార్ తెలిపారు. జాబ్‌మేళాకు 207మంది హాజరు కాగా అందులో 118 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శివనాథ్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్ కుమార్, టి.మధు, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తనను, తన కుమారుడిని పని ఒత్తిడిలో పడి భర్త సరిగ్గా పట్టించుకోవడం లేదని వివాహిత బుధవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం కీసర గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీనివాసరావు- లక్ష్మీ హర్షిత భార్యాభర్తలు. వా టర్ క్యాన్లు పంపిణీ చేసుకుంటూ జీవిస్తుంటారు. వీరికి ఏడు నెలల బాబు ఉన్నాడు. బాబుకు ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రికి తీసుకెళ్లాలని శ్రీనివాసరావును భార్య అడిగింది. వాటర్ క్యాన్లు వేయాలి నువ్వే తీసుకెళ్లమని భార్యతో అనడంతో, కుమారుడి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదని, మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఎస్సై భువనగిరి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

గాంధీనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు దాడి చేసి 28 మంది ప్రాణాలు బలి తీసుకోవడం అత్యంత హేయమని సీనియర్ సిటిజన్స్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిని ఖండిస్తూ నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సూర్యరావు, కేఎస్.హనుమంతరావు, సభ్యులు జనార్ధన్‌సింగ్, పీఏ లక్ష్మీ, ఏడీ నాగేశ్వరరావు, ప్రసాద్, సాయిబాబా, రామచంద్రారెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొని ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు.



నిరసనలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్



అగ్నిప్రమాద నిరోధక చర్యలపై అవగాహన

గవర్నర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఏలూరు రోడ్డు, లెనిన్ సెంటర్, చందనా బ్రదర్స్ షోరూంలలో వీఎంసీ ఫైర్ ఆఫీసర్లు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి, స్మోక్ అలారం ఎలా వస్తుంది, కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎన్. వెంకటేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ డి. మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం. రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రాంలో పరిచయం.. దళిత మహిళను గర్భవతిని చేసిన యువకుడు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విభేదాల కారణంగా భర్తకు దూరంగా ఉంటున్న ఒక దళిత మహిళను ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకుని, వంచించి గర్భవతిని చేసిన యువకుడిపై ఎస్సై రాజు ఎస్సీ ఎస్టీ అత్యాచార చట్టం కింద బుధవారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని తొర్రగుంటపాలేనికి చెందిన మహిళ(25) భర్తతో విభేదాల కారణంగా కొంతకాలంగా ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి వద్ద ఉంటోంది. ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన చింతల నరేంద్ర(23) ఆమె భర్తతో వేరు గా ఉంటుందని తెలుసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. రెండు నెలల గర్భంతో ఉన్న ఆమెను పెళ్లి చేసుకోమంటే మొహం తప్పించి తిరుగుతున్నాడని మహిళ ఫిర్యాదు చేసింది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద కేసు న మోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నందిగామ ఏసీపీ తిలక్ విచారణ చేయనున్నారు.

వేడినీళ్ల కాలువలో యువకుడి మృతదేహం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం వేడినీళ్ల కాలువలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం..మృతుడు సుమారు 5.4 అడుగుల ఎత్తుతో సన్నగా ఉన్నాడని, జుట్టు నలుపుగా ఉందని, సుమారు 20 ఏళ్ల లోపు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. కాఫీ రంగు ఫుల్ డ్రాయర్, నలుపు రంగు ప్యాంట్, రెండు పేటల ఎరుపు రంగు మొలతాడు దేహంపై ఉన్నాయని తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్సై విజయలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణం.. కమనీయం



నీటి పారుదల శాఖ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్, సాయి నర్మద వివాహం బుధవారం కంకిపాడులోని అయాన కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి తెలుగు రాష్ట్రాల ప్రముఖులు ఎంతోమంది విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఉమ్మడి జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం రాజగోపాల్, కొలికపూడి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు హాజరయ్యారు. - కంకిపాడు, ఆంధ్రజ్యోతి

దుర్గగుడిలో ఘనంగా మహాలక్ష్మీయాగం



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా మహాలక్ష్మీయాగాన్ని నిర్వహించారు. మంత్రపూర్వక ఆహుతులను సమర్పించిన అనంతరం అమ్మవారికి వివిధ ఉపాచారాలను నిర్వహించారు. చివరిలో ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు.అక్షయ తృతీయ విశేషాలు, దుర్గగుడిలో జరిగిన హోమం గురించి దేవస్థానం పురాణ పండిట్ చింతపల్లి వెంకటేశ్వర శాస్త్రి వివరించారు. వేద పండితులు, అర్చకులు యాగాన్ని నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

రేపు శంకర జయంతి, నగరోత్సవం

జగద్గురు ఆదిశంకరుల జయంతి సందర్భంగా దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మే 2న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి నూతనంగా నిర్మించిన పూజా మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఈవో కె. రామచంద్ర మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మహామండపం నుంచి నగరోత్సవం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నగరోత్సవం మహామండపం, అర్జునవీధి, రథం సెంటర్, కెనాల్ రోడ్డు, వినాయక ఆలయం మీదుగా తిరిగి దేవస్థానానికి చేరుకుంటుందన్నారు.

పదవీ విరమణ చేసిన ప్రీతి సుడాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవితో పాటు కేంద్రంలో అనేక విశిష్ట బాధ్యతలు నిర్వహించిన ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారిణి ప్రీతి సుడాన్ మంగళవారం పదవీ విరమణ చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కొవిడ్ సమయంలో అనేక కీలక చర్యలను చేపట్టి ప్రశంసలను అందుకున్న ప్రీతి సుడాన్‌కు మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రూపొందించిన ఘనత దక్కింది. ప్రీతి సుడాన్‌ను నవంబర్ 22న కేంద్ర యూపీఎస్సీ సభ్యురాలిగా నియమించింది. 2024 ఆగస్టులో ఆమె కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రీతి సుడాన్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో చదివారు. వాషింగ్టన్‌లో పబ్లిక్ ఫైనాన్స్ మేనేజిమెంట్‌లో శిక్షణ పొందారు.

నాబార్డు రుణంతో గ్రామీణ రోడ్లు మంజూరు

- రూ.557 కోట్లతో 402 రోడ్ల పనులు

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో నాబార్డు రుణ సహకారంతో 402 రోడ్లు మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ కింద 30వ విడత కార్యక్రమం కింద రూ.557.22 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి నాబార్డ్ రుణం రూ.369.86 కోట్లు కాగా, రాష్ట్ర వాటా రూ.187.36 కోట్లు కేటాయిస్తారు. మైదాన ప్రాంతాల్లో 337 పనులు, ఎస్సీ నివాసిత ప్రాంతాల్లో 46, ఎస్టీ నివాసిత ప్రాంతాల్లో 19 పనులు మంజూరుచేస్తూ ఆదేశాలిచ్చారు.

మాంగల్య పూజ పేరుతో ముంచేస్తాడు!

- టీటీడీ ఉద్యోగినంటూ పరిచయం
- ఆపై క్షేత్ర పవిత్రత వివరిస్తూ ముగ్గులోకి
- పుష్కరిణిలో స్నానం చేసి రావాలంటూ సూచన
- పూజకు సిద్ధం చేస్తానంటూ బంగారంతో పరారీ
- తిరుమలలో మహిళల నుంచి 132 గ్రాముల బంగారం కొట్టేసిన మోసగాడి అరెస్టు



మురుగన్ నాగరాజు

తిరుమల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'పుణ్య పుష్కరిణిలో మునిగి రండి ఆలయం ముందు మాంగల్య పూజ చేస్తాం. మీ భర్తకీ, కుటుంబానికీ మేలు జరుగుతుంది' అని తిరుమలకు వచ్చిన భక్తులను నమ్మించి బంగారంతో ఉడాయించే ఒక ఘరానా మోసగాడిని తిరుమల పోలీసులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. టీటీడీ ఉద్యోగినంటూ ఇప్పటికే రూ.13 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు కొట్టేసినట్లుగా గుర్తించారు. మదురైకి చెందిన మురుగన్ నాగరాజు అలియాస్ శంకర్‌రావు లీలలు తెలుసుకున్న పోలీసులు నివ్వెరపోయారు. తిరుమల ఆలయం పరిసరాల్లో భక్తిపారవశ్యంలో ఉండే వారిని మురుగన్ ఎంపిక చేసుకుంటాడు. తాను టీటీడీలో పని చేస్తున్నానంటూ పరిచయం చేసుకుంటాడు. తిరుమల క్షేత్ర పవిత్రత గురించి గొప్పగా చెప్పి ఆలయం ముందు మాంగల్య పూజ చేయించుకుంటే భార్యాభర్తల బంధం గట్టిగా ఉంటుందని చెబుతాడు. దుకాణాల వద్దకు తీసుకువెళ్లి మట్టి గాజులు కొనిస్తాడు. ఒంటిమీదున్న బంగారు ఆభరణాలు తీసుకుని, పుష్కరిణిలో స్నానం చేసి ఆలయం ముందుకు రమ్మంటాడు. అక్కడ మాంగళ్యపూజ చేస్తామని నమ్మిస్తాడు. పూజకు ఏర్పాట్లు చేస్తానంటూ బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయిస్తాడు. ఇలా మార్చి 29న 40 గ్రాముల బంగారు మాంగళసూత్రం, లక్ష్మీ డాలర్ చైన్, సెల్‌ఫోన్లు కొట్టేశాడు. మార్చి14న తాను టీటీడీ విజిలెన్స్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌లో పనిచేస్తానని చెప్పి కోయంబత్తురుకు చెందిన శరణ్య అనే మహిళను నమ్మించాడు. 80 గ్రాముల బంగారు నగలు తీసుకుని ఆమెను పుష్కరిణిలో మునిగి రమ్మని పంపి పరారయ్యాడు. ఇదే నెల 18న తిరువళ్లూరుకు చెందిన లక్ష్మి నుంచి 12 గ్రాముల బంగారు గొలుసు తీసుకుని మాయమైపోయాడు. భక్తుల ఫిర్యాదులతో తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు చలపతి, రమేష్‌బాబు ప్రత్యేక బృందంగా ఏర్పడి మురుగన్ కోసం గాలింపు ప్రారంభించారు. చెన్నై, మదురై, పుదుచ్చేరి నగరాల్లో క్రైం స్టేషన్లను సందర్శించి పాత రికార్డులను పరిశీలించగా నిందితుడి వివరాలు వెలుగులోకి వచ్చాయి. మురుగన్ నాగరాజుపై ఏపీ, తమిళనాడుల్లో 20కి పైగా కేసులున్నట్టు వెల్లడైంది. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అతన్ని అరెస్ట్ చేసి, 132 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మురుగన్ నాగరాజును తిరుపతి కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించింది.

చోరీ అయిన కియా ఇంజన్లు దుబాయ్‌కి!


- ఢిల్లీలో ముగ్గురిని విచారించిన సిట్ పోలీసులు
- మాయాపురి మార్కెట్‌లో 288 విక్రయించినట్లు గుర్తింపు
- తమిళనాడులో కార్ ఇంజన్లు తరలించిన కంటైనర్లు స్వాధీనం

హిందూపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కియా పరిశ్రమలో చోరీ అయిన కార్ ఇంజన్లు దుబాయ్‌కు తరలిపోయినట్లు సిట్ విచారణలో గుర్తించారు. పెనుకొండ సబ్ జైలులో ఉన్న చోరీ కేసు నిందితుల్లో ఆరుగురిని ఈ నెల 26న పోలీసు కస్టడీకి తీసుకుని, వారిలో ఇద్దరిని ఢిల్లీకి తీసుకెళ్లారు. ఐదు రోజులపాటు అక్కడే విచారించారు. ఆ ఇంజన్లను ఎవరు కొన్నారు? ఎక్కడికి తరలించారు అనే విషయాలను ఆరా తీశారు. వారిచ్చిన సమాచారం మేరకు ఢిల్లీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. మధ్యవర్తుల నుంచి తాము కొన్న 288 కార్ ఇంజన్లను మాయాపురి మార్కెట్‌లో విక్రయించామని ఆ ముగ్గురు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. చిన్నపాటి మరమ్మతులు ఉన్న కొత్త ఇంజన్లే తాము తెచ్చామని ఆ మధ్యవర్తులు తమకు చెప్పారని, ఇన్వాయిస్‌ల ఆధారంగా ఒక్కో ఇంజన్‌ను రూ.15 వేలకే విక్రయించారని వెల్లడించారు. ఆ మార్కెట్ నుంచి ఇంజన్లు దుబాయికి వెళ్లిపోయినట్లు పోలీసుల విచారణలో తేలింది. తాము విచారించిన ముగ్గురికీ పోలీసులు నోటీసులు ఇచ్చి, అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆదేశించినట్లు సమాచారం. తాము కొన్న ఇంజన్లకు ఇన్వాయిస్ రేట్ ప్రకారం తిరిగి చెల్లించేందుకు సిద్ధమని ఢిల్లీలో కొన్నవారు సిట్ పోలీసులుకు చెప్పినట్లు తెలిసింది. కాగా, మాయమైన ఇంజన్ల రికవరీ దాదాపు అసాధ్యమేనని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. దేశం దాటి వెళ్లిన వాటిని రికవరీ చేయడం అంత సులభంగా కాదని అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో కార్ ఇంజన్లను తరలించేందుకు ఉపయోగించిన కంటెనర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని పెనుకొండకు తీసుకువచ్చారు. ఇక నిందితుల కస్టడీ ముగియడంతో బుధవారం వారిని కోర్టులో హాజరు పరిచి, పెనుకొండ సబ్‌జైలుకు తరలించారు.

ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ బాషా

కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ బాషా ఎన్నికయ్యారు. విజయవాడలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎలక్షన్ ఆఫీసర్ ఎల్.సుధాకర్ అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియ జరిగింది. మొత్తం 13 మంది సభ్యులలో 10 మంది సమావేశానికి హాజరయ్యారు. మొదట హజ్ కమిటీ మెంబర్ పఠాన్ ఖాదర్ అలీ ఖాన్‌ను చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా హజ్ కమిటీ మెంబర్ మీర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్ బలపర్చారు. దీనికి మద్దతుగా మిగిలిన సభ్యులందరూ తమ ఆమోదాన్ని తెలిపారు. ఆ మేర కు ఎలక్షన్ ఆఫీసర్ ఎల్.సుధాకరరావు, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చై ర్మన్‌గా షేక్ హసన్ బాషా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఏపీ హజ్ కమిటీ కార్యనిర్వాహణాధికారి ఎస్.ఎండీ గౌస్ పీర్ ఆధ్వర్యంలో జరిగింది.

డార్క్ హైవే



ఒకపక్క విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి. మరోపక్క ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీయ రహదారి. ఈ రెండూ ఎంతో ప్రాధాన్యత ఉన్న జాతీయ రహదారులు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత పుష్కరాల సమయంలో గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు జాతీయ రహదారి మధ్యలో లైట్లు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిని జి.కొండూరు వరకు 4 లైన్స్‌గా విస్తరించి, మధ్యలో లైట్లు ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దేదీప్యమానంగా వెలిగిన లైట్లు వైసీపీ ప్రభుత్వం రాకతో వెలగడం మానేశాయి. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా సమస్య మాత్రం తీరలేదు. గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం మధ్య చాలా గ్రామాలున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు కూడా అంతే. ముఖ్యంగా కొండపల్లి నుంచి జి.కొండూరు మధ్యన అనేక కంపెనీలున్నాయి. వేలసంఖ్యలో వాహనాలు రాత్రిళ్లు తిరుగుతుంటాయి. దీంతో జాతీయ రహదారుల మధ్య వీధి దీపాలు వెలగడం అనివార్యం. ఏళ్ల తరబడి వెలగకపోయినా పట్టించుకునే నాథుడు లేడు. ఇప్పటికైనా హైవే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కొండపల్లి ఎర్రబిడ్జ్ వద్ద డేంజర్ బెల్స్

ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొండపల్లి ఎర్రబ్రిడ్జ్‌ని రైల్వే లైన్ కారణంగా ఎత్తు పెంచారు. దీంతో కొండపల్లి ఊరిలోపలికి వెళ్లే రహదారి పల్లంగాను, జి.కొండూరుకు వెళ్లే రహదారి ఎత్తుగాను ఉంది. కొండపల్లి ఊరిలో నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు ఎత్తైన బ్రిడ్జ్ నుంచి జాతీయ రహదారి మీదకు దిగే వాహనాలు కలిచే చోట్ల వీధి లైట్లు వెలుగక రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంది. ఇక్కడ ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు గుండెలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి.

రాత్రివేళ ఎంతో ఇబ్బంది

ఎం రామారావు, ఆటో డ్రైవర్



లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళల్లో వాహనాలు నడపలేక పోతున్నాం. ముందున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణం లైట్లు వెలిగేలా చూడాలి.

రోడ్డు మార్జిన్స్ కనబడుట లేదు

ఎం లక్ష్మణరావు, ద్విచక్రవాహనదారుడు



రాత్రి వేళల్లో రహదారిపై లైట్లు వెలగక పోవడంతో రోడ్డు పక్కనున్న మార్జిన్స్ కనిపించడం లేదు. గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం పట్నం వరకు ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చూడాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

వైవీ కృష్ణారావు, విద్యుత్‌శాఖ ఏఈ

లైట్లు వెలగని మాట వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. త్వరలోనే సమస్యను పరిష్కరించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

తవ్వకాలపై తనిఖీలు

- తవ్వకాల ప్రాంతానికి చేరుకున్న అధికారులు
- ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను దాచేసిన అక్రమార్కులు
- స్థానికులను ఆరా తీసిన ఆర్డీవో బాలకృష్ణ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా ఆగడాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మండలంలోని పెద్దవరం పరిధిలోని ఎంసీ, ఏపీఐఐసీ, అటవీ భూముల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు మట్టి కొల్లగొడుతున్నారు. జన సంచారాన్నే నిషేధించిన అటవీ భూముల్లోకి చొరబడి భారీ యంత్రాలతో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి అమ్ముతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన ఏపీఐఐసీ భూములను, ఎంసీ భూములను సైతం కొల్లగొడుతున్న వైనంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారం కావడంతో అధికారులు హుటాహుటీన ఆ గ్రామానికి చేరుకొని విచారించారు. అధికారుల రాకను తెలుసుకున్న అక్రమార్కులు 2 ఎక్సకవేటర్లు, 9 టిప్పర్లను రోడ్డుపైకి కనపడకుండా అటవీ భూముల్లో దాచిపెట్టారు. ఆర్‌డీవో కే బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్ ఆ ప్రాంతంలో పర్యటించి స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. మట్టి తవ్వకాలు నిరంతరం జరుగుతున్నాయని, అంతేకాక కృష్ణానది నుం చి ఇసుక కూడా అక్రమంగా తరలివెళుతుందని చెప్పిన ట్టు తెలిసింది. స్పందించిన ఆర్‌డీవో ఇకపై మట్టి తవ్వకా లు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, ఈ తవ్వకాల వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకొని చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సురేష్‌ను ఆదేశించారు. మట్టి తవ్వకాలు జరిపినా, రవాణా చేసినా సదరు వాహనాలను పట్టుకొని సీజ్ చేయాలని సిబ్బందికి సూచించారు.



అక్రమార్కులు మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్‌కుమార్

తవ్వకాలు ఆగేనా..?

ఆంధ్రజ్యోతి కథనంతో స్పందించిన ఆర్‌డీవో పెద్దవరం వెళ్లే లోపే అక్రమార్కులకు సమాచారం అందింది. వాహనాలను సైడ్ చేసి అధికారుల కళ్లు కప్పారు. దీన్ని బట్టి కొందరు రెవెన్యూ అధికారులు వారికి సహకరిస్తున్నట్టు తేటతెల్లమైంది. అవినీతి అధికారుల సహకారంతో యథేశ్చగా సాగిస్తున్న ఈ దోపిడీ ఆర్‌డీవో పర్యటనతో ఆగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అధికార పార్టీ నేతలు తాము చేస్తున్న దోపిడీని బయట పెట్టకుండా ఉండేందుకు వైసీపీ నేతలకు కూడా అవకాశం ఇస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఇదే తీరున మట్టి, ఇసుకను ఇరు పార్టీల నేతలు పంచుకొని దోపిడీ చేశారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఈ దోపిడీని ఆపకపోతే ఆందోళన చేపడతామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దోపిడీని అడ్డుకొవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రకృతి సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

దైవ సంకల్పంతో రాజధాని అభివృద్ధి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- భువనేశ్వరీ పీఠం నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన

గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి వాక్ శుద్ధి గల స్వామీజీల అండతో పాటు దైవ బలం కూడా తోడవడంతో గత ప్రభుత్వం అమరావతిని అంగుళం కూడా కదల్చలేకపోయిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని కేసరపల్లి భువనేశ్వరీ పీఠం నూతన భవన నిర్మాణానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు తొండేపు దశరథ జనార్ధన్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం పరితపిస్తున్న కమలానంద భారతీస్వామిని అభినందించారు. జిల్లా అభివృద్ధికి పాటుబడిన మహనీయుల విగ్రహాలను జిల్లా కేంద్రంలో పెట్టేందుకు అధికారులు ముందుకు రాకపోతే తన స్వంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కొత్తగా నిర్మించే పీఠం భవనం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని తీసుకువస్తామన్నారు. టీడీ జనార్ధన్ మాట్లాడుతూ అమరావతి అభివృద్ధి,



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

సంపదకు కేంద్రమని అభివర్ణించిన ఆయన సీఎం చంద్రబాబు దూరదృష్టితో భూమిలిచ్చిన రైతులకు ప్రయోజనం కలిగేలా దేశంలోనే తొలిసారిగా భూ సమీకరణ చేపట్టారన్నారు. మైనారిటీ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ, పాలడుగు రాఘవేంద్ర, దమ్మాలపాటి చంద్రశేఖర్, మూల్పూరి మాధవన్, విష్ణుభట్ల రామచంద్ర, రాఘవశర్మ పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా.. పలువురికి గాయాలు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునేటి కాజ్ వే అవతల వైపున బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన పలువురు గాయాలపాలయ్యారు. చల్లపల్లికి చెందిన నారికం అయ్యప్ప అనే భక్తుడు తన కుమారుడి అన్న ప్రాసన నిమిత్తం తిరుపతమ్మ దేవస్థానానికి వచ్చారు. భోజనం చేసేందుకు వ్యాన్‌లో మునేటి అవతల వైపునకు వెళుతుండగా అడ్డువచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించేందుకు డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో వ్యాన్ రోడ్డుపై పడిపోయింది. అందులోని ఏడుగురు భక్తులు పరిశా గోవర్ధన, నారగం దుర్గారావు, వక్కలగడ్డ సీతామహాలక్ష్మి, గోపాలకృష్ణ, శివపార్వతి, వెంకట నరసమ్మ, నాగలక్ష్మి గాయాలపాలయ్యారు. ఇద్దరికి బలమైన గాయాలవగా వారిని విజయవాడకు తరలించారు. ఎస్సై అర్జున చేరుకొని వ్యాన్‌ను పక్కకు తీయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కలెక్షన్ పాయింట్లుగా డ్రైనేజీ కనెక్షన్లు

- కొత్త కనెక్షన్లు అంటే భయపడుతున్న జనం
- డ్రైనేజీ కనెక్షన్లు ఫీజు కంటే ఆయన ఫీజే ఎక్కువ
- ఎమ్మెల్యే వార్నింగ్ ఇచ్చినా మారని తీరు
- ఆటోలో వెళ్లి మరీ డిమాండ్

మధురానగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నియోజకవర్గంలో ఒక డ్రైనేజీ ఇన్‌స్పెక్టర్ దెబ్బకు కొత్త కనెక్షన్లు తీసుకోవాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. అసలు కంటే కొసరు బాదుడికి భయపడే పరిస్థితి నెలకొంది. వీఎంసీ వాహన డిపోలో వాహనాలకు ఇందనం కొట్టే చోట పని చేసే ఇతడు కొద్ది నెలల క్రితం ఈ ఏరియా ఇన్‌స్పెక్టర్ పదవీ విరమణ చేయగానే బదిలీపై వచ్చి తన తడాఖా చూపించడం మొదలు పెట్టాడు. వాస్తవానికి ఇంట్లో ఒక మరుగుదొడ్డికి వీఎంసీకి చెల్లించేది మొదటి దానికి రూ.2500. రోడ్ కటింగ్ చార్జీలు రూ.3300 కలిపి మొత్తం రూ.5,300 మాత్రమే. ఒకటికంటే ఎక్కువ ఉంటే అదనంగా ఉన్నదానికి కేవలం రూ.1250 మాత్రమే. కొత్త కనెక్షన్‌కు దరఖాస్తు చేస్తే 24 గంటల్లో అనుమతి మంజూరు చేయాలి. కానీ ఇతడి చేతిలో 'ప్రసాదం' పడనిదే అనుమతి రాదు. మధురమైన ఆ ప్రాంతంతో పాటు పక్కనే మరో డివిజన్ కూడా కలవడం కలిసి వచ్చింది. ఇటీవల డివిజన్‌లో సాయిబాబా పేరుతో ఉన్న కాలనీలో ఒక ఇంటికి ఆటోలో వెళ్లి మరీ రూ.15వేలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే డివిజన్‌లో ఒక పాఠశాల పక్కనే ఉన్న అపార్టుమెంట్‌కు కనెక్షన్లు ఇవ్వడానికి అదనంగా ఫ్లాట్‌కు ఇంత అని నిర్ణయించి మొత్తంగా రూ.25వేలు ఇవ్వాలని హుకం జారీ చేశాడు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులందరూ కలిసి టీడీపీ డివిజన్ అధ్యక్షుడి దృష్టికి విషయం తీసుకెళ్లి మధ్యేమార్గంగా రూ.10వేలు సమర్పించినట్టు సమాచారం. పక్క డివిజన్‌లో సినిమా థియేటర్ పక్కనే ఉన్న రెస్టారెంట్ వారు అనధికారంగా కనెక్షన్లు వాడుతున్న విషయం గమనించి వారి నుంచి రూ.30వేలు బాదేశాడు. తరువాత కొత్త కనెక్షన్లు పేరుతో మార్చాడు. గుణదలకు ఉత్తరం వైపు కాల్వల మధ్యలో పొలాలకు అనుకుని ఉండే ఈ ప్రాంతంలో అపార్టుమెంట్లు, ఇండివిడ్యువల్ ఇళ్ల నిర్మాణం జోరుగా ఉండటంతో కలెక్షన్‌పై మరింత శ్రద్ధ పెట్టాడు. 4 నెలల క్రితం ఇతడి వ్యవహారం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు వద్దకు వెళ్లగా ఆయన తీవ్రంగా మందలించడంతో కొద్దిరోజులు విధులకు దూరంగా ఉంచారు. మళ్లీ విధుల్లోకి రాగానే తీరు మారకపోగా తాను కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తిగా చెప్పుకుంటూ డ్రైనేజి కనెక్షన్‌లను కాసులకు కలెక్షన్ పాయింట్‌లుగా మార్చుకున్నాడు. ఇతడి దెబ్బకు ఏఈ, డీఈలే హడలిపోతున్నారు.

డీఎస్సీలో క్రీడాకారులకు 3శాతం కోటా

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం హారిజంటల్ రిజర్వేషన్ కల్పిస్తూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పిస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం శాప్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం, క్రీడాప్రాధికార సంస్థ మెగా డీఎస్సీ-2025లో భాగంగా 3 శాతం క్రీడా కోటా నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ మెగా డీఎస్సీలో విడుదల చేసిన 16,347 పోస్టుల్లో 421 పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద కేటాయించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఇన్సెంటివ్స్ అందిస్తుందన్నారు. మే 2 నుంచి 31 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫేక్ సర్టిఫికెట్లపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీలో క్రీడా కోటా కింద ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో 333 పోస్టులు, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో 30 పోస్టులు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో 22 పోస్టులు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2 పోస్టులు, ఏపీ మోడల్ పాఠశాలల్లో 4 పోస్టులు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 7 పోస్టులు, ఏపీ గురుకుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 23 పోస్టులు కేటాయించినట్టు తెలిపారు. క్రీడా ప్రాదికారసంస్థ ఎండీ గిరీష, శాప్ అధికారులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్

ఈ తలనొప్పి ఎందుకు?

డాక్టర్! నా వయసు 30. గత కొంతకాలంగా విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్నాను. ఇది మైగ్రేన్ అని అనుమానంగా ఉంది. ఈ సమస్యకు సమర్థవంతమైన చికిత్స సూచించండి?

- ఓ సోదరి, హైదరాబాద్

Q A



తలలోని రక్తనాళాల మీద ఒత్తిడితో మొదలయ్యే మైగ్రేన్ నొప్పి నరాలకు సంబంధించిన వ్యాధి. తలలో ఓ వైపు మాత్రమే వేధిస్తుంది కాబట్టి దీన్ని పార్శ్వపు నొప్పి అని కూడా అంటారు. తరచూ వచ్చే ఈ నొప్పి తీవ్రత ఒక మోస్తరు నుంచి తీవ్రంగా ఉండే వీలుంది. ఇది పురుషుల్లో కంటే స్త్రీలలో మూడు రెట్లు ఎక్కువ.

లక్షణాలు ఇలా ఉంటాయి: 4 నుంచి 72 గంటల పాటు వేధించే ఈ నొప్పి లక్షణాలు ఇలా ఉంటాయి

- తలనొప్పి ఓ వైపు మాత్రమే ఉండడం
- చీకాకు, మానసిక స్థితి సరిగా ఉండకపోవడం
- ఎండతో, శబ్దాలతో సమస్య తీవ్రమవడం
- వాంతి చేసుకోవడం, వాంతి వస్తున్న భావనకు గురికావడం
- ఈ నొప్పితో దైనందిన కార్యక్రమాలకు ఆటంకం కలగడం
- కంటిచూపు సరిగా ఉండకపోవడం

కారణాలు: నిద్రలేమి, డిప్రెషన్, ఎక్కువసేపు ఎండలో ఉండడం, మహిళల్లో హార్మోన్లు హెచ్చుతగ్గులకు లోనయ్యే సమయాలైన బహిష్టుకు ముందు లేదా తర్వాత ఈ సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఎక్కువగా ప్రయాణించేవారిలో కూడా ఈ సమస్య కనిపిస్తుంది. మైగ్రేన్ వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది.ఈ సమస్యఉంటే న్యూరోఫిజీషియన్‌ను సంప్రతించాలి. ఎమ్మారై/సిటి స్కాన్, రక్తపరీక్షలు, ఇఇజి స్కాన్‌తో సమస్యను నిర్ధారించుకోవచ్చు. ఈ సమస్యకు పూర్తి చికిత్స లేకపోయినా, ఉపశమనానికి చికిత్సలు ఉన్నాయి.

గృహ చిట్కాలు: చీకటి గదిలో ఎటువంటి శబ్దాలు లేకుండా నిద్రపోవడానికి ప్రయత్నించాలి

- చల్లని వస్తువులు, ఐస్ ప్యాక్ నుదుటి మీద పెట్టుకోవాలి.
- ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

ఆహారపుటలవాట్లు: పుదీనాలోని మెంథాల్‌కు మైగ్రేన్‌ను తగ్గించే గుణం ఉంటుంది. కాబట్టి ఆహారంలో పుదీనా చేర్చుకుంటూ ఉండాలి.

- అల్లంలోని జింజెరాల్ అనే రసాయనం కూడా మైగ్రేన్‌ను తగ్గిస్తుంది. కాబట్టి అల్లం కూడా ఆహారంలో చేర్చుకోవాలి.
- మెగ్నీషియం ఎక్కువగా ఉండే పాలకూర, చిలకడ దుంపలు తీసుకోవాలి.
- ఈ ఆహారం తీసుకుంటూ, లక్షణాలు కనిపించినప్పుడు న్యూరోఫిజీషియన్‌ను కలవాలి.

డాక్టర్ దుత్తా ప్రవల్లిక,
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, హైదరాబాద్

అభిరుచి

పద్నాలుగేళ్లకే తల్లిని పోగొట్టుకున్నారు. ఆ వయసులో పెళ్లి చేసుకోమని తండ్రి బలవంత పెట్టడంతో... ఇల్లు వదిలి వెళ్లిపోయారు. అనుకోకుండా అమెరికా చేరి... ఉన్నత చదువులు చదివి... స్టాండప్ కమెడియన్‌గా నవ్వులు విరబూయిస్తున్నారు. స్క్రీన్ రైటర్‌గా... పాడ్‌కాస్టర్‌గా... రచయితగా... వైవిధ్యమైన పాత్రలు పోషిస్తున్న ఆమె... ఇటీవల నటిగా మరో కొత్త పాత్రలో ఒదిగిపోయారు. అమెరికాలో స్థిరపడిన భారత స్టాండప్ కమెడియన్... యాభై ఏళ్ల **జర్నా గార్గ్** ముచ్చట ఇది.



నవ్వుల బాటసారి

"చిన్నప్పటి నుంచే కలలు కనడం... ఆ కలను నిజం చేసుకోవడానికి అహర్నిశలూ శ్రమించడం... నా జీవితంలో ఇవేవీ లేవు. నా బాల్యం, కౌమారం అంతా ముంబయి మహానగరంలోనే సాగింది. పద్నాలుగేళ్లప్పుడు అనారోగ్యంతో మా అమ్మ మరణించింది. కొద్ది రోజులకే నాకు పెళ్లి చేయాలని నిశ్చయించారు మా నాన్న. ఇప్పుడే పెళ్లి వద్దంటే... వినలేదు.

నాలో నేనే ఎంతో బాధపడ్డాను. నా చుట్టూ ఉన్న గోడలు మీద కూలుతున్న అనుభూతి. అందరూ ఉన్నా... ఒంటరినయ్యానన్న బాధ. నా ముందు ఉన్నవి రెండే దారులు... నాన్న చూసిన అబ్బాయిని పెళ్లి చేసుకోవడం. లేదంటే ఇల్లు వదిలి వెళ్లిపోవడం. టీనేజీ వయసు కదా... ఉడుకు రక్తం. నా దారి నేను చూసుకోవాలనుకున్నా. విశేషమేమంటే... అడుగు బయట పెట్టగానే బంధువులు, స్నేహితులు నా కోసం ఇంటి తలుపులు తెరిచారు. అది ఎంతో ధైర్యాన్నిచ్చింది. నేను ఎక్కడ ఉంటే అక్కడ నవ్వులు విరబూస్తాయని అందరూ అంటుండేవారు. వారందరూ నన్ను ఆదరించడానికి అది కూడా ఒక కారణమైంది.

సాహసోపేత నిర్ణయం...

అయితే ఇంటి నుంచి బయటకు వచ్చేశాక... ముంబయిలో ఎక్కువ రోజులు లేను. ఉన్నట్టుండి నా మనసు అమెరికా వైపు మళ్లింది. దానికి కారణం... మా అక్క. తను ఓహియోలోని ఆక్రన్‌లో ఉండేది. 'నేనూ అక్కడికి వచ్చేస్తా'నంటే సరేనంది. మరో ఆలోచన లేకుండా అమెరికా వెళ్లిపోయాను. అక్క, తన కుటుంబం నన్ను ఎంతో ఆదరించారు. నిజంగా నా జీవితంలోనే అది ఒక సాహసోపేత నిర్ణయం. 'యూనివర్సిటీ ఆఫ్ ఆక్రన్' నుంచి ఫైనాన్స్‌లో డిగ్రీ పూర్తి చేశాను. తరువాత 'కేస్ వెస్టర్న్ రిజర్వ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా'లో లా చదివాను. కాలేజీ రోజులను ఎంతో ఆస్వాదించాను.

పదహారేళ్లు ఇంట్లోనే...

చదువు అవ్వగానే 1998లో షలబ్ గార్గ్‌ను పెళ్లి చేసుకున్నాను. మాకు ముగ్గురు సంతానం. భర్త, పిల్లలు, వాళ్లకు కావల్సినవి చూసుకోవడం... పదహారేళ్లు ఇంట్లోనే గడిచిపోయాయి. ఒక రోజు మా పిల్లలు అన్నారు... 'అమ్మా... నువ్వు స్టాండప్ కమెడియన్‌గా ప్రయత్నించు' అని. పదహేనేళ్లు ఇల్లాలి పాత్ర సమర్థవంతంగా పోషించిన నేను... పిల్లల ప్రోత్సాహంతో స్టాండప్ కమెడియన్‌గా కొత్త అధ్యాయం మొదలుపెట్టాను. 2018లో... న్యూయార్క్ నగరం... మైక్ పట్టుకొని వేదిక ఎక్కి తొలిసారి ప్రదర్శన ఇచ్చాను. పూర్తిస్థాయి స్టాండప్ కమెడియన్‌గా మారడానికి ఆ షో దోహదపడింది. మరుసటి ఏడాది అదే నగరంలో మరో ప్రదర్శన. నాటి నుంచి మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు.

స్క్రీన్ ప్లే...

అయితే నేను హాస్య గుళికలు ఇవ్వడంతోనే సరిపెట్టుకోలేదు. ఎప్పటి నుంచో అంతర్లీనంగా దాగివున్న భావాలు అక్షరాలుగా బయటకు రావడం మొదలయ్యాయి. ఖాళీ దొరికినప్పుడు వాటన్నిటినీ కలం పట్టుకొని కాగితం మీద పెట్టేసేదాన్ని. ఆ క్రమంలోనే అనుకోని అవకాశం ఒకటి వచ్చింది... సినిమాకు స్క్రీన్ ప్లే రాయమని. అలా 'రీఅరేంజ్డ్' అనే చిత్రంతో రచయితను అయ్యాను. విశేషమేమంటే... ఆ చిత్రానికి 'ఆస్టిన్ ఫిలిమ్ ఫెస్టివల్'లో ఉత్తమ కామెడీ స్క్రీన్ ప్లే అవార్డు దక్కింది. పదకొండు వేల ఎంట్రీల్లో నాకు అవార్డు రావడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.

ఆ తరువాత మరికొన్ని చిత్రాలకు కూడా స్క్రీన్ ప్లే రాశాను. అంతేకాదు... ఇటీవలే నా జీవిత విశేషాలతో కూడిన సరదా పుస్తకం 'దిస్ అమెరికన్ ఉమన్' ఆవిష్కరణ జరిగింది. దానికి అద్భుతమైన స్పందన వస్తోంది.

ఆత్మసంతృప్తి కోసం...

బాధగా ఉన్నప్పుడు హాస్యం చికిత్సలా ఉపయోగపడుతుంది. మన దృక్పథాన్ని సానుకూలంగా మారుస్తుంది. ఇన్నేళ్ల నా ప్రయాణంలో నాకు బోధపడిన సత్యం ఇది. అందుకే సాధ్యమైనంత మందికి హాస్యం పంచడానికి ప్రయత్నిస్తున్నాను. అమెరికాలోని ప్రముఖ క్లబ్స్, ఇతర వేదికలల్లో కూడా ప్రదర్శనలు ఇస్తున్నాను. ఇవన్నీ డబ్బు తీసుకొని చేసే షోలు. కానీ ఎలాంటి పారితోషికం తీసుకోకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థల కోసం ఉచితంగా షోస్ చేస్తున్నాను. ఇది నా ఆత్మసంతృప్తి కోసం. ఈ ప్రయాణంలో ఎన్నో అవార్డులు గెలుచుకున్నాను. అవన్నీ నాకు ఎనలేని స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని ఇస్తాయి.

తెరపై తళుకులు...

చెప్పాను కదా... నాకంటూ ఏ కలలూ లేవని. వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకొంటూ సాగిపోతున్నాను. అలా వచ్చిన మరో అరుదైన అవకాశమే... సినిమా. గత ఏడాది విడుదలైన 'ఏ నైస్ ఇండియన్ బాయ్' చిత్రంలో కీలక పాత్ర పోషించాను. మొదట నటించడానికి చాలా సంకోచించాను. అయితే దర్శకుడు రోహన్ సేథి... 'కంగారు పడాల్సిందేమీ లేదు. నువ్వు చేయగలవు. భర్త, పిల్లలతో విసుగెత్తిన తల్లి పాత్ర ఇది' అని చెప్పాడు. దాంతో ఈ రోల్ నాకంటే ఎవరూ బాగా చేయలేరనే ధైర్యం వచ్చింది. ఎందుకంటే అది నా జీవితానికి దగ్గరగా ఉంది. కథ కూడా సరదాగా సాగిపోతుంది. ఏదేమైనా... నటించడం నాకు ఒక మంచి అనుభూతిని ఇచ్చింది.

అదొక్కటే తేడా...

కెవిన్ హార్ట్ 'ఐ కాంట్ మేక్ దిస్ అప్: లైఫ్ లెసన్స్' పుస్తకం చదివాక అనిపించింది... తనదీ, నాదీ దాదాపు ఒకటే కథ అది. కాకపోతే అతనిది అమెరికాలోని పేదరిక నేపథ్యం. నాది... భారత్‌లోని ఒక సంపన్న కుటుంబం. అయితే అతడిని వాళ్లమ్మ మార్గదర్శిగా ముందుండి నడిపించింది. మరి నేను..! నా మార్గాన్ని నేనే నిర్మించుకుని... ఒక్కో అడుగూ వేసుకొంటూ ముందుకు సాగాను. ఆ పుస్తకం చదువుతున్నప్పుడు... అందులోని ఒక్కో అక్షరం నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. నేనేంటో, నా బలమేంటో నాకు ఒక స్పష్టతనిచ్చింది. దానికి మా పిల్లల ప్రోత్సాహం తోడైంది. దాని ఫలితమే ఇవాళ ఇన్ని లక్షల మందిని నిత్యం నవ్విస్తోంది. ఒక గృహిణిగా, ముగ్గురు పిల్లల తల్లిగా ఇది నేను సాధించిన విజయం."

> **కెవిన్ హార్ట్ 'ఐ కాంట్ మేక్ దిస్ అప్: లైఫ్ లెసన్స్' పుస్తకం చదివాక అనిపించింది... తనదీ, నాదీ దాదాపు ఒకటే కథ అది. కాకపోతే అతనిది అమెరికాలోని పేదరిక నేపథ్యం. నాది... భారత్‌లోని ఒక సంపన్న కుటుంబం. అయితే అతడిని వాళ్లమ్మ మార్గదర్శిగా ముందుండి నడిపించింది. మరి నేను..! నా మార్గాన్ని నేనే నిర్మించుకుని... ఒక్కో అడుగూ వేసుకొంటూ ముందుకు సాగాను.**



లైట్ వేసుకొని పడుకొంటున్నారా?

కొంతమంది రాత్రిపూట గదిలో లైట్ వేసుకుని పడుకుంటారు. దీనివల్ల శరీరంలో జీవక్రియల పనితీరు, హార్మోన్ల ఉత్పత్తి ప్రభావితమై పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు.

- గదిలో వెలుతురు ఉండ డం వల్ల శరీరంలో... నిద్రించడానికి తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి శాతం తగ్గుతుంది. దీంతో గాఢనిద్రలోకి జారుకోవడం సాధ్యం కాదు. ఫలితంగా ఒత్తిడి, అలసటల నుంచి శరీరానికి విశ్రాంతి లభించదు.
- లైట్ వేసుకుని పడుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ పనితీరు మందగిస్తుంది. దీంతో శరీరం సరైన మోతాదులో గ్లూకోజ్‌ను శోషించుకోలేదు. ఫలితంగా టైప్ 2 మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. రక్తంలోని చక్కెర స్థాయిలో భారీగా హెచ్చుతగ్గులు ఏర్పడతాయి.
- నిద్రించేటప్పుడు చుట్టూ వెలుతురు ఉంటే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. దీనివల్ల గుండెపై ఒత్తిడి పెరిగి పలు గుండె జబ్బులు రావచ్చు.
- లైట్ వెలుతురులో పడుకోవడం వల్ల నిరాశ, మానసిక అశాంతి, చిరాకు, కోపం, తలనొప్పి, ఊబకాయం లాంటి సమస్యలు వస్తాయి. మెదడులోని న్యూరోట్రాన్స్‌మీటర్లు సమతుల్యతను కోల్పోతాయి. భావోద్వేగాల నియంత్రణ సామర్థ్యం, ఆలోచన శక్తి తగ్గుతాయి.



- ప్రశాంతంగా నిద్రించాలన్నా, శరీరం పూర్తిగా విశ్రాంతి పొందాలన్నా చీకటి గదిలో పడుకోవడం మంచిది.

అనారోగ్యానికి ఆహారంతో చెక్

మనకు చిన్నచిన్న అనారోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. ప్రతిదానికీ మందు బిళ్లలు మింగకుండా అందుబాటులో ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.

- అనుకోకుండా జ్వరం వస్తే వెంటనే కొబ్బరినీళ్లు తాగాలి. దీని వల్ల ఒంటి వేడి తగ్గుతుంది.
- కడుపులో వికారంగా అనిపిస్తే అల్లం రసం తీసుకోవాలి. మైకం వచ్చినట్లు అనిపిస్తే పుచ్చకాయ ముక్కలు తినాలి.
- ముఖం మీద మొటిమలు ఎక్కువగా వస్తూ ఉంటే రోజుకు అయిదు బాదం పప్పులు తినాలి.
- నీరసంగా అనిపిస్తే ఖర్జూరం, నిద్ర సరిగా పట్టకపోతే కివి పండ్లు తినడం వల్ల మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- రక్తహీనతతో బాధపడేటప్పుడు పాలకూర తింటే ఫలితం లభిస్తుంది
- కీళ్ల నొప్పులకు వాల్నట్, కంటి సమస్యలకు కేరట్, శ్వాసకోశ సమస్యలకు వెల్లుల్లి తినాలి.
- పొడి చర్మానికి అవకాడో, నోటి దుర్వాసన తగ్గేందుకు యాపిల్ తినాలి.
- జీర్ణాశయంలో అరుగుదలకు మిరియాల టీ, కొలెస్ట్రాల్ తగ్గడానికి ఓట్స్ తీసుకోవాలి.



- కాలేయం ఆరోగ్యంగా ఉండేందుకు దుంపలు, కడుపు నొప్పిగా ఉంటే పండిన బొప్పాయి తినాలి. కండరాల వాపును నిరోధించేందుకు పసుపు ఔషధంలా పని చేస్తుంది.

ఫ్రిజ్‌ను ఇలా వాడాలి..!

వేసవికాలంలో ఎక్కువగా ఫ్రిజ్‌ను వాడుతూ ఉంటాం. మంచినీళ్ల బాటిల్స్ పండ్లు, కూరగాయలు, వండిన పదార్థాలు..... ఇలా అన్నింటినీ ఫ్రిజ్‌లో పెడుతుంటాం. కానీ దాన్ని శుభ్రం చేయడానికి మాత్రం బద్ధకిస్తాం. ఇలా ఎక్కువగా వాడుతూ శుభ్రత విషయంలో అశ్రద్ధ వహిస్తే ఫ్రిజ్ పాడవడమే కాదు అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఫ్రిజ్‌ను వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం...

- ఫ్రిజ్‌లో చల్లదనం పెరిగితే ఫ్రీజర్‌లో పెద్ద మొత్తంలో ఐస్ పేరుకుంటుంది. అలాంటప్పుడు ఫ్రిజ్‌లోని థర్మోస్టాట్‌ను ఆపివేస్తే ఐస్ మెల్లగా కరుగుతుంది. అంతేగానీ చాకు, స్క్రూడ్రైవర్, చెంచాలతో ఐస్‌ను తొలగించే ప్రయత్నం చేయకూడదు. దీని వల్ల ఫ్రీజర్‌లోని అల్యూమినియం పైపులు పగలడం, గ్యాస్ లీక్ అవడం లాంటి సమస్యలు ఏర్పడతాయి.
- ఫ్రిజ్ వెనక భాగంలో ఉండే కాయిల్స్ మీద బూజు, దుమ్ము చేరకుండా చూసుకోవాలి. తరచూ వాటిని శుభ్రం చేస్తూ ఉండాలి. లేదంటే కంప్రెసర్ మీద భారం పడి ఫ్రిజ్ పనితీరు దెబ్బతింటుంది.
- ఫ్రిజ్‌ను గోడకు ఆనించి కాకుండా కాస్త ఎడంగా ఉండేలా చూసుకోవాలి. వెనక భాగానికి గాలి తగిలితే వేడెక్కకుండా ఉంటుంది.
- ఫ్రిజ్ ఆన్‌లో ఉన్నప్పుడు దాన్ని కదపకూడదు. కంప్రెసర్ కింద ఉన్న బాక్సులో ఎప్పుడూ నీళ్లు ఉండేలా చూసుకోవాలి. లేదంటే కంప్రెసర్ వేడెక్కి కాలిపోవచ్చు.
- ఫ్రిజ్‌లో నుంచి పదార్థాలను బయటికి తీసుకువచ్చినప్పుడు వాటి మీద బ్యాక్టీరియా పెరుగుతుంది. వాటిని మళ్లీ ఫ్రిజ్‌లో పెడితే ఆ బ్యాక్టీరియా పెరిగి అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది. కాబట్టి మనకు అవసరమైనంత వరకు మాత్రమే ఫ్రిజ్ నుంచి తీసుకోవాలి.



- ఫ్రిజ్ అరల్లో ముందు కంటే వెనక భాగంలో ఎక్కువ చల్లదనం ఉంటుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండాలి అనుకున్నవాటిని వెనక పెట్టాలి. అరల మీద ప్లాస్టిక్ షీట్లు వేస్తే వాటిని శుభ్రం చేయడం తేలికగా ఉంటుంది.
- ఒక్కోసారి ఫ్రిజ్ నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఫ్రిజ్‌లో పాడైన కూరగాయలు లేదా పండ్లు ఏవైనా ఉన్నాయేమో చూసి వాటిని వెంటనే తొలగించాలి. ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉన్న పదార్థాలను తీసివేయాలి.

న్యూస్ మేకర్



పహల్గాం దుర్ఘటన పటిష్ఠమైన దేశ సరిహద్దు భద్రతను ప్రశ్నించేలా చేసింది. కానీ దేశ సరిహద్దు భద్రత పరంగా వివిధ రకాల బలగాలు వైవిధ్యమైన మార్గాల్లో సైనికులకు నిరంతర శిక్షణను అందిస్తూనే ఉంటాయి. అలాంటి బలగాల్లో ఒకటైన అస్సామ్ రైఫిల్స్, తాజాగా మహిళా డాగ్ హాండ్లర్, రైఫిల్ ఉమన్ **శ్రీలక్ష్మి పీవీ** శిక్షణ పూర్తి చేసి, చరిత్రలో ఒక ప్రత్యేకమైన మైలురాయిని అందుకుంది. పారామిలిటరీ బలగాల్లో మొట్టమొదటి మహిళా డాగ్ హ్యాండ్లర్‌గా గుర్తింపు పొందిన శ్రీలక్ష్మి గురించిన ఆసక్తికరమైన వివరాలు.

సరిహద్దుల్లో పారాహుషార్

సైన్యంలో, మరీ ముఖ్యంగా భద్రతా బలగాల్లో మహిళల పాత్ర పరిమితమే! అయినప్పటికీ కొందరు మహిళలు తమ సత్తాను చాటుకుంటూ పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తూనే ఉంటారు. సరిహద్దు భద్రత, తిరుగుబాట్ల అణచివేత, ఈశాన్య భారత దేశంలో, జమ్ము కశ్మీరులో రాష్ట్రీయ రైఫిల్స్‌లో శాంతిభద్రతల నిర్వహణకు బాధ్యత వహించే భారతదేశ పారామిలిటరీ దళం, అస్సామ్ రైఫిల్స్. ఇండో మయన్మార్ సరిహద్దును రక్షించడం వీరి ప్రాథమిక విధి.

నాలుగు శాతమే...

సరిహద్దు భద్రత కోసం పారామిలిటరీ బలగాలు కఠోరమైన శిక్షణ పొందుతూ ఉంటాయి. ఇలాంటి ఎంతో కీలకమైన, సంక్లిష్టమైన భారతీయ పారా మిలిటరీ బలగాల్లో, ప్రత్యేకించి ముప్పు అత్యంత ఎక్కువగా ఉండే పాత్రల్లో మహిళల సంఖ్యను పెంచుతున్నట్టు అస్సామ్ రైఫిల్స్ ప్రకటించింది. 2030 నాటికి 10% మహిళల భాగస్వామ్యం లక్ష్యంగా వ్యూహాత్మక ప్రణాళికలు రచిస్తున్న అస్సాం రైఫిల్స్‌లో ప్రస్తుతం 4 శాతం మంది మహిళలు పని చేస్తున్నారు. వాళ్లలో శ్రీలక్ష్మి పివి ఒకరు. ఈమె స్వస్థలం, ఇతరత్రా వివరాలను గోప్యంగా ఉంచిన అస్సాం రైఫిల్స్, తాజాగా ఆమె శిక్షణకు సంబంధించిన కొన్ని వివరాలను మాత్రమే ఎక్స్ వేదికగా ప్రకటించింది.



కఠినమైన కేనైన్ యూనిట్

లింగ వైవిధ్యం లక్ష్యంగా అస్సామ్ రైఫిల్స్ చేపట్టిన నియామకాల్లో ఎంపికైన శ్రీలక్ష్మి, ప్రత్యేకమైన కేనైన్ శిక్షణకు ముందు, కఠినమైన భౌతిక, మానసిక పరీక్షలకు లోనైంది. ప్రాథమిక నియామకం నుంచి, డాగ్ హ్యాండ్లింగ్ స్పెషలిస్ట్‌గా పేలుడు పదార్థాలను పసిగట్టడం మొదలు, రాత్రివేళ సంచారం, అధునాతన విధేయత ప్రొటోకాల్ వరకూ అన్ని మెలకువల మీదా పట్టు సాధించింది. ప్రతిభ, చురుకుదనం, అత్యంత ఒత్తిడితో కూడిన వాతావరణాల్లో మెరుగ్గా వ్యవహరించే నైపుణ్యాల ఆధారంగా శ్రీలక్ష్మి ఎంపికైంది. దేశ భద్రతలో కుక్కల పాత్ర కూడా ప్రత్యేకమైనదే! వీటి ఇంద్రియ సామర్థ్యాన్ని దేశ భద్రతకు ఉపయోగించుకునే విభాగం 'కేనైన్ యూనిట్'. ఈ కేనైన్ స్క్వాడ్ ఆధునిక భద్రతా వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి శిక్షణ పొందిన కుక్కలను చొరబాటుదారులను పసిగట్టడం, పేలుడు పదార్థాలను కనిపెట్టడం, విపత్తుల్లో బాధితులకు సహాయ సహకారాలు అందించడం, సరిహద్దులో భద్రతను పెంచడం లాంటి సేవల కోసం వినియోగిస్తూ ఉంటారు. కేనైన్ స్క్వాడ్‌కు సంబంధించిన 'బెల్జియన్ మాలినోయిస్' అనే జాతి కుక్కకు శ్రీలక్ష్మి, డాగ్ హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తోంది. తీవ్ర ఘర్షణలు నెలకొని ఉన్న ప్రాంతాల్లో చురుగ్గా వ్యవహరించే కుక్కలుగా ఈ జాతికుక్కలు పేరు పొందాయి.

ప్రత్యక్ష పోరాటాల్లో సైతం...

శిక్షణలో భాగంగా డాగ్ హ్యాండ్లర్లు, తమకు కేటాయించిన కుక్కతో క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయించడంతో పాటు, వాటి ప్రవర్తనను నియంత్రిస్తూ ఉంటారు. కొన్ని సందర్భాల్లో వీరు కుక్కతో పాటు ప్రత్యక్ష పోరాటాల్లో కూడా పాల్గొనవలసి వస్తూ ఉంటుంది. అస్సాం రైఫిల్స్‌తో మొట్టమొదటి డాగ్ హ్యాండ్లర్‌గా గుర్తింపు పొందిన శ్రీలక్ష్మి, ధైర్యం, దృఢ సంకల్పం, మక్కువలను ప్రదర్శించి, పురుషాధిక్య రంగంలో మార్గదర్శక ప్రయాణాన్ని ప్రారంభించింది. మరెంతో మంది మహిళలు స్ఫూర్తిదాయకమైన శ్రీలక్ష్మి అడుగుజాడలను అనుసరించాలని కోరుకుందాం!

కోరమాండల్ లాభం రూ.578 కోట్లు

న్యూఢిల్లీ: కోరమాండల్ ఇంటర్నేషనల్ ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.578.46 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.163.92 కోట్లతో పోలిస్తే ఇది మూడింతల కంటే ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 28.72 శాతం పెరిగి రూ.6,114.34 కోట్లకు చేరింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా కంపెనీ రూ.2,054.71 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 25.23 శాతం ఎక్కువ. అధిక అమ్మకాలు, మెరుగైన నిర్వహణా సామర్థ్యం, వ్యూహాత్మక నిర్ణయాలతో గత ఆర్థిక సంవత్సరం మంచి పనితీరు సాధ్యమైందని కంపెనీ ఎండీ, సీఈఓ ఎస్ శంకర సుబ్రమణియన్ చెప్పారు.

కాకినాడ ప్లాంట్ విస్తరణ: కాకినాడలోని ప్లాంట్‌ను కోరమాండల్ ఇంటర్నేషనల్ విస్తరిస్తోంది. ఇక్కడ కొత్తగా ఫాస్పారిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్లు వచ్చే ఏడాదికల్లా ఉత్పత్తి ప్రారంభిస్తాయని సుబ్రమణియన్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	445
వరంగల్	432	గోదావరి	430
చిత్తూరు	503	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	92
కర్నూలు	125	నెల్లూరు	97
విశాఖపట్నం	121	అనంతపురం	97
గోదావరి	127		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,910 ▼	89,750 ▼	1,09,000 ▼
విజయవాడ	98,600 ▼	92,500 ▼	99,000 ▼
విశాఖపట్నం	97,240 ▼	89,750 ▼	1,09,000 ▼
రాజమండ్రి	97,960 ▲	89,800 ▲	99,300 ▲
ప్రొద్దుటూరు	97,400 ▼	89,610 ▼	98,800 ▼
ముంబై	94,360 ▼	86,440 ▼	94,110 ▼

కొనుగోళ్లలో అదే జోరు!

అక్షయ తృతీయ బంగారం విక్రయాల్లో 35% వృద్ధి.. పరిమాణం మాత్రం గత ఏడాది స్థాయిలోనే: జీజేసీ



న్యూఢిల్లీ: బంగారం.. భారతీయ సంప్రదాయంలో ఒక భాగం. పండగలు, పెళ్లిళ్లకు ఎంతో కొంత పసిడి కొనుగోలు చేయడం మనోళ్ల ఆనవాయితీ. ముఖ్యంగా అక్షయ తృతీయకు బంగారం, వెండి వంటి విలువైన లోహాలు కొనుగోలు చేస్తే బాగా కలిసివస్తుందని హిందువులు భావిస్తారు. గత ఏడాది కాలంలో బంగారం ధరలు వేగంగా పెరుగుతూ ప్రస్తుతం తులం బంగారం రూ.లక్షకు చేరువలో ఉంది. అయినప్పటికీ, ఈ అక్షయ తృతీయ నాడు బంగారం, వెండి కొనుగోళ్లు చురుగ్గానే సాగాయని ఆభరణాల వర్తకులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి దేశవ్యాప్తంగా విక్రయాల విలువలో 35 శాతం వరకు వృద్ధి నమోదు కావచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) అంచనా వేసింది. విక్రయాల పరిమాణం మాత్రం గత ఏడాదిలాగే 20 టన్నుల స్థాయిలో ఉండవచ్చని అసోసియేషన్ చైర్మన్ రాజేశ్ రోక్డే అన్నారు. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల బంగారం బుధవారం రూ.98,550 పలికింది. గత ఏడాది ఇదే పండుగ రోజున ధర రూ.72,300గా ఉంది. అంటే బంగారం ధర గత ఏడాది కాలంలో 36.30 శాతం మేర పెరిగితే 2020 ఏప్రిల్‌తో పోలిస్తే 100 శాతానికి పైగా పెరిగింది.

పాత బంగారం మార్చుకున్నారు..

దక్షిణాదిలో అక్షయ తృతీయ కొనుగోళ్లు ఉదయం నుంచే పెరిగాయని.. ఉత్తరాదిలో మాత్రం సాయంత్రానికి ఊపందుకున్నాయని జీజేసీ పేర్కొంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఈ సారి అనూహ్యంగా మంగళ సూత్రాలు, చైన్లతోపాటు వెండి పాత్రలకు డిమాండ్ అధికంగా కన్పించిందని రాజేశ్ రోక్డే తెలిపారు. వినియోగదారులు తమ అవసరం లేదా బడ్జెట్‌కు అనుగుణంగా ఆభరణాలు, నాణేలు, కడ్డీలు కొనుగోలు చేశారన్నారు. ఈసారి యువత కూడా కొనుగోళ్లకు ఆసక్తి చూపారన్నారు. కాగా, 50 శాతం కొనుగోళ్లలో వినియోగదారులు తమ పాత బంగారాన్ని మార్చుకున్నారని పీఎన్‌జీ జువెలర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ అన్నారు.

మొత్తం బిజినెస్ రూ.16,000 కోట్లు

ఈ సారి రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల బంగారం, రూ.4,000 కోట్ల విలువైన 400 టన్నుల వెండి విక్రయాలు జరగవచ్చని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది.

హైదరాబాద్‌లో మిశ్రమ స్పందన

హైదరాబాద్ సిటీ(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్షయ తృతీయకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆభరణ విక్రయాల్లో మిశ్రమ స్పందన కన్పించింది. అధిక ధరల కారణంగా బంగారం కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి చూపలేదని సికింద్రాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి ప్రతాప్ తెలిపారు. షాపులను సందర్శించిన కస్టమర్లలోనూ అధిక శాతం చిన్న మొత్తాల్లో కొనుగోళ్లు జరిపారని, వెండి కొనుగోలుకు ప్రాధాన్యమిచ్చారన్నారు. ఇక అధిక మొత్తంలో బంగారం కొనుగోళ్లలోనూ వివాహ సంబంధిత జువెలరీనే అధికమని పేర్కొన్నారు.

కాస్త దిగొచ్చిన బంగారం

అక్షయ తృతీయ నాడు పసిడి ధరలు కాస్త దిగివచ్చాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.900 తగ్గి రూ.98,550కి పరిమితమైంది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో తగ్గి రూ.98,100 పలికింది. కిలో వెండి మాత్రం ఏకంగా రూ.4,000 తగ్గుదలతో రూ.98,000కు జారుకుంది. అంతర్జాతీయంగా ఈ విలువైన లోహాల ధరలు గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1.31 శాతం జారి 3,273.90 డాలర్ల స్థాయికి పడిపోగా.. సిల్వర్ 32.33 డాలర్ల వద్ద ట్రేడైంది.

మార్చి త్రైమాసికంలో తగ్గిన డిమాండు

న్యూఢిల్లీ: అధిక ధరలు బంగారం గిరాకీకి గండికొట్టాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక పేర్కొంది. బుధవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది మార్చి త్రైమాసికానికి భారత్‌లో పసిడి డిమాండ్ 15 శాతం తగ్గి 118.1 టన్నులకు పడిపోయింది. అధిక ధరల ప్రభావంతో విలువ మాత్రం 22 శాతం పెరిగి రూ.94,030 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బంగారం రేటు 25 శాతం ఎగబాకడమే ఇందుకు కారణం. ఒకదశలో 10 గ్రాముల ధర రూ.లక్ష దాటింది. ఇది బంగారం కొనుగోళ్లపై ప్రభావం చూపిందని నివేదిక అభిప్రాయపడింది. కాగా, ఈ ఏడాది భారత్‌లో పసిడి గిరాకీ 700-800 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చని డబ్ల్యూజీసీ అంచనా వేసింది.

ఏపీ గ్రామీణ బ్యాంకు ఆవిర్భావం

నేటి నుంచి కార్యకలాపాలు



గుంటూరు/అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నాలుగు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల అధికారికంగా విలీనమయ్యాయి. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లు విలీనమై కొత్తగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఆవిర్భవించినట్లు ఆ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గురువారం నుంచి అమల్లోకి వస్తుందన్నారు. గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, సమర్థవంతమైన సేవలను ప్రజలకు అందించడం ఈ విలీన ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. పాత నాలుగు బ్యాంకుల్లోని ఖాతాలను, డిపాజిట్లను కొత్త బ్యాంకులోకి మారుస్తున్నారని, బ్యాంకుల విలీనంపై ఖాతాదారులు గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాయోజిత బ్యాంకుగా ఉంటుందన్నారు. ఈ బ్యాంక్‌కు రాజధాని అమరావతిలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతానికి గుంటూరులో కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. సుమారు రూ. 1,25,000 కోట్ల విలువైన వార్షిక వ్యాపార సామర్థ్యం కలిగిన ఈ బ్యాంకు 7 వేల మంది ఉద్యోగులతో 1,351 బ్రాంచ్‌లు కలిగి ఉందన్నారు.

ట్రంప్ దెబ్బకు జీడీపీ కుదేలు

మార్చి త్రైమాసికంలో మైనస్ 0.3%

వాషింగ్టన్: అధ్యక్షుడు ట్రంప్ సుంకాల యుద్ధం అమెరికాకే ఎసరు పెడుతోంది. దీంతో ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో అమెరికా జీడీపీ వృద్ధిరేటు మైనస్ 0.3 శాతానికి పడిపోయింది. ట్రంప్ సుంకాల పోటు తప్పించుకునేందుకు అమెరికా కంపెనీలు పెద్ద ఎత్తున దిగుమతులకు దిగడం ఇందుకు ప్రధాన కారణం. గత ఏడాది డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అమెరికా జీడీపీ 2.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. ట్రంప్ సుంకాల పుణ్యమాని అది మార్చి నాటికి మైనస్ 0.3 శాతానికి తిరోగమించింది. వరుసగా జూన్ త్రైమాసికంలోనూ అమెరికా జీడీపీ వృద్ధి రేటు మైనస్‌లోకి పోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకున్నట్టే.

భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం

భారత్‌తో త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదరనుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇందు కోసం రెండు దేశాల మధ్య జరుగుతున్న చర్చలు దాదాపుగా ఒక కొలిక్కి వచ్చాయన్నారు. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ చేసిన వ్యాఖ్యలూ ఈ విషయాన్ని మరింత బలపరుస్తున్నాయి. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అమెరికా అతి చేరువలో ఉందని ఆయన విలేకరులతో చెప్పారు. దీంతో జూలై 9లోపే అమెరికా-భారత్ మధ్య బీటీఏ కుదిరే సూచనలు కనిపిస్తున్నాయి. తాను విధించిన సుంకాలకు ట్రంప్ 90 రోజుల పాటు విరామం ప్రకటించారు. ఆ గడువు జూలై 9తో ముగుస్తుంది. ఈ లోపే బీటీఏ పూర్తి చేసి అమలు చేసేందుకు రెండు దేశాలు చర్చలు ముమ్మరం చేశాయి.

మన ఐటీకి మేలే : రోష్ని నాడార్

ట్రంప్ సుంకాలతో భారత ఐటీ కంపెనీలకు మేలే జరుగుతుందని హెచ్‌సీఎల్ గ్రూపు చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్‌హోత్రా చెప్పారు. ఈ సుంకాలతో అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగి కంపెనీలు తమ ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తాయన్నారు. అది భారత ఐటీ కంపెనీలకు అవకాశంగా మారే అవకాశం ఉందన్నారు.

స్వల్ప నష్టాల్లో మార్కెట్

నేడు సెలవు

మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మార్కెట్‌కు గురువారం సెలవు. ఈక్విటీ, ఫారెక్స్ కమోడిటీ మార్కెట్లు పని చేయవు.

ముంబై: భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, బజాజ్ ద్వయం షేర్లలో అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో బుధవారం ఈక్విటీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లతో ట్రేడయింది. చివరికి సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అయితే విదేశీ నిధుల రాకలో నిలకడగా కారణంగా నష్టాలు పరిమితం అయ్యాయి. సెన్సెక్స్ 46.14 పాయింట్ల నష్టంతో 80,242.24 వద్ద ముగియగా నిఫ్టీ 1.75 పాయింట్ల నామ మాత్రపు నష్టంతో 24,334.20 వద్ద ముగిసింది.

మరో 42 పైసలు లాభపడిన రూపాయి: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరింత బలపడింది. అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి గురువారం 42 పైసలు లాభపడి 84.54 వద్ద ముగిసింది.

ఎన్‌సీసీకి రూ.1,663 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మౌలిక వసతుల రంగంలోని ఎన్‌సీసీ లిమిటెడ్ ఏప్రిల్ నెలలో రూ.1663 కోట్ల విలువ గల (జీఎస్‌టీ వినహా) ఆర్డర్లు సాధించింది. వాటిలో రూ.1082 కోట్లు భవనాల డివిజన్‌కు దక్కగా రూ.581 కోట్లు రవాణా విభాగానికి దక్కాయి.

మార్కెట్లోకి రూ.6 కోట్ల లంబోర్ఘినీ కారు



న్యూఢిల్లీ: సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ లంబోర్ఘినీ బుధవారం భారత మార్కెట్లోకి టెమెరారియో పేరుతో కొత్త కారును ప్రవేశపెట్టింది. ట్విన్ టర్బో వీ8 హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ ఇంజన్‌తో కూడిన దీని ధర రూ.6 కోట్లు. ఈ కారు గరిష్ఠంగా గంటకు 343 కి.మీ వేగంతో దూసుకెళ్లగలదని, గంటకు సున్నా నుంచి 100 కి.మీ వేగాన్ని కేవలం 2.7 సెకన్లలో అందుకోగలదని కంపెనీ తెలిపింది.

అవును.. విడిపోయాం

ఏడాదిన్నర క్రితమే విడాకులు తీసుకున్నాం
హితేష్ చౌధరితో వ్యాపార సంబంధమే
బాక్సర్ మేరీ కోమ్



2005లో పెళ్లి

మేరీ, కరుంగ్ 2005లో పెళ్లి చేసుకున్నారు. వీరికి కవలలు సహా ముగ్గురు కుమారులున్నారు. తర్వాత బాలికను దత్తత తీసుకున్నారు. కాగా 2022లో జరిగిన మణిపూర్ లోకసభ ఎన్నికల్లో మేరీ భర్త పోటీచేసి ఓడిపోయాడు. ఆ ఎన్నికకు 2-3 కోట్ల రూపాయలు ఖర్చయిందట. దీని తర్వాత మేరీ పిల్లల్ని తీసుకుని ఫరీదాబాద్ వెళ్లిపోగా, భర్త ఢిల్లీలోనే ఉంటున్నాడు.

న్యూఢిల్లీ: భర్త కరుంగ్ ఆంఖోలెర్‌తో తాను విడాకులు తీసుకున్నట్టు ఒలింపిక్ పతక విజేత బాక్సర్ మేరీ కోమ్ (42) బుధవారం ప్రకటించింది. డిసెంబరు 20, 2023న ఇరు కుటుంబాలు, గిరిజన మత పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్నట్టు ఆమె తెలిపింది. అంతేకాదు.. వ్యాపారవేత్త, ఓ అంతర్జాతీయ బాక్సర్ భర్త అయిన హితేష్ చౌధరితో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్టు వస్తున్న పుకార్లను మేరీ ఖండించింది. మేరీ కోమ్ బాక్సింగ్ ఫౌండేషన్ చైర్మన్ అయిన హితేష్‌తో తనది వ్యాపార సంబంధమేనని స్పష్టంజేసింది. కాగా.. మేరీ వ్యక్తిగత జీవితంపై కొన్నాళ్లుగా మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమె న్యాయ బృందం స్పందించింది. ఈమేరకు సుదీర్ఘమైన ప్రకటన విడుదలజేసింది. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకుండా..కోమ్ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని ఆ ప్రకటనలో కోరారు. కాగా తామిద్దరూ కలిసి దిగిన ఫొటోలను మేరీ, హితేష్ తమ సోషల్ మీడియా ఖాతా నుంచి తొలగించారు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

వార్సా: గ్రాండ్ చెస్ టూర్ సూపర్ బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడో స్థానంలో నిలిచాడు. బ్లిట్జ్ విభాగంలో 7 రౌండ్లలో ఓడిన ప్రజ్ఞానంద (20.5 పాయింట్లు) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. రష్యన్ గ్రాండ్‌మాస్టర్ వ్లాదిమిర్ ఫెడోసీవ్ (26.5) విజేతగా నిలిచాడు. మరో భారత జీఎం అరవింద్ చిదంబరం (17) 8వ స్థానంలో నిలిచాడు.

బంగ్లా ఇన్నింగ్స్ గెలుపు

చట్టోగ్రామ్: మెహిదీహసన్ మిరాజ్ (104, 5/32) సూపర్ షోతో.. జింబాబ్వేతో రెండో, ఆఖరి టెస్టులో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో గెలిచింది. మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే నెగ్గిన బంగ్లా.. రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఆటకు మూడోరోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 291/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 444 రన్స్‌కు ఆలౌటైంది. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్ స్కోరు 227కు.. 217 పరుగుల ఆధిక్యం సాధించింది. అనంతరం జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 111 రన్స్‌కే కుప్పకూలింది.



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు సభ్యులు రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ, మహిళా క్రికెటర్ శ్రేయాంక పాటిల్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

మితిమీరిన ప్రశంసలే సమస్య

» వైభవ్ స్టార్‌డమ్‌పై ద్రవిడ్



న్యూఢిల్లీ: 14 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మీడియా అతిగా దృష్టి సారించడం మంచిది కాదని రాజస్థాన్ కోచ్ రాహుల్ ద్రవిడ్ హితవు పలికాడు. ఒక ఇన్నింగ్స్‌తో తనకు వచ్చిన స్టార్‌డమ్‌ను తట్టుకొనేందుకు అతడు మార్గాలు కనుగొనాల్సి ఉంటుందన్నాడు. క్రికెట్ ప్రపంచమూ ఇకపై వైభవ్‌ను విస్మరించే పరిస్థితి ఉండదని ద్రవిడ్ స్పష్టంజేశాడు. కాగా భయం లేకుండా బ్యాటింగ్ చేయడమే వైభవ్ ప్రత్యేకతని అతడు ప్రశంసించాడు. ఆ వయస్సులో అలా ఆడే ఆటగాడిని చూడలేమని అన్నాడు. 'బ్యాట్‌ను వేగంగా కదపడమే అతడి పవర్. సూర్యవంశీ బ్యాక్‌లిఫ్ట్, చేతికి, కంటికి మధ్య సమన్వయం అమోఘం' అని విశ్లేషించాడు.

చెన్నై అవుట్

4 వికెట్లతో పంజాబ్ గెలుపు
శ్రేయాస్, ప్రభ్‌సిమ్రన్ అర్ధ శతకాలు
చాహల్ హ్యాట్రిక్



శ్రేయాస్ (72)



చాహల్ (4/32)

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కథ ముగిసింది. ఎనిమిదో ఓటమితో ధోనీ సేన ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించగా.. 13 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకిన పంజాబ్ కింగ్స్ నాకౌట్‌కు చేరువైంది. యజ్వేంద్ర చాహల్ (3-0-32-4) హ్యాట్రిక్‌కు శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72) అదిరే అర్ధ శతకంతోడు కావడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో చెన్నైను చిత్తు చేసింది. తొలుత చెన్నై 19.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. సామ్ కర్రాన్ (88), బ్రెవిస్ (32) పోరాడారు. అర్ష్‌దీప్, జాన్సన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో పంజాబ్ 19.4 ఓవర్లలో 194/6 స్కోరు చేసి నెగ్గింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (54) రాణించాడు. పతిరన, ఖలీల్ చెరో 2 వికెట్లు తీశారు. శ్రేయాస్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఆరంభం నుంచే దూకుడు..: ఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (23), ప్రభ్‌సిమ్రన్ తొలి వికెట్‌కు 44 పరుగుల భాగస్వామ్యంతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, ఐదో ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదిన ఆర్యను ఖలీల్ అవుట్ చేయడంతో.. ఆరు ఓవర్లకు పంజాబ్ 51/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్, కెప్టెన్ అయ్యర్ రన్‌రేట్ తగ్గకుండా స్కోరు బోర్డును నడిపించారు. అయితే, ప్రభ్‌ను నూర్ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 72 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు తెరపడింది. తర్వాత వధేరా (5)ను పతిరన పెవిలియన్ చేర్చాడు. చివరి 5 ఓవర్లలో పంజాబ్ విజయానికి 52 పరుగులు అవసరం కాగా.. అయ్యర్, శశాంక్ (23) 18 బంతుల్లో 44 పరుగులు జోడించడంతో.. పంజాబ్ మరో 2 బంతులు మిగిలుండగానే గెలిచింది. విజయానికి 3 పరుగుల దూరంలో ఉండగా.. అయ్యర్‌ను పతిరన క్లీన్‌బౌల్డ్ చేశాడు.

చాహల్ మాయాజాలం..: కర్రాన్ ముందుండి నడిపించడంతో చెన్నై భారీ స్కోరు చేసే విధంగా కనిపించినా.. చాహల్ హ్యాట్రిక్‌తో డెత్ ఓవర్లలో ఒక్కసారిగా కుదేలైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు షేక్ రషీద్ (11), ఆయుష్ మాత్రే (7)తోపాటు జడేజా (17) విఫలం కావడంతో.. పవర్‌ప్లేలో 48/3తో మూడు టాపార్డర్ వికెట్లు కోల్పోయిన చెన్నై కష్టాల్లో పడింది. ఈ దశలో కర్రాన్, బ్రెవిస్ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, జోరుగా సాగుతున్న వీరి భాగస్వామ్యాన్ని ఒమర్జాయ్ విడదీశాడు. 15వ ఓవర్‌లో బ్రెవిస్‌ను ఒమర్జాయ్ బౌల్డ్ చేయగా.. సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కర్రాన్ ఆ తర్వాత మరింతగా చెలరేగాడు. 16వ ఓవర్‌లో కర్రాన్ ఏకంగా 26 పరుగులు పిండుకోవడంతో.. స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అయితే, 172 పరుగుల స్కోరు వద్ద కర్రాన్‌ను జాన్సెన్ అవుట్ చేయడంతో.. చెన్నై ఒక్కసారిగా కుప్పకూలింది. కేవలం 18 పరుగుల తేడాతో విగతా ఐదు వికెట్లు చేజార్చుకొంది.

ఒకే ఓవర్‌లో 4 వికెట్లు..: అనూహ్యంగా 19వ ఓవర్‌లో బంతిని అందుకొన్న చాహల్.. తన మాయాజాలంతో సీఎస్‌కేను డబుల్ సెంచరీ మార్క్ చేరకుండా దెబ్బకొట్టాడు. రెండో బంతికి ధోనీ (11) క్యాచవుట్ కాగా.. మూడో బంతికి దీపక్ హుడా (2) రెండు పరుగులు తీశాడు. కానీ, నాలుగో బంతికి హుడాను క్యాచవుట్ చేసిన చాహల్.. ఐదో బంతికి అన్షుల్ కాంబోజ్ (0)ను బౌల్డ్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. ఆరో బంతికి షాట్ ఆడేక్రమంలో నూర్ అహ్మద్ (0) అవుట్ కావడంతో.. చాహల్ సంబరాలు చేసుకొన్నాడు. శివం దూబే (6)ను పెవిలియన్ చేర్చిన అర్ష్‌దీప్ చెన్నై ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	10	2	8	0	4	-1.211

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

చెన్నై: రషీద్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 11, ఆయుష్ (సి) శ్రేయాస్ (బి) జాన్సెన్ 7, సామ్ కర్రాన్ (సి) ఇంగ్లిస్ (బి) జాన్సెన్ 88, జడేజా (సి) ఇంగ్లిస్ (బి) హర్‌ప్రీత్ 17, బ్రెవిస్ (బి) అజ్మతుల్లా 32, దూబే (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 6, ధోనీ (సి) వధేరా (బి) చాహల్ 11, హుడా (సి) ప్రియాన్ష్ (బి) చాహల్ 2, అన్షుల్ (బి) చాహల్ 0, నూర్ (సి) జాన్సెన్ (బి) చాహల్ 0, ఖలీల్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 19.2 ఓవర్లలో 190 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-21, 2-22, 3-48, 4-126, 5-172, 6-184, 7-186, 8-186, 9-186, 10-190; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.2-0-25-2, జాన్సెన్ 4-0-30-2, అజ్మతుల్లా 4-0-39-1, హర్‌ప్రీత్ 2-0-21-1, చాహల్ 3-0-32-4, సూర్యాంశ్ 3-0-40-0.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) ధోనీ (బి) ఖలీల్ 23, ప్రభ్‌సిమ్రన్ (సి) బ్రెవిస్ (బి) నూర్ 54, శ్రేయాస్ (బి) పతిరన 72, వధేరా (సి) జడేజా (బి) పతిరన 5, శశాంక్ (సి) బ్రెవిస్ (బి) జడేజా 23, ఇంగ్లిస్ (నాటౌట్) 6, సూర్యాంశ్ (సి) నూర్ (బి) ఖలీల్ 1, జాన్సెన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.4 ఓవర్లలో 194/6; వికెట్ల పతనం:** 1-44, 2-116, 3-136, 4-180, 5-188, 6-190; **బౌలింగ్:** ఖలీల్ 3.4-0-28-2, అన్షుల్ 2-0-20-0, జడేజా 3-0-32-1, నూర్ అహ్మద్ 4-0-39-1, కర్రాన్ 3-0-27-0, పతిరన 4-0-45-2.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక జైపూర్
రాజస్థాన్ x ముంబై రా.7.30 నుంచి

'అజర్' పేరును తొలగించొద్దు

అంబుడ్స్‌మన్ ఆదేశాలపై హైకోర్టు స్టే

హైదరాబాద్: టీమిండియా మాజీ కెప్టెన్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజరుద్దీన్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఉప్పల్ స్టేడియం నార్త్ స్టాండ్‌కు ఉన్న అజరుద్దీన్ పేరును తొలగించాలంటూ హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలిచ్చేవరకూ ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని పేర్కొంది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అజర్ నిబంధనలు ఉల్లంఘించి ఓ స్టాండ్‌కు తన పేరు పెట్టుకొన్నట్టు లార్డ్స్ క్రికెట్ క్లబ్.. ఎథిక్స్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసింది. విచారించిన అంబుడ్స్‌మన్ పరస్పర విరుద్ధ ప్రయోజనాల కింద స్టాండ్‌కు ఉన్న అజర్ పేరును తొలగించాలని ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని అజర్ హైకోర్టులో సవాల్ చేశాడు.

ఆసియా జూనియర్ బాక్సింగ్‌లో

అమ్మాయిలు అదరహో

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. ఒక్క అండర్-15 విభాగంలోనే 25 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో అమ్మాయిలు సాధించిన పది స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు ఉండడం విశేషం. ఫైనల్ చేరిన ప్రతి కేటగిరిలోనూ అమ్మాయిలు విజేతగా నిలిచారు. బాలుర కేటగిరి నుంచి ఓ స్వర్ణం, 3 రజతాలు, 7 కాంస్యాలు లభించాయి.

ధోనీ రిటైరైతే బెటర్!

గిల్‌క్రిస్ట్ సలహా



న్యూఢిల్లీ: ధోనీ.. ఐపీఎల్‌ను వీడాల్సిన సమయం ఆసన్నమైందని ఆస్ట్రేలియా మాజీ వికెట్‌కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ అన్నాడు. 'ఆటలో మహీ నిరూపించుకోవడానికి ఏమీ లేదు. అతడు అన్నీ సాధించేశాడు. ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో అతడికి బాగా తెలుసు. కానీ, వచ్చే ఏడాదికి అతడు ఆడాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం. ధోనీ.. నువ్వో దిగ్గజానివి. నా ఆటంటే నాకెంతో ఇష్టం' అని గిల్లీ కొనియాడాడు.

కంచిమఠం ఉత్తరాధికారిగా
సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి బాధ్యతలు

- పంచగంగ తీర్థంలో సన్యాసాశ్రమ దీక్ష స్వీకరణ
- ఆదిశంకరుల సన్నిధి వద్ద నామకరణం చేసిన పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

చెన్నై/అన్నవరం/అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంచీపురంలోని శంకర మఠం ఉత్తరాధికారిగా అన్నవరానికి చెందిన సుబ్రహ్మణ్య గణేశ శర్మ ద్రవిడ్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పంచ గంగ తీర్థం మధ్యనున్న మంటపంలో ఆయనకు ప్రస్తుత (70వ) పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి సన్యాస ఆశ్రమ దీక్షను ఇచ్చారు. తొలుత ఉత్తరాధికారికి కాషాయ వస్త్రాలు ధరింపజేసి, దండం, కమండలం అందించి, శంకర మఠానికి చెందిన కొయ్యతో చేసిన పీటపై ఆశీనులను చేశారు. స్ఫటిక రుద్రాక్ష మాలను మెడలో వేశారు. అనంతరం సన్యాస దీక్షను ప్రసాదించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆదిశంకరుల సన్నిధి వద్ద గణేశ శర్మకు 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి'గా నామకరణం చేశారు. ఆ తర్వాత ఆలయం నుంచి వేదపండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల మధ్య పీఠాధిపతి, ఉత్తరాధికారి రాజవీధిలో శంకర మఠానికి చేరుకున్నారు. అక్కడ విజయేంద్ర సరస్వతి మంత్రోపదేశం చేసిన తర్వాత కంచిమఠం యువ పీఠాధిపతిగా సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని వివిధ మఠాధిపతులు, సాధువులు, సన్యాసులు కొలనులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై నుంచి వీక్షించారు. కాగా, యువపీఠాధిపతి బాధ్యతల స్వీకార మహోత్సవ వేడుకల సందర్భంగా మఠంలో ప్రత్యేక హోమాలు, ఆరాధనలు నిర్వహించారు. యువపీఠాధిపతిని విజయేంద్ర సరస్వతి చేయి పట్టుకుని మఠంలోని మహాపెరియవా (కంచి పరమాచార్యులు), జయేంద్ర సరస్వతి స్వాములవారి బృందావన ప్రాంతానికి తోడ్కొని వెళ్లారు.


శంకర మఠానికి ఊరేగింపుగా వెళ్తున్న విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి

కంచిలో పండుగ వాతావరణం

యువపీఠాధిపతి బాధ్యతల స్వీకార మహోత్సవం సందర్భంగా కాంచీపురం అంతటా పండుగ వాతావరణం నెలకొంది. దేశం నలుమూలల నుంచి వచ్చిన సాధువులు, పీఠాధిపతులు, భక్తుల సందడి మంగళవారం నుంచే ప్రారంభమైంది. ఈ వేడుకలను పురస్కరించుకుని కంచి శంకర మఠం, కామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణం అంతటా రంగురంగుల విద్యుద్దీపాలంకరణ, వివిధ రకాల పూలతో, స్వాగత తోరణాలతో అలంకరించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్, ఏపీ ప్రభుత్వం తరఫున ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, పండితులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఇక, కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా సన్యాస దీక్ష స్వీకరించిన అన్నవరం క్షేత్రానికి చెందిన గణేశ శర్మకు సీఎం చంద్రబాబు శుభాభినందనలు తెలిపారు. ఇంతటి పవిత్ర బాధ్యత నెరవేర్చే అవకాశం లభించడం ఆదిశంకరుల అనుగ్రహంగా పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన వ్యక్తి కంచి పీఠానికి ఉత్తరాధికారిగా సన్యాస దీక్ష తీసుకోవడం గర్వకారణమని ట్వీట్ చేశారు. గణేశ శర్మ కంచి పీఠానికి ఉత్తరాధికారిగా నియమితులు కావడం ఆనందదాయకమని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు యునిసెఫ్ శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

యునిసెఫ్ యువాహ్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏపీ ప్రభుత్వం, యునిసెఫ్ 3 ప్రధాన యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. యునిసెఫ్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థలు పరస్పర సహకారంతో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ), యూత్ హబ్, పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ (పీ2ఈ) కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఇవి ఇంటికో పారిశ్రామికవేత్త, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు తోడ్పడటంతో పాటు నవీన ఆవిష్కరణలు, సమ్మిళిత, స్థిరజీవనోపాధి అవకాశాలను పెంపొందిస్తాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో జి.గణేష్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ కె.దినేష్ కుమార్, యునిసెఫ్ ప్రతినిధులు జిలాలిమ్ బిర్హాను టఫెస్సే, మురళీకృష్ణ మదమంచి, మానస ప్రియా వాసుదేవన్, వంశీకృష్ణ, స్టాక్ హోల్మ్ డిజిటల్, ఏఐ, స్ట్రాటజీ, ఆఫీస్ ఆఫ్ ఇన్నోవేషన్ కన్సల్టెంట్ రవితేజ బాలే తదితరులు పాల్గొన్నారు.

ఇవీ కార్యక్రమాలు

- వైఎఫ్ఎస్ఐ ప్రోగ్రాం ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షల మంది యువతకు వ్యాపార నైపుణ్యాలను అందించడంతో పాటు ఉద్యోగాల కల్పన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యునిసెఫ్ గ్లోబల్ అప్‌షిఫ్ట్ ఫ్రేమ్ వర్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు.
- యూత్ హబ్ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్య పోర్టల్‌తో అనుసంధానించిన బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పించనున్నారు.
- పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్‌తో 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసున్న యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో.. మోహన్‌బాబుకు సుప్రీంలో చుక్కెదురు

- రేపు తిరుపతి కోర్టులో హాజరవ్వాల్సిందేనని ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయాలన్న ఆయన అభ్యర్థనను సుప్రీం తోసిపుచ్చింది. మే 2న తప్పనిసరిగా తిరుపతి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు కావలసిందేనని తేల్చి చెప్పింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 2019లో తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి మోహన్‌బాబు కుటుంబం ధర్నాకు దిగింది. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో.. మోహన్‌బాబుతోపాటు మరికొందరిపై కేసు నమోదైంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని చంద్రగిరి పోలీసులు పేర్కొన్నారు. 2021లో కోర్టులో చార్జిషీటు కూడా సమర్పించారు. అయితే ఆ కేసును క్వాష్ చేయాలని కోరుతూ ఈ ఏడాది మార్చి 30న మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిఖిల్ గోయల్ వాదనలు వినిపించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

విభిన్నంగా ఉండాలని చేసిన ప్రయత్నమే హిట్ 3


నాని

'అన్ని సినిమాలూ బాగా ఆడితేనే మన సినిమా కూడా బాగా ఆడుతుంది. అందుకే పరిశ్రమలో ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని సినిమాలూ బాగా ఆడాలి అని కోరుకోవాలి. అప్పుడే ఇండస్ట్రీ పచ్చగా ఉంటుంది' అని హీరో నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ 3'. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా నాని మీడియాతో ముచ్చటించారు.

- నా గత చిత్రాలకూ ఈ సినిమాకు స్పష్టమైన తేడా ఉంది. ఈ సినిమా కథ పూర్తిగా వేరు. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. 'జెర్సీ, దసరా, హాయ్ నాన్నా' ఇలా నా ప్రతి సినిమా ఓ కొత్త జానర్‌లో ఉండాలని ప్రయత్నించాను. ఆ కోవలోనే విభిన్నంగా ఉండాలని చేసిన మరో ప్రయత్నమే 'హిట్ 3'. ఇందులో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. టార్గెట్ ఆడియన్స్‌ని మెప్పిస్తే చాలు మా సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది.
- గతంలో 'హిట్' ఫ్రాంచైజీలో వచ్చిన రెండు సినిమాలూ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్. 'హిట్ 3'లో కథాను సారం యాక్షన్‌తో పాటు హింస కూడా చేరింది. అలాగని హింసను గొప్పగా చూపించేందుకు ఈ సినిమా తీయలేదు. కథకు అలా కుదిరింది. 'సలార్' తరహాలో తెరపైన చూస్తున్నప్పుడు ప్రేక్షకుడు ఎంజాయ్ చేసేలా ఉంటుంది.
- శైలేష్ ఎక్కువగా యాక్షన్ సినిమాలు చేస్తున్నాడు కానీ అతని మాటల్లోనే జోకులు పేలుతుంటాయి. ఓ మంచి కామెడీ స్క్రిప్ట్ రాయమని చెప్పాను. విక్కీ జే మేయర్ ఇప్పటివరకూ ఫీల్ గుడ్ మూవీస్‌కు మాత్రమే పనిచేశాడు. థ్రిల్లర్స్‌కు పనిచేయలేదు. ఆయన ఒక వేళ థ్రిల్లర్ చేస్తే ఆ సౌండింగ్ కొత్తగా ఉంటుంది. ఆయన అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. శ్రీనిధి అద్భుతంగా నటించారు. ఆమె నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ.

పండగ పేరుతో శర్వా కొత్త సినిమా



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నేపథ్యంలో సాగనుందీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్స్. బుధవారం ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేస్తూ 'స్పార్క్' అనే కాన్సెప్ట్ వీడియో విడుదల చేశారు. టైటిల్ 'భోగి'. రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టినట్లు ప్రకటించారు. ఇందులో మునుపెన్నడూ చూడనంత శక్తిమంతమైన పాత్రలో శర్వా కనిపించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

ప్రేమలో కొత్త కోణాన్ని స్పృశిస్తూ



యువతీ యువకుల ప్రేమలో కొత్త కోణాన్ని స్పృశిస్తూ దర్శకుడు భాను ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇంకా టైటిల్ ఖరారు కాలేదు. జూన్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని నిర్మాణసంస్థ ఐబీఎం ప్రొడక్షన్స్ పేర్కొంది. నిర్మాత కనకదుర్గారావు పప్పుల మాట్లాడుతూ 'ఇప్పటివరకూ సందేశం, సామాజిక స్పృహతో సినిమాలు చేసిన దర్శకుడు భాను తొలిసారి ఓ స్వచ్ఛమైన ప్రేమకథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు' అని తెలిపారు. 'ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది, ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు తెలిపారు.

అల్లు అర్జున్‌కు జోడీగా?



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. అల్లు అర్జున్ పుట్టినరోజున ప్రకటించిన ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'ఏఏ 22.. అట్లీ 6'. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటించనున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్‌ను ఫైనల్ చేసినట్లు సమాచారం. మరో కథానాయికగా 'లైగర్' ఫేమ్ అనన్యా పాండేను ఎంపిక చేసినట్లు టాక్. ఈ సినిమాలో నటించడానికి మేకర్స్ అనన్యను సంప్రదించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. జ్యోతిపూర్వజ్ కథానాయిక. పూర్వజ్, ప్రజయ్ కామత్, పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. విజువల్స్, యాక్షన్, సంభాషణలు ఆకట్టుకున్నాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


పీరియాడిక్ క్రైమ్ డ్రామా



దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజ కీలకపాత్రలు పోషిస్తున్న చిత్రం 'కింగ్-జాకీ-క్వీన్'. కేకే దర్శకత్వంలో ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 1990 నేపథ్యంలో సాగే పీరియాడిక్ క్రైమ్ డ్రామా ఇది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హీరో నాని 'కింగ్-జాకీ-క్వీన్' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీక్షిత్‌శెట్టి మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరిస్తున్నారు. 'దసరా' చిత్రం తర్వాత మళ్లీ ఆ సినిమాను నిర్మించిన ప్రొడక్షన్ హౌస్‌లోనే నా తదుపరి చిత్రం చేయడం ఆనందాన్నిచ్చింది. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'ఈ సినిమా గురించి నేను చెప్పడం కన్నా తెరపైన చూసినప్పుడు మీరు మరింత ఎగ్జైటింగ్‌గా ఫీలవుతారు' అని కేకే చెప్పారు.

మేడే కానుక.. 11 ఎంఎస్ఎంఈ పార్కులు

- నేడు నెల్లూరు జిల్లా నారంపేటలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం సిద్ధించే దిశగా తొలిఅడుగు పడింది. రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో అభివృద్ధి చేసిన 11 పారిశ్రామిక పార్కులను, ఒక ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)ను కార్మిక దినోత్సవ (మే డే) కానుకగా.. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నారంపేటలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించనున్నారు. ఇక్కడ 55 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన పార్కుతోపాటు అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం, డోన్, దర్శి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్కులను, యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లిలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎఫ్‌సీని సీఎం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. మొత్తం 909 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన 11 పారిశ్రామిక పార్కుల్లో రోడ్లు, విద్యుత్తు, నీరు తదితర మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 199 కోట్లు ఖర్చు చేసింది. త్వరలోనే మరో 1,455 ఎకరాల్లో అభివృద్ధి చేసే 25 ఎంఎస్ఎంఈ పార్కులు, 14 ఎఫ్ఎఫ్‌సీలను ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. మొత్తంగా తొలిదశలోనే రాష్ట్రవ్యాప్తంగా 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2028కల్లా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశల వారీగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసి పెద్దఎత్తున ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది.

ఏటా ఏదో ఒక గందరగోళం!

- సింహాచలంలో అస్తవ్యస్తంగా చందనోత్సవ ఏర్పాట్లు
- ఇప్పుడు ఏకంగా నిండు ప్రాణాలు బలి

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో జరుగుతున్న వరుస సంఘటనలు భక్తులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. వైకుంఠ ఏకాదశి టికెట్ల క్యూలైన్లలో జరిగిన తొక్కిసలాటలో తిరుపతిలో ఆరుగురు మరణించిన ఘటన మరువకముందే సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గోడ కూలి పలువురు భక్తులు మృతిచెందారు. సింహాచలంలో ఏటా చందనోత్సవం సందర్భంగా భక్తులు లక్షల్లో వస్తారని అంచనా ఉంది. కానీ దేవదాయ శాఖ అధికారులు ఎప్పుడూ విఫలం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ఏదొక ఒక సంఘటన జరుగుతూనే ఉంది. 2022, 2023లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు స్వామివారి దర్శనం కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2023లో ఐదు గంటలపాటు కొండపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దేవదాయ శాఖ, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య సమన్వయ లోపం కూడా భక్తులకు నరకం చూపిస్తోంది. వీరందరి నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా ఈసారి పెను విషాదం చోటుచేసుకుంది. నిజానికి, చందనోత్సవానికి ముందు కలెక్టర్, ఎస్పీ, దేవదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు రెండు, మూడుసార్లు సమీక్షలు నిర్వహించారు. అక్కడ ఏం సమీక్షించారో తెలియదుగానీ, గత రెండు, మూడేళ్ల అనుభవాలను బట్టిచూస్తే ముందస్తు ప్రణాళిక రచనలో అధికారులంతా విఫలమయ్యారని తెలుస్తోంది. కాగా, చందనోత్సవం రోజున ఆలయ ప్రాంగణంలో భక్తుల మృతి తర్వాత ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలి. కానీ, అధికారులు భక్తులను దర్శనాలకు అనుమతించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంప్రోక్షన చేయకుండా దర్శనాలకు ఎలా అనుమతిస్తారంటూ ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

దేశవ్యాప్తంగా కులగణన

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన కుల సర్వేలు పారదర్శకంగా జరగలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఆ గణనను పూర్తి చేశారని ఆరోపించారు. తాము జాతీయ స్థాయిలో నిర్వహించబోయే జనాభా లెక్కలతోపాటే కులగణనను పూర్తిచేస్తామని చెప్పారు. "నిజానికి కాంగ్రెస్ పార్టీ కులగణనకు వ్యతిరేకం. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి చేపట్టిన జనాభా లెక్కల్లో కులగణనను చేర్చలేదు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కుల గణనపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆమేరకు లోక్‌సభకు హామీ ఇచ్చారు. కానీ, మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి.. కులగణనకు బదులు సామాజిక ఆర్థిక సర్వే(ఎస్ఈసీసీ)-2011ను నిర్వహించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కులగణనను వాడుకుంటున్నాయి" అని ఆయన ఆరోపించారు. జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని అశ్విని వైష్ణవ్ అన్నారు. "భారత రాజ్యాంగంలోని 246వ అధికరణ కింద.. ఏడో షెడ్యూల్‌లో 69వ జాబితాలో జనాభా లెక్కల ప్రస్తావన ఉంది. జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. కొన్ని రాష్ట్రాలు కులాలపై సర్వేలు చేశాయి. కానీ, ఒకట్రెండు రాష్ట్రాలే సమగ్రంగా సర్వేలను నిర్వహించాయి. మిగతా రాష్ట్రాలు నిర్వహించిన సర్వేల్లో పారదర్శకత లేదు. కేవలం రాజకీయ దృక్కోణంతోనే నిర్వహించాయి. ఇలాంటి అసమగ్ర సర్వేలు సమాజంలో సందేహాలను కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో రాజకీయాల వల్ల మన సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండేందుకు కులగణనను జనాభా లెక్కల్లో భాగంగా పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది" అన్నారు. ఉత్తుత్తి సర్వేలు జరపడం తమ లక్ష్యం కాదని తెలిపారు. తాము జరిపే జనగణన, కులగణనతో దేశ సామాజిక, ఆర్థిక నిర్మాణం పటిష్ఠం అవుతుందని, దేశం అభివృద్ధి పథంలోకి పయనిస్తుందన్నారు. దేశ, సమాజ ప్రయోజనాలకు, విలువలకు మోదీ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో ఈ నిర్ణయంతో స్పష్టమవుతుందన్నారు.

పారదర్శకంగా నిధులను కేటాయించాలి: ఖర్గే

కేంద్రం కులగణన కోసం పారదర్శకంగా నిధులను కేటాయించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. తాము ముందు నుంచి జాతీయ స్థాయిలో కులగణనకు డిమాండ్లు చేస్తున్నామని, నిధుల కేటాయింపు జరిగితే కులగణన ప్రారంభమవుతుందన్నారు. ఇంతకాలం మోదీ సర్కారు కులగణన పేరెత్తితే.. విపక్షాలు సమాజాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించిందన్నారు.

ఆలస్యమైనా మంచి నిర్ణయం: జైరాంరమేశ్

కులగణనపై మోదీ సర్కారు ఆలస్యంగా స్పందించినా.. ఇది మంచి నిర్ణయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ అన్నారు. "అసలు కులగణన జరపకపోవడం కంటే.. ఆలస్యమైనా ఆమోదయోగ్యమే" అన్నారు. 2023 ఏప్రిల్ 16న కులగణన కోసం ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాసిన లేఖను, గత నెల 9న అహ్మదాబాద్ సమావేశంలో కులగణనపై చేసిన తీర్మానం ప్రతులను ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా మోదీ సర్కారు కులగణనపై చాలా ఆలస్యంగా నిర్ణయం తీసుకుందని కమ్యూనిస్టు పార్టీలు అభిప్రాయపడ్డాయి. కులగణనపై మోదీ మాటమార్చారని సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ ఆరోపించారు. "కులగణన ప్రస్తావన వస్తే పేదలు, యువకులు, మహిళలు, రైతులు అనే నాలుగు కులాలే సమాజంలో ఉన్నాయని అని మోదీ అనేవారు. ఇప్పుడు మాటమార్చి కులగణనకు సిద్ధమయ్యారు" అని అన్నారు. కులగణన ఎప్పటిలోగా పూర్తవుతుందో కేంద్రం చెప్పాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి డిమాండ్ చేశారు. కులగణనపై చాలా ఆలస్యంగానైనా.. నిర్ణయం తీసుకున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య అన్నారు.



తెలంగాణలో గతేడాది కులగణన సర్వే నిర్వహించినప్పటి చిత్రం

దేశాభివృద్ధికి దోహదం: నితీశ్‌కుమార్

దేశవ్యాప్త కులగణన తమ పార్టీ(జేడీయూ) పాత డిమాండ్ అని బిహార్ సీఎం నితీశ్‌కుమార్ అన్నారు. కేంద్రం నిర్ణయం అన్నివర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ.. దేశాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. మొట్టమొదటగా తాము బిహార్‌లో కులగణన జరిపామని జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ అన్నారు. దీన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ కులగణనకు తమ నుతామే ఆద్యులుగా చెప్పుకొంటోందన్నారు.

కాంగ్రెస్ చేయనిది మేం చేస్తున్నాం: షా

దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయలేని కులగణనను తాము చేపడుతున్నామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో పోస్టు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేపట్టని కాంగ్రెస్..ఇప్పుడు రాజకీయ ప్రయోజనాలతో మాట్లాడుతోందన్నారు.

బిహార్ ఎన్నికలకోసమే కులగణనప్రకటన: స్టాలిన్

కులగణనను తిరస్కరించేందుకు, జాప్యం చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవ్వడంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణనను చేపడతామని ప్రకటించిందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. 'జనగణన ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు ముగుస్తుంది?' అని బుధవారం ఆయన ప్రశ్నించారు. బిహార్ ఎన్నికల్లో సామాజిక న్యాయం కీలకం కాబట్టి, కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే కేంద్రం ఈ ఆకస్మిక చర్యకు ఉపక్రమించిందన్నారు. ప్రతిపక్షాలు ప్రజల్ని కులం ఆధారంగా విభజిస్తున్నాయని విమర్శించిన ప్రధాని.. ఇప్పుడు అదే డిమాండ్‌కు తలొగ్గారని చెప్పారు. కులగణన తమిళనాడు ప్రభుత్వం, డీఎంకే సాధించిన విజయమన్నారు.

50% కోటా పరిమితి ఎత్తివేతకు మార్గం: రాహుల్



మోదీ సర్కారు కులగణనపై తీసుకున్న 'అకస్మాత్' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. 11 ఏళ్లుగా ఈ అంశాన్ని విస్మరించి, ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారని, అయినా.. కాలపరిమితిని చెప్పలేదని విలేకరులతో అన్నారు. "ఇది ముమ్మాటికీ తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిన అంశమే. ఇంతకాలం 50% రిజర్వేషన్ కోటా నిబంధనలో ఉన్నాం. కులగణన జరిగితే.. ఆ పరిమితిని దాటడానికి మార్గం సుగమమవుతుంది. ఆ పరిమితిని ఎత్తివేసేదాకా మేం పోరాడుతాం. మేము కోరుకునేది జనాల కులగణన మాత్రమే. బ్యూరోక్రాట్ల కులగణన కాదు" అని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే కేంద్రం కులగణనకు సన్నద్ధమైందని పేర్కొన్నారు.

సమ్మిళిత వృద్ధిపై నిబద్ధత: చంద్రబాబు

దేశంలో సమ్మిళిత వృద్ధిపై ప్రధాని మోదీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనం కులగణన నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని, దీని వల్ల సమాజంలో అణగారిన వర్గాలకు మేలు జరిగే విధానాల రూపకల్పన సుసాధ్యమవుతుందన్నారు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్‌తో దేశంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆ మూడు రాష్ట్రాలే ఆదర్శం!

దేశంలో కులగణనకు బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచాయని చెప్పవచ్చు. నిజానికి భారత్‌లో బ్రిటిష్ హయాంలో 1931లో చివరిసారిగా జనాభా లెక్కలతో పాటు.. కులగణనను నిర్వహించారు. స్వాతంత్య్రం తర్వాత.. 1951 నిర్వహించిన జనగణనలో.. కులగణనను తొలగించారు. దాంతో.. 1931లో నమోదైన ఓబీసీల లెక్క మేరకు ఆ కేటగిరీకి 27% రిజర్వేషన్లను కొనసాగిస్తున్నారు. 2011లో కులగణనను నిర్వహించాలని నిర్ణయించినా.. సామాజిక ఆర్థిక సర్వే(ఎస్ఈసీసీ)ను చేపట్టారు. ఆ డాటాను ఇప్పటికీ విడుదల చేయలేదు. అయితే.. సామాజిక న్యాయం కోసం కులగణన జరిగి తీరాల్సిందేననే డిమాండ్లు ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. బిహార్ ప్రభుత్వం మాత్రం 2023లో కులగణను చేసి, చూపించింది. న్యాయపరమైన అవాంతరాలెదురైనా.. బాలారిష్టాలను దాటుకుని, ముందుకు సాగింది. 13 కోట్ల బిహార్ జనాభాలో(2011 జనాభా లెక్కల ప్రకారం 10.41 కోట్లు) 63.14% ఓబీసీలు ఉన్నట్లు తేల్చింది. దాంతో.. 63% ఉన్న జనాభాకు 27% కోటా న్యాయమేనా? అనే చర్చ మొదలైంది. బిహార్‌లో ఆర్థికంగా మరీ వెనకబడిన కులాలు మొత్తం జనాభాలో 36.01 శాతంగా ఉండడంతో.. కోటా పెంపు డిమాండ్ మొదలైంది. దాంతో కాంగ్రెస్ పార్టీ కులగణన అంశాన్ని ఎన్నికల్లో ప్రముఖంగా ప్రస్తావించింది. కర్ణాటకలోనూ ఇచ్చిన హామీ మేరకు కులగణనను జరిపింది. నిజానికి కర్ణాటకలో 2015లోనే కులగణన మొదలై.. 2018 నాటికి సర్వే పూర్తయినా 2024లో బీసీ కమిషన్ చైర్మన్ జయప్రకాష్ హెగ్డే ప్రభుత్వానికి నివేదికను ఇచ్చారు. దీని ప్రకారం కర్ణాటకలో ఈబీసీల వాటా 69.6%. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ కులగణన హామీని నెరవేర్చింది. 50 రోజులపాటు 1.03 లక్షల మంది ఎన్యుమరేటర్లు కులగణనను నిర్వహించగా.. 96.9% కుటుంబాలు వివరాలను వెల్లడించాయి. మొత్తం 3.54 కోట్ల మందిని సర్వే చేయగా.. బీసీల వాటా 46.25శాతంగా తేలింది. ముస్లిం మైనారిటీల్లో బీసీలను కలుపుకొంటే ఈబీసీల వాటా 56.33శాతం ఉంది. ఈ డాటాను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ 2బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లులను కేంద్రానికి పంపి, వీటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరింది.

మే నెలలో మంటలే

- వాయవ్య, మధ్య, తూర్పుభారతంలో వడగాడ్పులు తీవ్రం
- మన రాష్ట్రంలో మాత్రం వడగాడ్పులు ఉండవ్
- నైరుతి సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేశంలోని అనేక ప్రాంతాల్లో మే నెలలో ఎండ సెగలు పుట్టించనుంది. దక్షిణ, తూర్పుభారతంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంది. మే నెలలో ఎండలు, వడగాడ్పులు, వర్షపాతంపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బుధవారం బులెటిన్‌ను విడుదల చేసింది. మే నెలలో అనేక ప్రాంతాలు... అంటే వాయవ్య, మధ్య, తూర్పు, పశ్చిమ, దక్షిణ భారతంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కానున్నాయి. కేరళ, దక్షిణ కర్ణాటక, తమిళనాడు, దానికి ఆనుకుని రాయలసీమలో కొద్ది ప్రాంతం, ఇంకా పశ్చిమబెంగాల్, మేఘాలయ, సిక్కింలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. హరియాణా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ, ఉత్తర కర్ణాటకల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. దక్షిణ భారతంలో ఉత్తర కర్ణాటక, ఉత్తర తెలంగాణ తప్ప మిగిలిన ఏపీ, తమిళనాడు, కేరళ, దక్షిణ కర్ణాటక, దక్షిణ తెలంగాణ, ఏపీకి ఆనుకుని దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో వడగాడ్పులు వీచే అవకాశంలేదని ఐఎండీ పేర్కొంది. కాగా, మే నెలలో పలు ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. కాగా, భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు దక్షిణ, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాలు, పాకిస్థాన్, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం కురవనుంది. మూడు రోజులుగా పుణెలో జరుగుతున్న 31వ సౌత్ ఏషియన్ క్లైమేట్ అవుట్‌లుక్ ఫోరం సదస్సులో వచ్చే నైరుతి రుతుపవనాల సీజన్ వర్షాలపై నివేదిక విడుదల చేశారు. పసిఫిక్ మహాసముద్రంలో లానినా దశ ముగిసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన తటస్థ పరిస్థితులు నైరుతి సీజన్ ముగిసే వరకు కొనసాగుతాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ దారుణం

- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి: జగన్



విశాఖపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలం అప్పన్న చందనోత్సవం సందర్భంగా గోడకూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆరోపించారు. బుధవారం ఈ ఘటనలో మృతిచెందిన మధురవాడ చంద్రంపాలేనికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పిళ్లా మహేశ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చందనోత్సవానికి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా దారుణమైన ఏర్పాట్లు చేశారని ఆరోపించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు ఎల్‌జీ పాలిమర్స్ ఘటన జరిగితే మృతులకు రూ.కోటి పరిహారం ఇచ్చామని.. చందనోత్సవం సందర్భంగా చనిపోయినవారి కుటుంబాలకు కూడా రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గుర్తుపెట్టుకుని వారి కుటుంబాలకు మిగిలిన మొత్తాన్ని అందజేస్తామని జగన్ హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- పునరావృతం కాకుండా చర్యలు: స్పీకర్ అయ్యన్న, అశోక్ గజపతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సింహాచలం దుర్ఘటనపై పలువురు నేతలు తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఘటనలో పలువురు మృతిచెందడం, గాయపడడం బాధాకరమని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ... 'సింహాచలం ఘటన తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా దేవస్థానం వైపునుంచి చర్యలు తీసుకుంటాం. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటాం' అన్నారు. కాగా, సింహాచలం ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. క్షతగాత్రులకు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స జరుగుతోందని, మెరుగైన చికిత్స అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు: మంత్రి పార్థసారథి

సింహాచలం ఘటనను జగన్ శవ రాజకీయం చేయడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని మంత్రి పార్థసారధి మండిపడ్డారు. చేతనైతే సాయం చేయాలి, మనోభావాలు దెబ్బతినేలా వైసీపీ నేతలు మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఎన్నో ప్రమాదాలు జరిగినా కనీసం బాధితులను పరామర్శించడానికి కూడా వెళ్లని జగన్ ఇప్పుడు శవ రాజకీయాలు చేస్తున్నారంటూ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ దిగజారుడుతనానికి నిదర్శనం: మంత్రి ఆనం

ఆత్మకూరు/నెల్లూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు దుర్మరణం చెందడంపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యమే ఈ దుర్ఘటనకు కారణమని తెలిపారు. ఇలాంటప్పుడు హుందాగా ప్రవర్తించాల్సిన... దీనిని కూడా మాజీ సీఎం జగన్ తన క్షుద్ర రాజకీయాలకు వాడుకోవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలం ఆలయంలో జరిగిన దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అప్పన్నస్వామి చందనోత్సవంలో గోడ కూలి భక్తులు మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరారు.

2026 దాకా ఆగాల్సిందే!

- రాత్రికి రాత్రే డీలిమిటేషన్ చేయలేం: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) రాత్రికి రాత్రే చేపట్టలేమని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం 2026 జనాభా లెక్కల సేకరణ వరకు వేచి చూడాల్సిందేనని తెలిపింది. ఇది చిన్న విషయం కాదని, పెద్దఎత్తున కసరత్తు చేయాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం-2014లోని సెక్షన్ 26 ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు పెంచేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి 2022 జూన్ 7న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొత్తగా ఏర్పడిన ఈ రెండు రాష్ట్రాలను మినహాయించి... కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీరు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను మాత్రమే పునర్విభజించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని ప్రతివాదులైన కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ వ్యాజ్యం బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రావు రంజిత్ వాదనలు వినిపించారు, డీలిమిటేషన్ కమిషన్ నోటిఫికేషన్లలో రాష్ట్రాలను చేర్చడం, మినహాయించడం అనేది కేంద్ర ప్రభుత్వ బాధ్యతని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తు చేశారు. ఈ విషయంలో ఇప్పటికీ కేంద్రం తన సమాధానం చెప్పలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ.. డీలిమిటేషన్ ప్రక్రియ కోసం 2026 జనాభా లెక్కల వరకు వేచి ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పిటిషనర్ పదేపదే ప్రస్తావిస్తున్న జమ్మూకశ్మీరు కేంద్ర పాలిత ప్రాంతం కాబట్టే అక్కడ డీలిమిటేషన్ సాధ్యమైందని.. దానితో ఏపీ, తెలంగాణకు సంబంధంలేదన్నారు. ఈ వాదనపై రావు రంజిత్ అభ్యంతరం తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీరు హోదా మారిందని తెలిపారు. ఆయన వాదనలపై జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీరు గురించి ప్రస్తావించవద్దని సూచించారు. రంజిత్ తన వాదనలు కొనసాగిస్తూ.. కేంద్రం చెబుతున్నట్లు 2026 తర్వాత కూడా దక్షిణాదిన ఈ ప్రక్రియ చేపట్టే పరిస్థితి కనిపించడం లేదని తెలిపారు. జమ్మూకశ్మీరు కంటే ఐదేళ్ల ముందు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను డీలిమిటేషన్ అంశంలో ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. అన్ని పక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

విభజన చట్టంలో సీట్ల సంఖ్య పెంచుకునే వెసులుబాటు...

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం-2014 ప్రకారం.. రాజ్యాంగంలోని అధికరణ 170లోని నిబంధనలకు లోబడి చట్టంలోని సెక్షన్ 15కు భంగం కలుగకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలను పెంచుకునే వెసులుబాటు ఉంది. దీని ప్రకారం.. తెలంగాణలో 119 నుంచి 175కు, ఆంధ్రప్రదేశ్‌లో 175 నుంచి 225కు అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచనున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే 2022 జూలై 27న బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం శాఖ స్పష్టంగా సమాధానమిచ్చింది. 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం సెక్షన్ 26కి అనుగుణంగా ఆర్టికల్ 170ని సవరించే వరకు సీట్లు పెంచలేం' అని స్పష్టం చేసింది.

అతి వేగానికి ఆరుగురు బలి

- ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. నెల్లూరు జిల్లాలో పెను విషాదం
- వృద్ధుడు, ఐదుగురు వైద్య విద్యార్థుల దుర్మరణం

కోవూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి సోదరి నిశ్చితార్థంలో ఉత్సాహంగా గడిపి తిరిగి బయలుదేరిన వారిని.. మృత్యువు కారు రూపంలో పొట్టనపెట్టుకుంది. వేగంగా వెళుతున్న కారు ఓ పూరింటిలోకి దూసుకెళ్లడంతో ఐదుగురు వైద్య విద్యార్థులతోపాటు, ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలోని జాతీయరహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ విషాదం చోటు చేసుకుంది. వివరాలివీ.. నెల్లూరు శివార్లలోని చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చక్రధర్ సోదరి నిశ్చితార్థం బుచ్చిలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చక్రధర్ స్నేహితులు 12మంది రెండు కార్లలో వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాక తిరుగు ప్రయాణమయ్యారు. కాలేజీకి త్వరగా వెళ్లాలన్న ఆతృతతో ముందు వెళుతున్న వారు కారు వేగం పెంచారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో కారు అదుపు తప్పి ఓ పూరింటిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం దాటికి పూరిల్లు పూర్తిగా ధ్వంసమవగా, కారు నుజ్జునుజ్జయ్యింది. ఇంట్లో మంచంపై ఉన్న నిడిగుంట రమణయ్య(65)పైకి కారు దూసుకుపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న వైద్యవిద్యార్థులు ఖామవత్ అభిషేక్ రాజ్(అనంతపురం), గుండాల జీవన్‌చంద్రారెడ్డి (సిద్ధీపురం, నెల్లూరు జిల్లా), గుర్రం యజ్ఞేష్ (ఒంగోలు), లవదియా నరేష్ నాయక్(ధర్మవరం- అనంతపురం జిల్లా), గోను అభిసాయి పురుషోత్తం (తిరుపతి), వీరమల్లు నవనీత్‌రెడ్డి (మైదుకూరు, కడప జిల్లా) తీవ్రంగా గాయపడ్డారు. వెనుకనే మరో కారులో వస్తున్న స్నేహితులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఐదుగురూ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మైదుకూరుకు చెందిన వీరమల్లు నవనీత్ నెల్లూరు నారాయణ వైద్యకళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.


దేవుడి శాఖకు ఇన్‌చార్జులే దిక్కు..!

- కమిషనరూ, ఈవోలూ అదనపు బాధ్యతల్లోనే
- దేవదాయ శాఖలో అధికారుల కొరత తీవ్రం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖలో ఇన్‌చార్జుల పాలన నడుస్తోంది. కమిషనర్ నుంచి ప్రధాన ఆలయాల ఈవోల వరకూ ఇన్‌చార్జులనే పెట్టి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దేవుడి శాఖలో రూ.కోట్ల విలువైన ఆస్తులు.. లక్షల ఎకరాల భూములున్నా.. వాటి సంరక్షణకు ఇన్‌చార్జి అధికారులే దిక్కవుతున్నారు. శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఇన్‌చార్జిగానే కొనసాగుతున్నారు. ఎస్.సత్యనారాయణను బదిలీ చేసిన తర్వాత ప్రభుత్వం ఐఏఎస్‌ను నియమించుకుండా.. సీనియర్ అధికారి, అదనపు కమిషనర్-2గా ఉన్న రామచంద్ర మోహన్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. ఈయనే విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి ఇన్‌చార్జి ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరోవైపు అయనే అదనపు కమిషనర్-2గానూ కొనసాగుతున్నారు. సింహచలం ఆలయం ఈవో కూడా ఇన్‌చార్జే. రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన సుబ్బారావును దేవదాయ శాఖ అధికారులు రాజమండ్రి ఆర్జేసీగా నియమించారు.

రెవెన్యూ అధికారులే దిక్కు..: దేవదాయ శాఖలో రెగ్యులర్ అధికారుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో రెవెన్యూ అధికారులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో ద్వారకాతిరుమల, కనకదుర్గమ్మ ఆలయాలకు తప్ప సింహాచలం, అన్నవరం, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు రెవెన్యూ అధికారులే ఈవోలుగా ఉన్నారు. ఇన్‌చార్జి అధికారులు పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకోకపోవడమూ సమస్యగా మారింది. వారు ఉపకార్యనిర్వహణాధికారులకు బాధ్యతలు అప్పగించడంతో పాలన అస్తవ్యస్తంగా మారుతోందన్న ఆరోపణలున్నాయి. దేవదాయ శాఖలో 11 ఆర్జేసీ పోస్టులున్నాయి. డైరెక్టుగా డిప్యూటీ కమిషనర్ల నియామకం, అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తే.. తర్వాత రెండేళ్లకు వాళ్లకు ఆర్జేసీగా పదోన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం శాఖలో భ్రమరాంబ, సత్యనారాయణమూర్తి, త్రినాథ్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్ మాత్రమే రెగ్యులర్ ఆర్జేసీలు. వీరిలో భ్రమరాంబ, సత్యనారాయణమూర్తి ఈ ఏడాది, త్రినాథ్‌రావు, ఏడీసీ చంద్రకుమార్ వచ్చే జనవరిలో పదవీ విరమణ చేయనున్నారు. మిగిలే ఒకేఒక్క ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్. దేవదాయశాఖలో రెగ్యులర్ పోస్టులున్నప్పటికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. 29 ఏళ్లుగా డిప్యూటీ కమిషనర్ పోస్టులకు నోటిఫికేషనే ఇవ్వలేదంటేనే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. 1996లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన ఇద్దరు అధికారులు ఇప్పుడు రిటైర్‌మెంట్‌కు దగ్గరపడ్డారు. ఈ పోస్టుల భర్తీపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోతే దేవదాయ శాఖలో అధికారుల కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.







మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

చందనోత్సవంలో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

బలి తీసుకుంది. వీరిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన యువ దంపతులు. మరో ఇద్దరు కూడా వీరి కుటుంబీకులే. ఇంకో ఇద్దరు సన్నిహిత మిత్రులు!

ఇలా జరిగింది...

చందనోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా.. భారీ ఏర్పాట్లే చేశారు. వేర్వేరు క్యూలైన్లు నిర్మించారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి నిజరూప దర్శనం ప్రారంభమైంది. అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి రాజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వెళ్లారు. అంతా సాఫీగా జరుగుతున్న సమయంలో... 2.30 గంటలకు ఈదురుగాలులతో అరగంటపాటు భారీ వర్షం కురిసింది. భక్తుల కోసం ఏర్పాటు చేసిన పందిళ్లు కొన్ని కూలిపోయాయి. కరెంటు కూడా పోయింది. భక్తుల కోసం కొత్త షాపింగ్ కాంప్లెక్స్ పక్క నుంచి రూ.300 దర్శన వరుస ఏర్పాటు చేశారు. వర్షం పడితే కొండ పైనుంచి షాపింగ్ మాల్ వరకు వాన నీరు వస్తుండటంతో... ఇటీవలే అక్కడ రిటైనింగ్ వాల్ నిర్మించారు. కేంద్రప్రభుత్వ నిధులతో 'ప్రసాద్' పథకం కింద చేపట్టిన ఈ గోడ నిర్మాణం నాలుగు రోజుల క్రితమే పూర్తయింది. బలమైన పునాదులు లేకుండా, కాంక్రీట్ ఇటుకలతో నిర్మించారు. సరిగ్గా క్యూరింగ్ కూడా కాలేదు. భారీవర్షానికి కొండ పైనుంచి నీరు ప్రవహించడంతో... ఆ ఒత్తిడికి గోడ కింద మట్టి కోసుకుపోయింది. తెల్లవారుజామున 3గంటలకు గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. దాన్ని ఆనుకునే ఏర్పాటు చేసిన రూ.300 దర్శనం భక్తులపైకి సిమెంట్ ఇటుకలు పిడుగుల్లా పడ్డాయి. మట్టి కూడా ముంచెత్తింది. చిమ్మ చీకటి... వర్షం... అంతలోనే భారీ శబ్దం... కేకలు, అరుపులతో క్యూలైన్లలోని భక్తులు ఆందోళనకు గురయ్యారు. సెల్‌ఫోన్ టార్చ్ వేసి చూశారు. గోడ కూలి, దాని కింద పలువురు చిక్కుకున్న విషయం గుర్తించారు. వెంటనే పెద్దగా కేకలు వేస్తూ సహాయకచర్యలు చేపట్టారు. ఈ ఘటన అధికారుల దృష్టికి వెళ్లి అంబులెన్స్‌లు వచ్చేసరికి 20 నిమిషాలు దాటింది. వెంటనే ఆ క్యూలైన్‌ను మూసేసి, భక్తులను అక్కడి నుంచి పంపించేసి కలెక్టర్ హరేంధిర ప్రసా ద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సహాయక చర్యలు పర్యవేక్షించారు. హోంమంత్రి అనిత ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బంది వచ్చి మృతదేహాలను బయటకు తీశారు. అంబులెన్సుల్లో అపోలో ఆస్పత్రికి తరలించారు. అంతా మరణించారని చెప్పడంతో పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సహాయక చర్యలు ఉదయం ఏడు గంటల వరకు సాగాయి. ఇంకా రాళ్ల కింద ఎవరైనా ఉన్నారేమోనని మంత్రి అనిత, దేవదాయ శాఖ సెక్రటరీ వినయ్‌చంద్ దగ్గరుండి రాళ్లు, మట్టి పూర్తిగా తీయించారు. ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక అధికారులు, మంత్రి కేజీహెచ్‌కు వెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

మృతుల వివరాలు....

1. పిళ్లా మహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం
2. పిళ్లా శైలజ (27), మహేశ్ భార్య. (వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు)
3. పైలా వెంకట రత్నం(45), హెచ్‌బీ కాలనీ, విశాఖపట్నం (ఈమె శైలజ తల్లి)
4. గుజ్జారి మహాలక్ష్మి (65), ఇసుకతోట, విశాఖపట్నం (శైలజ మేనత్త)
5. కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు(29), అంబాజీపేట, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా.
6. పత్తి దుర్గాస్వామి నాయుడు (30), అంబాజీపేట, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా.
7. ఎడ్ల వెంకటరావు(58). అడవివరం, విశాఖపట్నం



వెంకటరత్నం



మహాలక్ష్మి



వెంకట్రావు

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

అంబాజీపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎక్కడికైనా కలిసివెళ్లడం ఆ స్నేహితులకు అలవాటు. పనులు, ఉద్యోగాలు చేసుకుంటూ విశాఖలోనే కలిసి ఉంటున్నారు. స్వామివారి చందనోత్సవంలో పాల్గొనేందుకు కూడా కలిసే సింహాచలం వెళ్లారు. అక్కడ గోడ కూలి ఇద్దరూ మృతిచెందారు. పత్తి దుర్గాస్వామినాయుడు(28), కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు(శివ)(29)లది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలోని కొర్లపాటివారిపాలెం. స్వామినాయుడు వైజాగ్‌లో డైమండ్ ఇంటీరియర్ వర్కర్‌గా, శేషారావు వైజాగ్ మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ జనసేన పార్టీ కార్యకర్తలు. వారి మరణం బాధించిందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. అండగా ఉంటామని వారి కుటుంబాలకు లేఖను పంపించారు.



దుర్గాస్వామినాయుడు



ఈశ్వరశేషారావు

కళ్లముందే దారుణం జరిగిపోయింది

"మేము తగరపువలస నుంచి స్వామి దర్శనం కోసం వచ్చాం. రూ.300 టిక్కెట్లు తీసుకున్నాం. వాటిని స్కానింగ్ చేసి క్యూలైన్‌లో మెట్లు ఎక్కి పైకి వచ్చాం. మా ముందే ఆ భార్యాభర్తలిద్దరూ (పిళ్లా మహేశ్, శైలజ దంపతులు), వాళ్ల పెద్దలు ఉన్నారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. గోడ కూలిపోయింది. కాంక్రీట్ ఇటుకల కింద వారు ఉండిపోయారు. కళ్ల ముందే దారుణం జరిగిపోయింది. భయంతో మేం వెనక్కి వచ్చేశాం."

- లక్ష్మి, తగరపువలస

పెద్ద శబ్దం... రాళ్లు మీద పడ్డాయి

"తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులతో వర్షం మొదలైంది. కరెంట్ పోయింది. చిమ్మచీకటి. కొద్దిసేపటికి మేం ఉన్న చోట పెద్ద శబ్దంతో గోడ కూలిపోయింది. కాంక్రీట్ రాళ్లు వచ్చి మీద పడ్డాయి. కింద కొందరు ఉండిపోయారు. నేను మరో ఇద్దరం కలిసి కింద ఉన్న ఓ వృద్ధురాలిని బయటకు తీసే ప్రయత్నం చేశాం. నా కాళ్లపైనా రాళ్లు వచ్చి పడ్డాయి."



- రవికుమార్, జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

యువ దంపతుల విషాదాంతం

- మూడేళ్ల క్రితమే వివాహం... ఇద్దరూ టెకీలే
- భార్య, ఆమె తల్లి, మేనత్తతో కలిసి దర్శనానికి..
- గోడ కూలిన ఘటనలో నలుగురూ మృతి

మధురవాడ (విశాఖపట్నం), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వారికి మూడేళ్ల కిందటే వివాహమైంది... ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే! అప్పన్న నిజరూప దర్శనం చేసుకోవాలన్నది వారి చిరకాల కోరిక! ఇన్నాళ్లకు కుదిరిందని వెళ్లారు! గోడ కూలిన దుర్ఘటనలో కన్నుమూశారు. ఇది.. విశాఖపట్నానికి చెందిన ఉమామహేశ్వరరావుకు(30), శైలజ (26)ల విషాద గాథ. ఇదే ఘటనలో శైలజ తల్లి, మేనత్త కూడా దుర్మరణం పాలయ్యారు. ఉమామహేశ్వరావును కుటుంబ సభ్యులు మహేశ్‌గా పిలుస్తారు. మహేశ్ హెచ్‌సీఎల్ కంపెనీలో పనిచేస్తుండగా, శైలజ ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్నారు. వివాహమైన తర్వాత స్వగ్రామంలో ఉంటూ వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసుకుంటున్నారు. అప్పన్న నిజరూప దర్శనానికి మహేశ్ నాలుగు టిక్కెట్లు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం భార్య శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త మహాలక్ష్మితో కలిసి సింహాచలం చేరుకున్నారు. అర్ధరాత్రి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అదే సమయంలో ఒక్కసారిగా గోడ కూలడంతో క్యూలైన్‌లోనే ఉన్న వీరు నలుగురూ మృత్యువాతపడ్డారు. మహేశ్ సోదరికి ఇద్దరు పిల్లలు. ఆమె భర్త రెండేళ్ల కిందట మరణించారు. ఆ కుటుంబం బాగోగులు కూడా మహేశ్ దంపతులే చూసుకుంటున్నారు. తమ పరిస్థితి అంతంత మాత్రమే అయినప్పటికీ కుమారుడిని ఇంజనీరింగ్ చదివించామని, చేతికి అందొచ్చిన కొడుకుతో పాటు కోడలు కూడా మృతిచెందడంతో దిక్కులేని వారిగా మిగిలిపోయామని మహేశ్ తల్లిదండ్రులు విలపిస్తున్నారు.





ఉమామహేశ్వరరావు, శైలజ

సింహాచలంలో భారీ వర్షం

- అర్ధగంటలోనే 2.5 సెంటీ మీటర్లు నమోదు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. దీనిపై వాతావరణ శాఖ ముందస్తుగానే ప్రజలను అప్రమత్తం చేసే ప్రయత్నం చేసింది. మంగళవారం అర్ధరాత్రి 2.30 నుంచి మూడు గంటల మధ్య నగరంలోని పలు ప్రాంతాల్లో 65 కి.మీ.వేగంతో బలమైన గాలులు వీచినట్టు వాల్తేర్‌లోని తుఫాన్ హెచ్చరిక కేంద్రంలో నమోదైంది. సింహాచలం, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లో కూడా దాదాపు అదేస్థాయిలో పెనుగాలులు వీచి ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. అర్ధగంట వ్యవధిలో సింహాచలంలో 2.5 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. వాతావరణ శాఖ లెక్కల మేరకు పావుగంటలోపు 0.3సెంటీమీటర్లు, గంటలో 1.2 సెంటీమీర్లు నమోదైతే దానిని భారీ వర్షపాతంగా పరిగణిస్తారు. ఈ లెక్కన సింహాచలంలో భారీవర్షం కురిసిందని వాతావరణ నిపుణుడు తెలిపారు. 2020 సెప్టెంబరులో గులాబ్ తుఫాన్ సమయంలో సింహాచలంలో భారీ పెనుగాలులతో 31.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. ఏప్రిల్, మే నెలల్లో స్వల్ప వ్యవధిలో సంభవించే ఈదురుగాలులకు చెట్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు కూలిపోతుంటాయని పేర్కొన్నారు. అయితే రక్షణ గోడలు కూలడం వంటివి అరుదని తెలిపారు. కాగా, అర్ధరాత్రి 12 గంటల తర్వాత తొలుత శ్రీకాకుళం, ఒంటి గంటకు పార్వతీపురం మన్యం, విజయనగరం, 1.30 గంటల తర్వాత విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనికి సంబంధించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థను అప్రమత్తం చేసింది. దీని ప్రకారం శ్రీకాకుళం నుంచి అనకాపల్లి జిల్లా వరకు ప్రజల సెల్‌ఫోన్లకు మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత మెసేజ్‌లు వచ్చాయి. అయితే నిద్రలో ఉండడంతో చాలామందికి ఈ విషయం తెలియదు. విశాఖ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల తర్వాత పిడుగులు, ఈదురుగాలులతో వర్షం ప్రారంభమైంది. అదే సమయంలో సింహగిరిపై రక్షణగోడ కూలి ఏడుగురు మృతిచెందారు. కోస్తాంధ్ర మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కోస్తా, రాయలసీమలో వివిధ ప్రాంతాలో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో చెదురుమదురుగా లేదా తేలికపాటి వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

శ్రీశైలంలో గాలివాన బీభత్సం


శ్రీశైలం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శైవక్షేత్రం శ్రీశైలంలో బుధవారం గాలివాన, వడగళ్లతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. మధ్నాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. కొందరి ఇళ్లు, గోడలపై చెట్లు కూలాయి. క్షేత్ర పరిధిలో మొత్తంగా సుమారు 20 చెట్లు కూలగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎగువ అటవీ ప్రాంతంలో నుంచి క్షేత్రంలోని కొత్తపేట, శ్రీగిరి కాలనీల్లో వర్షపు నీరు పోటెత్తింది.



శ్రీశైలంలో గాలివానకు ఇళ్ల సమీపాల్లో కూలిన భారీ వృక్షాలు

25 లక్షల పరిహారం

- క్షతగాత్రులకు రూ.3 లక్షల సాయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



అమరావతి, విశాఖ, నెల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం క్షేత్రంలో గోడకూలి భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా అధికారులు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, విశాఖ ఎంపీ భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతిరాజుతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఘటన జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని సీఎం నియమించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, క్షతగాత్రులకు రూ.3 లక్షల సాయం అందించనున్నట్లు ప్రకటించారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి దేవదాయశాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని, గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పాల్సిందిగా మంత్రులను ఆదేశించారు. విచారణ కమిటీకి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేశ్‌కుమార్‌ను చైర్మన్‌గా, ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణ, ఇరిగేషన్ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావును సభ్యులుగా నియమించారు. ఈ మేరకు సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీచేశారు. కమిటీ 72 గంటల్లోగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలని, 30 రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

అర్ధరాత్రి ఏమి జరిగిందంటే..

సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందిన ఘటనపై విశాఖ జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపింది. స్వామిని దర్శించుకునేందుకు రూ.300 టికెట్ క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులపై కొత్తగా నిర్మించిన గోడ కూలడంతో ఏడుగురు మృతిచెందగా, మరో భక్తుడు తీవ్రంగా గాయపడినట్టు పేర్కొంది. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కుమార్ కాలు ఫ్రాక్చర్ కావడంతో విమ్స్‌లో చికిత్స పొందుతున్నారని వివరించింది.

రాష్ట్రపతి, ప్రధాని విచారం

చందనోత్సవంలో గోడ కూలిన ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. ఇది బాధాకరమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. దైవదర్శనం కోసం వేచి ఉన్న భక్తుల్లో మహిళలు సహా అనేక మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "నా ఆలోచనలు, ప్రార్థనలు దుఃఖిస్తున్న కుటుంబాలతో ఉన్నాయి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్ గ్రేషియా అందిస్తాం" అని మోదీ వెల్లడించారు.

కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం

పవన్ కల్యాణ్ దిగ్ర్భాంతి

సింహచలంలో గోడకూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మరణించడం దురదృష్టకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసి తీవ్ర దిగ్ర్భాంతికి గురయ్యానని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతి చెందిన వారిలో ఇద్దరు జనసైనికులు ఉన్నారని తెలిసి చింతించినట్టు తెలిపారు.

ఆసాంతం బాధితుల వెంట అనిత

- హోంమంత్రి తీరుకు పవన్ అభినందన

ప్రమాద ఘటన గురించి తెలిసినప్పటినుంచీ, బాధిత కుటుంబాలు మృతదేహాలతో కేజీహెచ్ నుంచి ఇళ్లకు చేరుకునేవరకు హోం మంత్రి అనిత్ వారి వెంటే నిలిచారు. బాధిత కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ ఆస్పత్రిలో ఆసాంతం వారితోనే గడిపారు. సంఘటన జరిగిన వెంటనే హోంమంత్రి అనిత స్పందించిన తీరును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో అభినందించారు. బాధిత కుటుంబ సభ్యులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మధ్యాహ్నం కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చి బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అపురూపం.. అప్పన్న నిజరూపం!

- చందనోత్సవ వేళ కిక్కిరిసిన సింహగిరి
- పోటెత్తిన 1.2 లక్షల మంది భక్తులు

సింహాచలం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అర్ధరాత్రికే క్యూలైన్లు కిక్కిరిశాయి. ఈదురుగాలులు, వర్షాన్ని లెక్కచేయకుండా పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో సింహగిరి జనసంద్రమైంది. చందనోత్సవంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం రుత్విగ్వరణం, పంచకలశావాహనం చేశారు. స్వామివారికి మంత్ర పూర్వకంగా కళా విసర్జనం జరిపారు. తర్వాత.. అర్చకులు వెండి బొరిగెలతో ఏడాదిపాటు స్వామివారి పైపూతగా ఉంచిన చందనోత్తరణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రభాత ఆరాధనలు చేసి, షోడశోపచారాలు, మంగళనీరాజనాలు ఇచ్చారు. ఒలుపు చందనాన్ని ఆలయ భాండాగారంలో భద్రపరిచారు. ఆచారం ప్రకారం దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, పూసపాటి కుటుంబీకులకు తొలిదర్శనం కల్పించారు. అంతరాలయంలో వారి గోత్రనామాలతో పూజలు చేసి, చందన కిరీటాన్ని శిరస్సున ఉంచారు. శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు చతుర్వేద స్వస్తివచనాలతో ఆశీర్వదించగా, ఈవో కొమ్ముల సుబ్బారావు శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. తెల్లవారుజామున 2.19 గంటలకే పూసపాటి వంశీయుల దర్శనం పూర్తికావడంతో 2.45 గంటల నుంచి భక్తులకు నిజరూప దర్శన భాగ్యం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు అశోక్‌గజపతిరాజు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రాత్రి 9.30 గంటలకు ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామి సారథ్యంలో శ్రీవైష్ణవస్వాములు గంగధార నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున, తిరిగి మధ్యాహ్నం సింహగిరిపై భారీ వర్షం కురిసినప్పటికీ సుమారు 1.2 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



అప్పన్న దర్శనం కోసం బారులుతీరిన భక్తులు



నిర్మాణంలో ఉన్నప్పుడు రిటైనింగ్ వాల్

నిర్లక్ష్యపు 'గోడ'

- చందనోత్సవం ముందు హడావుడిగా పనులు
- బలమైన పునాది లేకుండా నిర్మాణం
- గోడ పునాదుల్లోకి చేరిన వర్షపు నీరు
- నాసిరకం కావడంతో కుప్పకూలిన గోడ

విశాఖపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలంలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఖరీదు భక్తుల ప్రాణాలు! లక్షలమంది హాజరయ్యే, అతి భారీగా, వేడుకగా జరిగే స్వామివారి చందనోత్సవానికి ముందు... హడావుడిగా గోడ నిర్మాణం చేపట్టడమే ఒక తప్పు! దానిని... నాసిరకంగా చేపట్టడం ఘోరం, నేరం! అధికారులంతా చందనోత్సవ ఏర్పాట్లలో తలమునకలై ఉండగానే... వారం కిందట రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. కింద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వైపు వర్షపు నీరు వెళ్లకుండా చూడటమే దీని ఉద్దేశం. 40 అడుగుల పొడవు, పది అడుగుల ఎత్తు, రెండు అడుగుల మందంతో 'ఎల్' ఆకారంలో గోడను నిర్మించారు. ఇంత భారీ గోడను నిర్మించేటప్పుడు పక్కాగా పునాదులు ఏర్పాటు చేయాలి. కానీ... నాలుగు అడుగుల వెడల్పు, మూడు అడుగుల లోతు మట్టి తవ్వేసి, లోపలి నుంచి గట్టి సిమెంట్ బ్రిక్స్‌తో గోడ కడుతూ వచ్చారు. క్యూరింగ్ కూడా సరిగా చేయలేదనే ఆరోపణలున్నాయి. గోడను చేతితో పట్టుకొని గట్టిగా రుద్దితే సిమెంట్ పిండిలా విడిపోతోంది. పునాదుల కోసం తవ్విన మట్టిని గోడకు అటూ ఇటూ పోగేశారు. 4 రోజుల కిందటే ఈ గోడ నిర్మాణం పూర్తయిందనిపించారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక సింహాచలంలో ఒక్క అరగంటలోనే రెండు సెంటీమీటర్ల వర్షం కురిసింది. గోడకు అటూఇటు వేసిన మట్టి లూజుగా ఉండటంతో... వర్షపు నీళ్లు దానిగుండా గోడ కింది దాకా వెళ్లాయి. అసలే అంతంతమాత్రం నాణ్యతతో కట్టిన గోడ కావడంతో ఒక్కదెబ్బకు కూలిపోయింది. 90 శాతం గోడ పడిపోయి... చిన్న భాగం మాత్రం మిగిలింది.

పర్యవేక్షణ ఇలాగేనా?

చందనోత్సవం ఏర్పాట్లు 2 నెలలుగా జరుగుతున్నాయి. సింహాచలంలో వివిధ అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకం కింద రూ.50 కోట్లు సింహాచలం దేవస్థానానికి మంజూరుచేసింది. ఏపీటీడీసీఇంజనీరింగ్ విభాగం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లతో ఈ పనులు చేయిస్తోంది. సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం దీనిని పర్యవేక్షిస్తోంది. గోడ నిర్మాణం నాలుగు రోజుల కిందట పూర్తిచేశారు. అయితే, ఈ పనులను పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులపై లెక్కలేనన్ని ఆరోపణలు, అభియోగాలు ఉన్నాయి. పడిపోగా మిగిలిన గోడను మంత్రి అనిత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అధికారులు పరిశీలించారు. అది కూడా ఎక్కడికక్కడ బీటలువారి కనిపించింది. నిర్మాణంలో నాణ్యత లేదని వారు పెదవి విరిచారు. పనుల పర్యవేక్షణ చేసేది ఇలాగేనా అంటూ ఇంజనీరింగ్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేశారు.

డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా

»» పూర్తిస్థాయి నియామకానికి ఓకే!.. యూపీఎస్సీ ప్యానెల్ ద్వారా ఎంపిక

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చాలా ఏళ్ల తర్వాత పూర్తిస్థాయి డీజీపీ నియామకం జరగనుంది. ప్రస్తుతం ఇన్‌చార్జి డీజీపీగా కొనసాగుతున్న హరీశ్ కుమార్ గుప్తాను పూర్తిస్థాయిలో 'పోలీస్ బాస్'గా నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఢిల్లీలో బుధవారం యూపీఎస్సీ ప్రతినిధి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్‌తో కూడిన ప్యానల్ డీజీపీ ఎంపికపై సమావేశమైంది. డీజీ హోదా ఉన్న అధికారుల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితా నుంచి.. హరీశ్ కుమార్ గుప్తా, అంజనీ కుమార్, మాదిరెడ్డి ప్రతాప్ రెడ్డి పేర్లను ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వీరిలో ఒకరిని డీజీపీగా నియమించవచ్చు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్తాను ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఇన్‌చార్జి డీజీపీగా నియమించింది. పని తీరు సంతృప్తికరంగా ఉండటంతో ఆయననే పూర్తిస్థాయి డీజీపీగా నియమించాలని నిర్ణయించుకుంది. నియామక ఉత్తర్వులు జారీ చేసిన రోజు నుంచి.. రిటైర్‌మెంట్ వయసుతో సంబంధం లేకుండా రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు.

దర్యాప్తునకు సహకరించకుంటే చర్యలు తీసుకోవచ్చు

»» విజయ్‌కుమార్‌రెడ్డి కేసులో ఏసీబీకి హైకోర్టు వెసులుబాటు

»» ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మూసివేత

సాక్షి పత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారంటూ తనపై ఏసీబీ నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోసం సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) మాజీ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను హైకోర్టు పరిష్కరించింది. ఆయన దర్యాప్తునకు సహకరించకపోతే.. చట్టనిబంధనల ప్రకారం ఆయనపై తగిన చర్యలు తీసుకునేందుకు ఏసీబీ అధికారులకు వెసులుబాటు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సాక్షి దినపత్రిక, సాక్షి చానల్‌కు అనుచిత ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా.. సాక్షి మీడియా గ్రూపులో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని ఐ అండ్ పీఆర్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా చట్ట విరుద్ధంగా నియమించారంటూ విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.దిల్లీబాబురెడ్డి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ జరిపిన ఏసీబీ అధికారులు ఆయన్ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా ఆయన తరఫు న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద ఇచ్చిన నోటీసులకు లోబడి విజయ్‌కుమార్‌రెడ్డి ఏసీబీ అధికారుల ముందు హాజరయ్యారని తెలిపారు. దర్యాప్తు అధికారి కోరినప్పుడు హాజరవుతామని.. విచారణకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఏసీబీ తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఏసీబీ నోటీసు, అందులోని షరతులకు కట్టుబడి ఉండేలా పిటిషనర్‌ను ఆదేశించాలని కోరారు. దర్యాప్తునకు సహకరించకుంటే తగిన చర్యలు తీసుకునే వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థించారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మూసివేయాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కోరారని గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు వ్యాజ్యాన్ని పరిష్కరిస్తున్నట్లు ప్రకటించి విచారణను మూసివేశారు.

అంబటి ఫిర్యాదుపై నాలుగు కేసుల నమోదు

»» మరో కేసులో ఆయన బాధితుడు కాదు

»» హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ న్యాయవాది

వైసీపీ నేత అంబటి రాంబాబు ఇచ్చిన ఐదు ఫిర్యాదులకుగాను పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారని హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది బుధవారం హైకోర్టుకు తెలిపారు. మరో కేసులో పిటిషనర్ బాధితుడు కానందున కేసు నమోదు చేయలేదన్నారు. కాగ్నిజబుల్ కేసుల్లో మాత్రమే మూడో వ్యక్తి ఫిర్యాదు చేయగలరన్నారు. పార్టీ ఇన్ పర్సన్ రాంబాబు నేరుగా వాదనలు వినిపిస్తూ అసభ్యకర పోస్టుల వ్యవహారంలో తాను ఐదు ఫిర్యాదులు ఇవ్వగా అందులో నాలుగింటిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. మరో ఫిర్యాదుపై కేసు నమోదుకు పోలీసులు నిరాకరిస్తున్నారన్నారు. తమ నాయకుడి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారన్నారు. తెలుగులో వాదనలు వినిపించేందుకు అనుమతించాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు స్పందిస్తూ... తెలుగులో వాదనలకు అనుమతిస్తే మిమ్మల్ని నియంత్రించలేమని సరదాగా వ్యాఖ్యానించారు. వాదనను బలపర్చే తీర్పులను కోర్టు ముందుంచాలని ఆదేశిస్తూ విచారణను జూన్18కి వాయిదా వేశారు.

సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్‌పై విచారణ రేపటికి వాయిదా

»» కసిరెడ్డి, చాణక్యల కస్టడీ పిటిషన్‌పై నేడు విచారణ

గుణదల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ఆరో నిందితుడిగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. బుధవారం ఏసీబీ కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న శ్రీధర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. కాగా, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయాధికారి భాస్కరరావు ఏసీబీ అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఇదిలావుంటే, మద్యం కుంభకోణంలో అరెస్టయి విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కస్టడీ పిటిషన్‌పై విచారణను, చాణక్య కస్టడీ పిటిషన్‌పై విచారణను కూడా గురువారానికి వాయిదా వేసింది.

పీఎస్ఆర్ బెయిల్‌పై నేడు విచారణ

సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని మూడో అదనపు జ్యుడీషియర్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాదులు బుధవారం కౌంటర్ దాఖలు చేశారు. అనంతరం న్యాయాధికారి విచారణను వాయిదా వేశారు.

ఏసీబీ కస్టడీకి విడదల గోపి

గుణదల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని స్టోన్ క్రషర్ కంపెనీ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజినీ మరిది విడదల గోపి విజయవాడ జైల్లో ఉన్నారు. ఈయనను ఏసీబీ కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండు రోజులపాటు కస్టడీకి ఇచ్చారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇద్దరు న్యాయవాదుల సమక్షంలో విచారించాలని తీర్పులో పేర్కొన్నారు.

బోరుగడ్డ కేసు విచారణ వాయిదా

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ కేసు విచారణను అనంతపురం మొబైల్ కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. 2018లో అనంతపురం త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించారన్న అభియోగంపై అనిల్‌పై కేసు నమోదైంది. రిమాండ్ అనంతరం వాయిదాలకు హాజరు కాకపోవడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా జైలు నుంచి వీడియో కాల్ ద్వారా బుధవారం కోర్టు ఎదుట హాజరు పరిచారు. సాక్షులు రాకపోవడంతో మొబైల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి ప్రతిభ విచారణను వాయిదా వేశారు.

ప్రభుత్వ వెంచర్లో కొంటే రిజిస్ట్రేషన్ ఖర్చు తక్కువ

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రియల్ ఎస్టేట్ వెంచర్లలో(ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు), సీఆర్‌డీఏ ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలపై భారాన్ని తగ్గిస్తూ మునిసిపల్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఆమేరకు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఇకపై ప్లాట్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంటును రెండుగా విడగొట్టాలని పేర్కొంది. బేస్ ప్రైస్... అమ్మకపు ధరలో 60 శాతం, డెవలప్‌మెంట్ చార్జీలు... మిగిలిన 40 శాతం... వేరు వేరు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు తయారు చేయాలి. బేస్ ప్రైస్‌పై 7.5 శాతం, డెవలప్‌మెంట్ చార్జీలపై 0.5 శాతం రిజిస్ట్రేషన్ చార్జీ వసూలు చేస్తారు. దీంతో కొనుగోలుదారు ప్లాట్ ధరపై 7.5 శాతం చెల్లించాల్సిన అవసరం లేదు.

ప్రజారోగ్యం ఈఎన్‌సీగా ప్రభాకర్‌రావు

అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్‌రావుకు పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలిచ్చింది.



అమరావతిలో తెనాలి శిల్పకళ

అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం జరిగే వేదిక సమీపంలో తెనాలి శిల్పులు రూపొందించిన పలు శిల్పాలను ఏర్పాటు చేసినట్లు శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మే 2న ప్రధాని మోదీ అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన చేస్తున్న సందర్భంగా సూర్య శిల్పశాల ఆధ్వర్యంలో శిల్పాలను ఏర్పాటు చేశారు. ఐరన్ స్క్రాప్‌తో సీఎం, ప్రధానమంత్రి పేర్లను రూపొందించారు. గౌతమ బుద్ధుడు, మేకిన్ ఇండియా, ఎన్టీఆర్, సైకిల్ గుర్తు వంటి పలు శిల్పాలను తీర్చిదిద్దారు. - తెనాలి అర్బన్, ఆంధ్రజ్యోతి

తలెత్తుకునేలా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకారం చుట్టనున్నట్టు వెల్లడించారు. వాటితో పాటు రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు డీఆర్‌డీవో, డీపీఐఐటీ, ఎన్‌హెచ్ఏఐ, రైల్వేలకు సంబంధించిన మరో రూ.57,962 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. అమరావతి పనుల పునఃప్రారంభానికి శుక్రవారం ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై బుధవారం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. విశాఖలో ఉర్సా కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తే వారికి ఎకరా రూ.కోటి, రూ.50 లక్షల చొప్పున కేటాయించామని, అయితే 99 పైసలకే ఇచ్చామని వైసీపీ వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా రాజధానికి భూములు సమీకరించామని, రాష్ట్ర భవిష్యత్తు కోసం రైతులు భూములు ఇచ్చారని తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం

హైదరాబాద్ అభివృద్ధిలో టీడీపీ పాత్ర చెరగనిది. హైదరాబాద్ వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఆదాయం వస్తోంది. అమరావతి నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరిన్ని చేపట్టవచ్చు. రాజధాని స్వయం ఆధారిత ప్రాజెక్టు. మూడేళ్లలోనే మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తాం. విశాఖపట్నంలో టీసీఎస్ స్థాపన ద్వారా భారీగా ఉద్యోగాలు లభించనున్నాయి. భోగాపురం విమానాశ్రయాన్ని కూడా శరవేగంగా నిర్మిస్తున్నాం. శ్రీసిటీలో ఎల్‌జీ కంపెనీ రూ.5 వేల కోట్లతో పెట్టుబడులు పెట్టనుంది. దేశంలో అత్యధిక పెట్టుబడులు మన రాష్ట్రానికే వస్తున్నాయి. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర విజన్-2047 రూపొందించుకున్నాం. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికలకు ముందు చెప్పాం. ప్రజలు నమ్మి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని 93 శాతం స్ట్రైక్ రేట్‌తో గెలిపించారు. వారి నమ్మకాన్ని సాకారం చేసేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. ఈ 10 నెలల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాం. మే నెలలోనే అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభిస్తాం' అని చంద్రబాబు తెలిపారు.

3 పార్టీల కార్యకర్తలకూ ప్రాధాన్యం

కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించేందుకు నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తున్నామని సీఎం తెలిపారు. జిల్లాల పర్యటనలకు వెళ్లిన సమయంలో 8 నియోజకవర్గాల కార్యకర్తలతో నేరుగా సమావేశమయ్యానని, వారి సమస్యలు తెలుసుకున్నానని చెప్పారు. కార్యకర్తల మనోభావాలకు విరుద్ధంగా ఏ నాయకుడూ వ్యవహరించడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఎంత ప్రాధాన్యం ఇస్తానో.. కార్యకర్తలకూ అంతే ఇస్తానని తెలిపారు. కడపలో మహానాడును ఘనంగా నిర్వహించుకుందామని, ఏ ఎన్నికలు జరిగినా ఎన్డీయేనే గెలవాలని అన్నారు.

మొత్తం 1,07,002 కోట్ల పనులు

అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా మొత్తం రూ.1,07,002 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. రూ.49,040 కోట్ల రాజధాని పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రాజధాని ప్రాజెక్టులతో పాటు సుమారు రూ.57,962 కోట్ల విలువైన కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు అమరావతి వేదికగా వర్చువల్ పద్ధతిలో మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

58 వేలకోట్ల ప్రాజెక్టులు జాతికి అంకితం

రూ.58 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను అమరావతి వేదికగా మోదీ జాతికి అంకితం చేయనున్నట్టు పీఎంవో వర్గాలు తెలిపాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అనుసంధాన పథకాల కల్పనలో భాగంగా ఏడు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రారంభిస్తారని వెల్లడించాయి. ఒక రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

శంకుస్థాపనలు

- రూ.11,240 కోట్ల వ్యయంతో శాసనసభ, హైకోర్టు, సచివాలయంతో పాటు ఇతర పరిపాలన భవనాలు, 5,200 కుటుంబాలకు గృహవసతి నిర్మాణం వంటి ప్రాజెక్టులు
- కృష్ణా జిల్లా నాగాయలంకలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో సుమారు రూ.1,500 కోట్లతో నిర్మించే మిస్సైల్ టెస్ట్ రేంజ్
- విశాఖలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే యూనిటీ మాల్
- రూ.293 కోట్లతో గుంతకల్లు వెస్ట్ నుంచి మల్లప్ప గేట్ వరకు చేపట్టిన రైల్వే ప్రాజెక్టు
- రూ.3,176 కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులు

ప్రారంభోత్సవాలు

- రూ.3,680 కోట్ల విలువైన పలు జాతీయ రహదారి పనులు
- రూ.254 కోట్లతో పూర్తి చేసిన ఖాజీపేట-విజయవాడ 3వ లైన్, గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బుగ్గనపల్లి, కేయీఎఫ్ పాణ్యం లైన్‌ల ప్రారంభోత్సవం

ఎక్కడా లోపాలు రానివ్వొద్దు

'ప్రధాని మోదీ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. సభ నిర్వహణలో ఎక్కడా లోపాలు రానివ్వొద్దు' అని ఉన్నతాధికారులు, మంత్రులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రధాని సభ ఏర్పాట్లపై బుధవారం ఉన్నతాధికారులు, అందుబాటులో ఉన్న మంత్రులతో సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. సభకు వచ్చే వారికి సీట్ల ఏర్పాట్లు మొదలుకొని పార్కింగ్ వరకు ఎక్కడా ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా సభ నిర్వహణ జరిగేలా ఏర్పాట్లు ఉండాలని, పార్కింగ్ ప్రదేశాల వద్ద కూడా వర్షం వచ్చినా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు నెల్లూరు జిల్లాలో సీఎం పర్యటన

ఆత్మకూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గురువారం నెల్లూరు జిల్లా ఆత్మకూరులో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం ఉదయం 11.30కు సీఎం చంద్రబాబు ఆత్మకూరు చేరుకుంటారన్నారు. 11.50కి నెల్లూరుపాళెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొని, గిరిజనుల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అనంతరం మే డే సందర్భంగా కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు.

అమరావతిని ప్రేమించే వారందరూ ఆహ్వానితులే

»» మంత్రి పార్థసారథి

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ప్రేమించే వారంతా శుక్రవారం ప్రధాని సభకు ఆహ్వానితులేనని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. బుధవారం సచివాలయంలో మాట్లాడారు. 'మే 2న అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. ప్రధాని మోదీ పాల్గొనే సభను విజయవంతం చేయాలి. అన్ని జిల్లాల నుంచి 5 లక్షల మందిని తరలిస్తున్నాం. భోజనం, అల్పాహారం, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం' అని చెప్పారు. సభకు ప్రతిపక్ష నేతలనూ ఆహ్వానించారా? అని ప్రశ్నించగా... అమరావతిని ప్రేమించే వారందరూ భాగస్వాములవుతారని వ్యాఖ్యానించారు. పీసీసీ చీఫ్ షర్మిల వ్యాఖ్యలను ప్రస్తావించగా... ఆమె సోదరుడు జగన్ ఐదేళ్లు అమరావతిని పూర్తిగా విధ్వంసం చేస్తే.. కనీసం నోరెత్తని షర్మిల ఇప్పుడు మాట్లాడటం సరికాదన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు చొరవ చూపండి

»» సీఎం, డిప్యూటీ సీఎంకు నారాయణ సూచన

గూడూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విభజన హామీ చట్టం ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదాను సాధించేందుకు ప్రధాని మోదీ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ చూపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. తిరుపతి జిల్లా గూడూరులో బుధవారం మీడియాతో మాట్లాడారు. 'పదేళ్ల కిందట అమరావతికి ప్రధాని శంకుస్థాపన చేసినప్పుడు ఢిల్లీ నుంచి మట్టి, నీరు తీసుకొచ్చారు. గత ఐదేళ్లు మోదీతో, మాజీ సీఎం జగన్ నడిచి అమరావతి అభివృద్ధిని విస్మరించారు.' అని నారాయణ తెలిపారు.

బుడమేరు చానల్‌కు సమాంతరంగా మరో కాలువ!

»» అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బుడమేరు చానల్‌కు సమాంతరంగా మరో కాలువ తవ్వాలని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. కాలువ ఎనికేపాడు నుంచి కొల్లేరు మీదున్న ఉప్పుటేరు గుండా సముద్రంలోకి కలిసేలా సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందించాలన్నారు. బుడమేరు ఆధునికీకరణలో భాగంగా 37,500 క్యూసెక్కుల ప్రవాహానికి తగ్గట్టుగా పనులు సత్వరమే చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో బుడమేరు, పోలవరం ప్రాజెక్టుపై ఆయన సమీక్ష జరిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ చీఫ్ షర్మిల నిరసన

కాంగ్రెస్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లిన యువమోర్చా

»» పీసీసీ అధ్యక్షురాలిపై కోడిగుడ్లు, టమాటాలతో దాడికి యత్నం

»» దాడికి దిగిన వారిని అరెస్టు చేయాలంటూ షర్మిల ధర్నా



ఆంధ్రరత్న భవన్ వద్ద బీజేపీ కార్యకర్తల ఆందోళన

విజయవాడ(వన్‌టౌన్), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ యువమోర్చా నాయకులు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడికి ప్రయత్నించారు. బుధవారం గవర్నర్‌పేటలోని ఆంధ్రరత్న భవన్‌లో కార్యకర్తలతో సమావేశం అనంతరం కార్యాలయం ఆవరణలో షర్మిల మీడియాతో మాట్లాడారు. అదే సమయంలో యువమోర్చా దాడికి యత్నించింది. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అడ్డుకొన్నారు. ఈ దాడిని నిరసిస్తూ షర్మిల పార్టీ కార్యాలయ ప్రాంగణంలోనే బైఠాయించి నిరసన తెలిపారు. ప్రధాని మోదీ పర్యటనను పురస్కరించుకొని బుధవారం పీసీసీ అధ్యక్షురాలు మీడియాతో మాట్లాడారు. రాజధాని నిర్మాణం కోసం రూ.లక్షన్నర కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2015లో నీళ్లు, మట్టితో అమరావతికి వచ్చిన ప్రధాని... ఇప్పుడు ఆంధ్రకు సున్నం కొట్టేందుకు వస్తున్నారని విమర్శించారు. మోదీ దత్తపుత్రుడు జగన్.. అమరావతిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సమావేశం అనంతరం సాయంత్రం 4 గంటలకు తిరిగి గన్నవరం వెళ్లే సమయంలో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు మిట్టా వంశీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆంధ్రరత్న భవన్‌కు చేరుకున్నారు. భవనంలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. షర్మిలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమవెంట తెచ్చుకున్న కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేయబోయారు. దీనిని గమనించిన కాంగ్రెస్ నాయకులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. దాడికి దిగిన యువమోర్చా నాయకులు, కార్యకర్తలను గవర్నర్‌పేట పోలీసులకు అప్పగించారు. ఈ దాడిని నిరసిస్తూ షర్మిల పార్టీ నాయకులతో కలసి కార్యాలయం ప్రాంగణంలోనే నిరసన తెలిపారు. దాడికి ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

హౌస్ అరెస్టుపై షర్మిల ఆగ్రహం

ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో షర్మిలను హౌస్ అరెస్టు చేసేందుకు పోలీసులు బుధవారం కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి ఎస్ఎల్‌వీలోని ఆమె నివాసానికి వచ్చారు. అప్పటికే ఆమె విజయవాడ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌కు వెళ్లేందుకు బయలుదేరారు. పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. దీంతో ఆమె, వారితో వాగ్వివాదానికి దిగారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజల సమస్యలపై మాట్లాడే హక్కు మాకు లేదా? అమరావతి రాజధానిపై కమిటీ వేస్తే హౌస్ అరెస్టు చేయిస్తారా?' అని ప్రశ్నించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.